
ISSN No:2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 1 సంచిక - 8 మే - 2020 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20



సాహితీస్రవంతి



# సాహిత్య ప్రస్థానం

సంపాదకీయం

## తెలుగు మీడియంకు సమాధేనా?

హైకోర్టు ఆదేశాల తర్వాతనైనా తెలుగుమీడియం కొనసాగించే అవకాశాలుంటాయనుకుంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ససేమిరా ఒప్పుకోవడం లేదు. వాస్తవానికి ఆ తీర్పులో అత్యంత సమగ్రంగా అనేక కోణాల నుంచి మాతృభాషలో చదువు అవసరాన్ని చెప్పింది. చరిత్రనూ, విద్యారంగ పరిణామాలనూ, చర్చలనూ, రాజ్యాంగాన్ని, వివిధ ఉత్తర్వులను, విధాన పత్రాలను ఉటంకించింది. అయినా సరే ప్రభుత్వం తల్లిదండ్రుల ఎంపిక పేరిట కరోనా నీడలోనే ఒక ప్రశ్నావళి ఇచ్చి 96 శాతం మందిపైన ఇంగ్లీషు మీడియంనే కోరుకున్నారని చెబుతోంది. అయితే ఆ ఇచ్చిన మూడు ఆప్షన్స్‌లోనూ రెండు మీడియంల కొనసాగింపు అన్నది లేకపోవడం విచారకరం. ఉంటే ఎక్కువ మంది దానికే ఓటు వేసి వుండేవారు. ఎందుకంటే ఇంగ్లీషు మీడియం కోరేవారు కూడా తెలుగు మీడియం పూర్తిగా తొలగిపోవాలని భావించడం లేదు. కనుక సదరు అభిప్రాయసేకరణ సంపూర్ణమైంది కాజాలదు. హైకోర్టు ఇంకా ఎస్ఇఆర్‌టి అభిప్రాయం తీసుకోవాలని చెప్పగా దాన్ని కూడా తూతూ మంత్రంగా ముగించేసి ఇంగ్లీషు మీడియంకే ఓటేసిందంటున్నారు. దీనిపై సుప్రీం కోర్టుకు వెళ్లకుండా ఇక్కడికిక్కడే డొంక తిరుగుడు పద్ధతులలో తెలుగు మీడియంకు మంగళం పాడాలనే ఆలోచన, ఆచరణ ఆందోళన కలిగిస్తున్నాయి. అనేక కారణాల వల్ల తలిదండ్రులలో అత్యధికులు ఇంగ్లీషు మీడియంకే మొగ్గు చూపుతుండడాన్ని మేము కాదనడం లేదు. అయితే తెలుగులో చదువుకునే అవకాశం అసలు లేకుండా చేసి అధికార భాషగాతెలుగును కాపాడటం జరిగే పని కాదు. అధికార భాషా సంఘం ఇది మా పని కాదని చెప్పడం అందుకే ఆశ్చర్యం కలిగిస్తుంది. బోధనా, పాలనా, న్యాయ భాషలుగా తెలుగు కూడా వుండటమే రాజ్యాంగ ఆదేశం. నివేదికల సారాంశం. అనుభవాల సారం.

◆◆◆

కరోనా లాక్‌డౌన్ నాల్గవ దశలోకి ప్రవేశిస్తున్నది. ఇది సడలింపులతో వుండటం ఒకటైతే సవాళ్లు కూడా తీవ్రంగానే వున్నాయి. ప్రధాని ప్రకటించిన 20 లక్షల కోట్ల ప్యాకేజీ సమగ్ర స్వరూపం ఆవిష్కరించటానికి ఇంకా సమయం పట్టవచ్చు. వలస కార్మికులు, నిరుద్యోగులు, చిరుద్యోగులు, తిండి లేని పేదలు, బాలలు, వృద్ధులు వీరందరికీ ప్రత్యేక న్యాయం చేస్తూ ప్రజాస్వామిక హక్కులు కాపాడితేనే ప్యాకేజీ సార్థకమవుతుంది. ఈ ఒత్తిడిని, అభద్రతను సాకుగా చేసుకుని యాజమాన్యాలు తమ కార్మికులు, ఉద్యోగుల హక్కులు కాలరాయడం, ప్రభుత్వాలు కూడా ఆ చట్టాలను పక్కన పెట్టే జీవోలు ఇవ్వడం దారుణం. కవులూ, రచయితలూ, సాహిత్య కారులు కరోనా సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే ఈ అంశాలపైనా దృష్టి పెట్టాలి. ప్రజలను చైతన్య పరచాలి. తామూ లోతుగా అధ్యయనం చేయాలి. ముందు ముందు దీనిపై మరింత మాట్లాడుకుందాం. ◆


సంపాదకుడు
తెలకపల్లి రవి
వర్కింగ్ ఎడిటర్
వొరప్రసాద్

సంపాదకవర్గం:
కె. సత్యరంజన్ ◆ చీకటి దివాకర్
గనారా ◆ శమంతకమణి ◆ కెంగార మోహన్
మేనేజర్: కె.లక్ష్మయ్య

బొమ్మలు:
తుంబలి శివాజి
చిదంబరం
గంగాధర్ వీర్ల
ముఖచిత్రం పెయింటింగ్: లబాని జంగి

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akualvari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## కథలు


కొత్తఫ్లాట్ – దుర్గాప్రసాద్................................ 5
అతిథి– మూలం: ఆంటోని చెహొవ్
– తెలుగు: ఉషారాణి.............................. 24
మట్టి కాదు మనిషి – కళ్ళేపల్లి తిరుమలరావు......... 39
కొరియర్ – మీనాక్షి శ్రీనివాస్......................... 53
సర్పయాగం – ఉదయమిత్ర............................ 60


## కవితలు


అందలమెక్కిన అంటరానితనం – ఆశాజ్యోతి. కె........ 9
తప్పుడు పైకప్పు – పాయల మురళీకృష్ణ................. 12
ఆశాదీపాలు – దారల విజయకుమారి.................... 16
ఎర్రటి కల – గోపాలరావు కందిపాటి.................... 16
నా భార్యకు ప్రేమలేఖ – అంకే శ్రీనివాస్............... 20
మనిషి నీడలో మరోమనిషి – బత్తిన కృష్ణ............... 23
కలలు కరిగిన కడలిలో
– గంగిరెడ్డి ప్రద్యుమ్న కుమార్ రెడ్డి................ 23
టీపాయ్ – బంగార్రాజు కంఠ............................ 28
మెలకువలో – మల్లారెడ్డి మురళీమోహన్................ 31
వాళ్ళిప్పుడు – వైష్ణవి శ్రీ.................................. 38
పరిపూర్ణత – పి.వి. ప్రసాద్................................ 41
ఎలా ? – రాయపాటి శివయ్య............................ 44
మా ఊరు – ఈ. రాఘవేంద్ర............................. 59
తొలిదారిలో – రవి నన్నపనేని........................... 65


## వ్యాసాలు


సాహిత్య ప్రస్థానం ఏప్రిల్ 2020 పురస్కారాలు........ 9
మహాకవి శ్రీశ్రీ..మేడే..లాక్‌డౌన్ – తెలకపల్లి రవి.... 10
భావకవుల ప్రేమగోల 'వైతాళికులు'
– పెనుగొండ లక్ష్మీనారాయణ..................... 13
'సాహిల్ వస్తాడు' కథ – డా॥ ఎ. రవీంద్రబాబు....... 17
శ్రీరమణ నాలుగో ఎకరం కథ
– డా॥ ఎం. హనుమంతరాజు..................... 21
ఆగిపోని కవితాయాత్ర – కెంగార మోహన్........... 29
సాహిత్య ప్రక్రియగా కథ
–వల్లంపాటి వెంకటసుబ్బయ్య..................... 32
సామాజిక చైతన్య కవితా గొంతుక
– డా॥ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి............ 34
పురుషాధిక్య సమాజంపై ధిక్కార స్వరం
– వొరప్రసాద్........................................ 42
కనుమరుగవుతున్న కళారూపానికొక జ్ఞాపిక
– పొదిలి నాగరాజు................................. 45
నిర్మలంగా ప్రవహించే మనిషికోసం
– డా॥ పి.సి. వెంకటేశ్వర్లు......................... 49
అనుబంధాల సుగంధం – సమాజ హితం
– పుట్టపర్తి మల్లికార్జున...................... 49
స్వీకారం........................................... 66



ISSN No: 2581 - 7477

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా:

సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002, ఫోన్: 0866-2577248, సెల్: 9490099059

ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240/- ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 / ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000/-

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585, IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

కథ



# కొత్త ఫ్లాట్

- దుర్గాప్రసాద్
9438293453

చంద్రం కాఫీ సేవిస్తూ, వార్తాపత్రిక తిరగేస్తూ కూర్చున్నాడు. ఆకాశం నల్లగా ఉంది. వర్షం బాగా రాకముందే బ్యాంకుకు చేరుకోగలిగితే మంచిది. కానీ ఇసుక, బురద బాగా ఉండడం వలన తడవక వెళ్లగలనో లేదో, అని అనిపిస్తున్నది!

ఇంతటిలోకి జానకి గాలి వానలాగా గదిలోకి ప్రవేశించింది. నుదిటిపై చెమట బిందువు చీర కొంగుతో తుడ్చుకుంటున్నది. ముఖం మీద కోపం యొక్క ముద్ర. “ఇంకా ఎన్ని రోజులు పడుతుంది. ఫ్లాట్ తాళాలు చేతికి అందడానికి? కాస్త చెబుతారు? రోజుకు రోజు ఈ చాకిరీ చెయ్యలేక చస్తున్నాను ...”

“మళ్ళీ ఏమిటయ్యింది ఈ రోజు?” అడిగాడు చంద్రం.

“ఈ రోజు కూడా బయటకు వెళ్లలేము. అక్క, వాళ్ళ పెద్దనాన్నగారి అబ్బాయిని ఇంకా వదినని భోజనానికి ఆహ్వానించారు. బావగారు గుత్తి వంకాయ కూర కోసం వంకాయలు తేవడానికి మార్కెట్కి బయలుదేరారు!”.

“ఈ విషయం ఒక్కసారైనా ముందుగా నాకు ఎందుకు చెప్పలేదు?” విసుగ్గా అడిగాడు చంద్రం.

చంద్రానికి విషయాన్ని అర్థం చేసుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు. మొత్తం ప్లాన్ బూడిదలో పోసిన పన్నీరయ్యింది.

“ నిన్న, బావగారు, అక్క , వాళ్ళ పెద్దనాన్నగారి అబ్బాయి సోమేశ్వర్ రావుగారిని వాళ్ళ ఆవిడ్ని, ఇంకా లండన్లో పని చేస్తున్న వాళ్ళ అబ్బాయ్ కృష్ణను భోజనానికి పిలుద్దామని తమలో తాము చర్చించుకుండగా విన్నాను. నాతో ఒక మాట చెప్పాలని మీ వదినకి అన్నయ్యకి ఒక్క సారయినా అనిపించలేదు!”

“ మీకు తెలియనిది ఏముంది, అక్కకు, అసలే హై బ్లడ్ ప్రెషర్. వంటింటి ఛాయలకు కూడా ప్రవేశించడానికి వీలు లేదని డాక్టరుగారు మరి మరి చెప్పారు. నాకు వండి వార్చడంలో ఎటువంటి బాధ లేదు. నాకు కూడా చక్కగా ప్రతిదీ రుచిగా, శుచిగా వండి అందరికి పెట్టాలనే ఉంటుంది. కానీ, ఒక్క సారయినా నన్ను అడగకుండా అక్క,బావగారు ‘టేక్ ఫర్ గ్రాంటెడ్’ అయినప్పుడే, తల వేడెక్కుతుంది. కానీ ఏమి చేస్తాం ఉండేది వాళ్ళ ఇంటిలో!”.

మరింక ఓపిక, సహనం పని చెయ్యక పోవడంతో, చంద్రానికి కూడా, రోజుకు రోజు పిల్లల ద్వారా పెరుగుతున్న వత్తిడి వలన ఆఖరికి ఒక ఫ్లాట్ బుక్ చేసుకున్నాడు. ఒక ప్రక్క సంతోషంగా ఉన్నా, మనసులో అనేక సంశయాలు మెలుగుతున్నాయ్ జానకికి!.

ఫ్లాట్ చూడడానికి ఈ రోజు భార్య భర్త కూడా కలిసి చూసి వద్దామని ప్లాన్ వేసుకున్నారు. పరిస్థితులు అనుకూలించక పోవడంతో ఫ్లాట్ చూడడానికి మరొక రోజు ప్లాన్ వేసుకున్నారు. చంద్రం కూతురు కీర్తన ఇప్పటికే చదువు పూర్తి చేసి విప్రోలో ఉద్యోగం చేస్తున్నది. కొడుకు ప్రకాష్ కూడా ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరంలో ఉన్నాడు. కూతురికి పెళ్లి చేద్దామన్న సమయంలో కొత్త ఫ్లాట్ కొనడం గురించి

ఆలోచించడం అంత సమంజసం కాదు. కానీ పిల్లలు పెద్ద వాళ్ళు అవడం వలన వాళ్ళ మాట కూడా కొట్టవేయలేక పోతున్నాడు చంద్రం!

కీర్తనకు ఎప్పుడు అసంతృప్తిగా ఉండేది. తన ఫ్రెండ్స్ వలె తనకు ఒక సెపెరేట్ గది, తన గదిలో అందమైన పెయింటింగ్స్, తన బట్టలకు ఒక పెద్ద వార్డరోబ్ కలిగి ఉండాలని తరచూ మొరాయించేది!.

ప్రకాష్ మొగ పిల్లాడు కావడంతో ఇవేమి పట్టించుకునే వాడు కాదు!

పెరుగుతున్న వయసు వలన అక్క,బావగారు తరచు అనారోగ్యానికి గురి కావడం, వాళ్ళను చూడడానికి ఇంటికి వచ్చిపోయే చుట్టాల వలన ఇల్లు ఎప్పుడు ఎవరో ఒక చుట్టంతో ఉండడం వలన పిల్లలు మాతో లేక, అక్క, బావగారితో గదిని సర్దుకుంటూ ఉండేవారు.

తరచు ఏదో ఒక కారణం వలన పిల్లలు ఇంకా చంద్రానికి మధ్య వాదనలు పెరిగిపోతూ ఉండేది. ఒక స్త్రీ, భార్య, తల్లిగా నేను మధ్యలో నలిగిపోతూ ఉండేదాన్ని.

తండ్రి పోవడం వలన అన్నయ్య వదిన తనను చదివించారు. బ్యాంకులో ఉద్యోగానికి తన నాలుగు గాజులు అమ్మి సెక్యూరిటీగా ఐదు వేలు వదినె చెల్లించింది. జానకిలాంటి మంచి అమ్మాయిని చూసి పెళ్లి చేయడమే కాకుండా, పిల్లల చదువులకు కావాల్సిన ఫీజులకు అయ్యే డబ్బుకూడా అడపా దడపా సర్దుబాటు చేస్తూనే ఉంటారు. చంద్రం తన అన్న, వదిన చేస్తున్న ఉపకారానికి, ప్రత్యుపకారంగా పెద్ద వయసులో తన అన్న వదినను వదిలి వెళ్ళలేను అని అనేక సార్లు పిల్లలకు స్పష్టం చేసారు. నాకు కూడా అక్కను, బావగారిని ఈ వయసులో వదిలి వెళ్లాలని లేదు.

ఈ మధ్య కీర్తనకు అసహనం బాగా పెరిగిపోయింది. అక్క బావగారి మాటలను అస్సలు లెఖ్ఖ చేయడం లేదు.

పై పెచ్చు జవాబు ఇవ్వడం మొదలుపెట్టింది.

ఆఖరికి ఎంతవరకు వచ్చిందంటే తానే స్వయంగా తన జీతం మీద ఫ్లాట్ బుక్ చేసుకోవడానికి నిర్ణయించుకుంది.

"కీర్తన చిన్న పిల్ల,పెళ్లి అయిపోయి అత్తారింటికి వెళిపోతే, బాధ్యతలు వలన అన్ని తానే తెలుసుకుంటుంది!" బావగారు, అక్క ,తరచు కీర్తననే, వెనక వేసుకుని సమర్ధించేవారు.

జానకికి, తన స్వంత ఇంటిని అందంగా తీర్చిదిద్ది ప్రతి ఒక్కరినీ సంతోషంగా ఉంచాలనే కోరిక ఎల్లప్పుడూ ఉండేది. తనకంటూ ఒక ఇల్లు అలాగే పిల్లలకు వీలుగా వాళ్లకు నచ్చిన విధానంలో వాళ్ళ గదులు అందంగా తీర్చి దిద్దాలనేది చాన్నాళ్ల కోరిక. తన సొంత కోరికలు, అభిరుచులు, ఆనందంతో జీవించడానికి ఎవరు మాత్రం ఇష్టపడరు. కొన్ని సార్లు పరిస్థితులు పరిమితించాలగా!

చేతిలో ఉన్న టవల్ తీసుకొని, స్నానానికి వెళ్ళే ముందు జానకికి హామీ ఇచ్చాడు. "నేను ఈ రోజు బిల్డరుతో మాట్లాడతాను. బ్యాంకులో పెద్దగా పనిలేదు. వెంటనే అయిపోతుంది. షిఫ్ట్ ఎప్పుడు చేయవచ్చో చూడు. జాగర్తగా విను, మేము సాయంకాలం బయటికి వెళ్తాము అని మా వదినకు స్పష్టం చేసేయ్!"

జానకి కాస్తంత ఊపిరి పీల్చుకుంది. చంద్రం చాలాసార్లు ఇట్లాంటి హామీలు చేయడం వాటిని తీర్చకపోవడం తనకు కొత్త ఏమి కాదు. కానీ ఈ రోజు బయటపడటం సాధ్యం కాదు. ఇప్పటికి నాలుగు వారాలు బట్టి కీర్తనకు కొత్త ఫ్లాట్ చూపిస్తానని హామీ ఇస్తున్నాడు చంద్రం.

ఒక పెద్ద నిటూర్పుతో దేముడా "కీర్తన అర్థం చేసుకోవాలి"అని దండం పెట్టుకుంది"

చంద్రం, మెట్లు దిగుతుండగా జానకి అతని వైపు చూసింది. బావగారికి "వంకాయలు, సేమియా పాయసానికి జీడీ పప్పు, కిస్మిస్ పళ్ళు ఇంకా ఏలకులు తెమ్మని చెప్పాను. అసలే మతిమరుపు మనిషి. ఇప్పుడు బావగారు ఏమిటి తెస్తారో చూడండి!"

"మరి ఉండలేను. ఉదయం బి.పి మాత్ర కూడా వేసుకోలేదు!" అనుకుంటూ ఆప సోపాలు పడుతూ, అన్నపూర్ణగారు జుట్టు ముడి పెట్టుకుని, దేముడికి దీపం పెడుతూ వర్లిస్తున్నారు. ఈ రోజు వర్షం, పాలు ఆలస్యంగా రావడం వలన ఆమె అన్ని పనులు ఆగిపోయాయి.

"అక్క మీరు గదిలోకి వెళ్ళండి. టిఫిను, కాఫీ టేబుల్ మీద ఉంచాను. కాస్త విశ్రాంతి తీసుకోండి," చెప్పి, జానకి వంట పనిలో మునిగిపోయింది.

"మా సోమేశ్వరం అన్నయ్యకి పెద్దగా ఏమి అక్కర్లేదు, వంకాయ కొత్తిమీర కారం కాయలు పాళంగా, కొబ్బరికాయ మామిడికాయ పచ్చడి, ఆనపకాయ, మునకాయ్ వేసి దప్పళం, కాస్తంత వేయించిన కందిపప్పు, చిన్న బెల్లం ముక్క,ఘుమ ఘుమ లాడే నెయ్యితో, తీపి కోసం సేమియా పాయసం, పొట్టు మినప పప్పు వడలు, మొన్న పెట్టిన కొత్త ఆవకాయ్ కాస్తంత తీసి పెట్టు. వదినకు వేపడం ముక్కలు అంటే మహా

ఇష్టం. కాస్త ఇంత బంగాళ దుంపలు ఉడికించి దోరగా వేయించు. పాపం కీర్తన, ప్రకాషుకు కూడా బంగాళ దుంపల వేపడం అంటే చాల ఇష్టం" మెనూ మొత్తం అన్నపూర్ణగారు ఏకరువు పెట్టేసారు.

బావగారికి మంచి నీళ్లు అందించి, ఆయన చేతి నుంచి కూరల సంచి అందుకున్నాను.

వంట చేస్తూ కొత్త ఫ్లాట్ గురించి ఆలోచనలో పడిపోయింది జానకి.

"హాలులోకి పెద్ద టీ.వీ కొనాలి, కొత్త టీపాయ్, సోఫాలు తన పెళ్లికి వచ్చిన పింగాణి కప్పులు, ప్లేట్లు అమర్చడానికి చక్కటి గాజు అద్దాలతో కూడిన అల్మారీ అవి అమర్చాలి!"

"కీర్తన ఇంకా ప్రకాష్ గదిలో వేరే టీ.వీ, రెండు వేరువేరు మంచాలు, కర్లాన్ పరుపులు ఇంకా ప్రకాష్ లాప్ టాప్ కోసం కంప్యూటర్ టేబుల్, అలాగే కీర్తన ఆఫీసుకు వెళ్ళడానికి కొనుక్కుంటున్న డ్రెస్సులు అన్ని అమరేలా ఒక పెద్ద బీరువా కొనాలి. ఇక్కడైతే పాపం నా బీరువాలోనే తన బట్టలు పెట్టుకుంటున్నది. ప్రకాష్ కూడా బావగారి టేబుల్ మీద కూర్చొని తన లాప్టాప్లో అన్ని పనులు చేసుకుంటున్నాడు!".

"బాల్కనీలో మొత్తం పూల మొక్కలు ఇంకా అందమైన క్రోటన్స్ని పెంచేలా చేస్తాను"!

"చంద్రానికి కాస్తంత శుభ్రం కూడా లేదు. స్నానం చేసి వచ్చి ఎక్కడ పడితే అక్కడ తువ్వాలు పడేస్తాడు. అతని గురించి ఒక బట్టలు స్టాండ్ కొనాలి!"

ఆలోచనలలో ఉండగానే మొత్తం వంట పూర్తి కావచ్చింది.

కీర్తనకూడా ఆఫీసునుంచి మొదటి షిఫ్ట్ పూర్తి చేసుకుని ఇంటిలోకి అడుగు పెట్టింది.

మెల్లంగ వండిన వంటలను వేరే పాత్రలలోకి మార్చేసరికల్లా దాదాపు మధ్యాహ్నం ఒంటి గంటన్నార అయ్యింది.

ఇంతటిలోకి టాటా హెక్స కారు ఇంటి ముందర ఆగింది. లోపలినుంచి సోమేశ్వరరావు గారు అతని భార్య మీనాక్షి గారు, దాదాపు ఇరవై ఏడు సంవత్సరాల వయసుగల వాళ్ళ అబ్బాయ్ కృష్ణ లోపలినుంచి ఒక స్వీట్ పాకెట్తో ఇంటి ముందర దిగారు. అక్క బావగారు వాళ్ళని సాదరంగా ఇంటిలోకి ఆహ్వానించారు.

"మాకు ఎలాగూ పిల్లలు లేరు. మా చంద్రం పిల్లలే మా పిల్లలు!".

"పేరుకు జానకి నా తోడికోడలు కానీ నా తోబోట్టువు కన్నా నన్ను ఎక్కువగా చూసుకుంటుంది!".

"నా వంటి మీద ఉన్న పాతిక తులాల బంగారం మా కీర్తనదే. ఇంకా నీకు కట్నాలు కానుకలు కావలిస్తే, నా పసుపు కుంకం కింద మా నాన్న రాసి ఇచ్చిన మూడు ఎకరాల పొలం మీ అబ్బాయ్ కృష్ణ పేరు మీద రేపే రాసిస్తాను!".

"మీ బావగారు కీర్తన పేరు మీద దాదాపు ఐదు లక్షలు వుంచారు అవి పెళ్లి ఖర్చులకు పనికొస్తాయి !".

"చంద్రం కొడుకు ప్రకాష్ చిన్నవాడు, కీర్తన పెళ్లి తరువాత, ఇంటిమీద, వాడి కోసం రెండు గదులు వేయిస్తాను!".

"పాపం చంద్రం పిల్లలు ఎంత అవస్థ పడ్తున్నా పల్లెతు మాట అనరు. అంతా మా జానకి పెంపకం అని ఏకరువు పెడ్తున్నది అన్నపూర్ణగారు !"

"మేము మాత్రం కట్నాలు తీసుకుని ఏమి చేసుకుంటాం. మా ఒక్క అమ్మాయి పెళ్లి అయిపోయింది. ఇంకా అబ్బాయికి పెళ్లి చేసేస్తే పని అయిపోతుంది" అంటున్నారు మీనాక్షిగారు!

"మీ అన్యోన్యతను చూసాక, ఇలాంటి ఇంటినుంచి అమ్మాయిని చేసుకుంటే మాకు కూడా కలిసి వస్తుందని ఆలోచించే నేను మీ వదిన ఒక నిర్ణయానికి వచ్చాం, చేసుకుంటే మీ కీర్తనను మా ఇంటి కోడలిగా చేసుకుందామని. మరి మీ కీర్తన, చంద్రానికి మా సంబంధం ఇష్టమేనా?" అని అడుగుతున్నారు సోమేశ్వరరావు గారు!.

తలుపుచాటు నుంచుని వింటున్న కీర్తన కళ్ళల్లోనుంచి ఒక్కసారిగా అశ్రు ధార, జలపాతంలాగా కారుతున్నది .

చీర మొత్తం చెమటతో మునిగిపోవడంతో, స్నానం చేసుకుని బెంగాలీ కాటన్ చీర కట్టుకుని బయటకు వస్తుండగా కీర్తన ఏడుపు చూసి ఏమిటి అయ్యిందని ఒక్కసారిగా దగ్గరకు చేరాను. చిన్నంగా అక్క ఇంకా బావగారు మాట్లాడుతున్న మాటలు వినిపిస్తున్నాయి.

చాటునుంచి విన్న మాటలకూ మనసు మొత్తం వికలమైపోయింది.

దాదాపు ఆరుగురు మనుషులలో ఉంటున్న ఇంటిలో నలుగురు తన వాళ్లే, మిగిలిన ఇద్దరు గురించి ఒక్కసారి ఆయినా తాను ఎందుకు ఆలోచించ లేకపోయింది. పిల్లల స్వార్థంలో పడి తాను కూడా మంచి - చెడ్డ ఆలోచించ లేకపోయిందా? అని ఒక్కసారిగా తనను తానే అసహ్యించుకుంది!

"తినేది గుప్పెడు మెతుకులు తాగేది గ్లాసుడు మంచి

నీళ్లు!".

"వీటి గురించి ఇంత తాపత్రయమా?"

ఇలాంటి ఆప్యాయత అనురాగం పంచుతున్న వాళ్ళను వదిలేసి తాను ఏర్పర్చుకుందాం అన్న ప్రపంచంలో ఏమి సుఖపడతాను అని ఒక్కసారిగా నిట్టూర్చి, మొహం తుడుచుకుని హాల్లో వాళ్ళని పలకరించడానికి బయల్దేరింది జానకి!.

అందరిని సాదరంగా భోజనానికి ఆహ్వానించింది!.

అన్నపూర్ణ గారు ప్రతి వంటను పొగుడుతూ మా జానకి చేతి వంటలో అమృతం ఉంది అంటూ ప్రతిదీ చాలా ఆప్యాయంగా వడ్డిస్తున్నారు.

మీనాక్షిగారు ఇంకా వాళ్ళ అబ్బాయ్ కృష్ణ కూడా ఎంతో తృప్తిగా తింటున్నారు.

అన్నపూర్ణ గారు, నాకు అమ్మాయిని ముస్తాబు చేసి తీసుకు రమ్మని కన్ను సైగలతో సూచించారు.

వెంటనే నేను కీర్తనను ముస్తాబు చెయ్యడానికి లోపలికి బయల్దేరాను.

కీర్తన ఎవరు ఏమిటి అని ప్రశ్నల వర్షం కురిపించేస్తున్నాది.

అబ్బాయ్ ఎలాగా ఉన్నాడు అని అడిగాను? ఒక్కసారిగా సిగ్గుపడుతూ స్నానాల గదిలోకి బయల్దేరింది.

మెల్లంగ అమ్మాయిని చక్కగా ముస్తాబు చేసి వాళ్ళ ముందర తీసుకు వచ్చాను.

అమ్మాయి ఇంకా అబ్బాయ్ కాసేపు ఏకాంతంగా మాట్లాడుకున్నారు.

ఇద్దరు ఆనందంతో నవ్వుతు బయటికి వచ్చారు

"మాకు పెద్దగా జాతకాలూ పట్టింపు లేవు. మీకు ఏమైనా ఉంటె నేను మా కృష్ణ జన్మ తేదీ, నక్షత్రం అవి రాసిస్తాను!" అని సోమేశ్వరరావు గారు, బావగారుతో చెప్తున్నారు.

"మాకు, అబ్బాయికి మీ అమ్మాయి నచ్చినట్లే, మీరుకూడా ఒకసారి మా ఇంటికి వస్తే, ముహర్తం విషయాలు అవి మాట్లాడుకోవచ్చు!" అని మీనాక్షిగారు అక్కయ్యకు చెప్తున్నారు.

ఇంత సంతోషమైన వార్త వినగానే ఒక్కసారిగా నా కాళ్ళు చేతులు ఆడడం మానేశాయి.

"మేము మరి బయల్దేరుతాము" అని చెప్పడం మొదలెట్టారు మీనాక్షిగారు.

వెంటనే మా తోడికోడలు తన బీరువా నుంచి కొత్త చీర, రవిక, దేముడు దగ్గర పెట్టిన అరటిపళ్ళు తీసి బొట్టుపెట్టి మీనాక్షిగారికి అందించింది.

అందరం కలిసి వీధివరకు వాళ్ళను సాగనంపాము.

ఇంటిలోకి రాగానే ఒక్కసారిగా అక్కయ్యను పట్టుకుని బావురుమంది కీర్తన!

"పిచ్చి పిల్ల, పెళ్లి అనగానే అప్పుడే మనం పరాయి వాళ్ళం అయినట్లు బాధ పడిపోతున్నాది!" జానకి అమ్మాయికి కాస్త దిష్టి తియ్యి అని పురమాయించింది.

"నాకు బాగా అలసటగా ఉంది, కాస్త బిపి టాబ్లెట్ వేసుకుని పడుకుంటాను" చెప్పి అక్క తన గదిలోకి బయల్దేరింది.

వంటిల్లు సర్దుకుని, టీ కలుపుకుని నేను కీర్తన పెళ్లి ముచ్చట్లు మొదలెట్టాం.

కీర్తన ఆనందానికి అవధులులేవు.

గేట్ తలుపు చప్పుడు కావడంతో, గేట్ తియ్యడానికి బయల్దేరాను.

లోపలికి వస్తూ, చంద్రం చెప్పడం మొదలెట్టారు "బిల్డరుతో మాట్లాడేసాను, మరొక్క నెల, పదిహేను రోజులలలో మన ఫ్లాట్ మనకు అప్పచెప్తాడు. నువ్వు మనకు కావాల్సిన సామాన్లు లిస్ట్ రాయు. కన్స్యూమర్ లోన్ ద్వారా అన్ని ఒకేసారి కొనేద్దాం!".

మంచి నీళ్లు అందిస్తూ కీర్తన మొదలుపెట్టింది "మీకు కావలిస్తే మీరు, అమ్మ, తమ్ముడు కలిసి కొత్త ఫ్లాట్ లో ఉండండి. నేను పెద్దనాన్నను, పెద్దమ్మను ఇంకా ఈ ఇల్లు వదిలి ఎక్కడికి వెళ్ళేది లేదు!".

"నిజామా?" అని నోట్లో వేలుబెట్టి ఆనందంగా అడుగుతున్నాడు చంద్రం.

"చంద్రం, బోలెడు అంత పని ఉంది. శాస్త్రులు గారి దగ్గరకు వెళ్లి అబ్బాయ్, అమ్మాయి జాతకాలూ చూపించి త్వరగా ముహర్తలు పెట్టించాలి". కాఫీ తాగి త్వరగా బయల్దేరు అని హడావిడి చెయ్యడం మొదలుపెట్టారు బావగారు.

కీర్తనలో వచ్చిన మార్పుకు చంద్రం ఆనందానికి అవధులు లేవు.

"నిజమే ! మేఘాలు జీవితంలో తేలుతూ వస్తాయి,
వర్షం లేదా తుఫానును మోయడానికి కాదు,
సూర్యాస్తమయం ఆకాశానికి రంగును జోడించడానికి!".

♦

## పురస్కారాలు

### సాహిత్య ప్రస్థానం ఏప్రిల్ 2020 పురస్కారాలు

**పైడ్ & ప్రహేళిక**
కథకు : రూ.500/-
రచయిత : చరణ్ పరిమి

**పల్లె దోసిట్లో మట్టిగంధం**
వ్యాసానికి: రూ. 500/-
రచయిత : బుజ్జారి వేణుగోపాల్

■■■

కథకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం,
వ్యాసానికి కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

**- ఎడిటర్**

## అందలమెక్కిన అంటరానితనం !

ఆశాజ్యోతి. కె
9449672394

కరోనా కవిత

గది దాటి గడప దాటి
అడుగేస్తే
ఎటు చూసినా వెలిగిపోతున్న
అంటరానితనం !

కులాలుగా ముక్కలై
అంటరానితనం అంటకాగిన దేశంలో
కరోనా కొత్తగా తెచ్చిన అంటు రోగానికి
భారతజాతి బిత్తరపోయింది !

అంటరానితనం అది ఎటువంటిదైనా
ఎంతటి శిక్షో తెలుసుకొని బేషరత్తుగా
భరించాలని అనుభవంలోకి తెచ్చిన కరోనా
చేస్తున్న వికటాట్టహాసం
విలయతాండవం చూసి
విలపిస్తోంది కులాల సమాజం !

కనీవినీ ఎరుగని ఉత్పాతం !
భూగోళానికి అంటరానితనం !
ఎవరిని చూసినా అనుమానం!
అంటుకుంటుందని ఉలికిపాటు!

అంటరాని జాడ్యం పారద్రోలాలని
డాక్టర్లు, పోలీసులు,
పారిశుద్ధ్య కార్మికులు
అలుపులేని కృషి చేస్తుంటే
గుండె ప్రపంచమంత విశాలమై
వారిని అక్కున చేర్చుకోవాలనుకుంటోంది !

కుగ్రామమైన ప్రపంచం
ఇప్పుడు శవాలను మోస్తున్న పాడె !
వద్దనుకుంటున్న కొద్దీ టన్నుల కొద్దీ
అలవికాని అంటరానితనం!

అయ్యా మనువా !
ఇలాంటి విపత్తు ఒకటుంటుందని
ఇలాంటి రోజొకటి వస్తుందని తెలీక
మనుషుల్ని అంటరాని వారిగా విడగొట్టడానికి
పడరాని పాట్లు పడ్డావు !

దేశమంతా సవర్ణులైన
ఈ చారిత్రక సందర్భంలో
కాదనగలమాజీ
అందలమెక్కిన అంటరానితనాన్ని ?

♦



# మహాకవి శ్రీశ్రీ.. మేడే.. లాక్‌డౌన్

- తెలకపల్లి రవి

ఏప్రిల్ 30 మహాకవి శ్రీశ్రీ 110వ జయంతి. పదేళ్ల కిందట ఆయన శత జయంతి సందర్భంగా విస్తృతంగా జరిగిన సభలూ, చర్చాగోష్టులు గుర్తుండే వుంటాయి. ప్రజాశక్తి అప్పట్లో ప్రచురించిన నా పుస్తకం 'శ్రీశ్రీ జయభేరి' ఏడాదిలో మూడు ముద్రణలు పొందడం సాహిత్య రంగంలో అరుదైన అనుభవమే. పదేళ్లు గడిచిన తర్వాత ఇప్పుడు కరోనా వైరస్ కారణంగా లాక్‌డౌన్ విధించిన పరిస్థితులలో చూస్తే శ్రీశ్రీ మరింత సందర్భోచితంగా గుర్తుకొస్తున్నారు. తమ కాలానికి ప్రతినిధులుగా వుంటూనే భవిష్యత్ సందర్శనం కూడా చేయించగలిగిన వారే మహాకవులని అందుకే చెబుతారు. 'లాక్‌డౌన్, ఇంటి నుంచే పని' వంటి మాటలు చెప్పినప్పుడు ఇళ్లూ వాకిలీ వదలి దేశాలు పట్టుకుపోయిన వలస కార్మికులు ఏలినవారికి గుర్తుకు రాలేదు. కనీసం పాతిక మంది ఆకలితో మరణించిన కథనాలు వచ్చాక గాని కళ్లు తెరవలేదు (ఇప్పటికీ దానిపై నిర్మాణాత్మకంగా విధాన నిర్ణయాలు, నిధుల కేటాయింపులూ జరిగింది లేదు). లక్షోప లక్షల మంది రోడ్లు పట్టుకు తిరుగుతున్న దృశ్యాలు చూసినప్పుడు అందరికీ గుర్తుకు వచ్చిన చరణాల్లో శ్రీశ్రీ పున:ప్రత్యక్షం..'కూటి కోసం కూలి కోసం/పట్టణంలో బతుకుదామని /తల్లి మాటలు చెవిని పెట్టక/ బయిలుదేరిన బాటసారికి /ఎంత కష్టం ఎంత కష్టం..'.

మారిన ప్రపంచం, కొత్త నైపుణ్యాలు, కాలం చెల్లిన సిద్ధాంతాలు అంటూ ఊగిపోయిన వారందరికీ చెంపపెట్టుగా శ్రామిక శక్తిని గుర్తించక తప్పని పరిస్థితి వచ్చిన తర్వాత అందరూ పారిశుధ్య కార్మికుల గొప్పతనం గురించి, ఆగిపోయిన ఉత్పత్తి గురించి మూసుకుపోతున్న గనుల గురించి చెప్పుకుంటున్నప్పుడు మళ్లీ ఉత్పత్తి ప్రారంభం చేస్తే తప్ప ప్రపంచం నడవదని గుర్తించినప్పుడు 'గనిలో వనిలో కార్ఖానాలో పరిశ్రమిస్తూ పరిక్రమిస్తూ..శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని' మరోసారి అర్థశాస్త్రవేత్తలు కూడా ఒప్పుకోక తప్పడం లేదు. వారిని పాక్షికంగానైనా పని లోకి దించకపోతే మానవాళి మనుగడే లేదని అంగీకరించడం అనివార్యమైంది. మూత పడిన పారిశ్రామిక వాణిజ్య రంగాలలో పనులూ జీతాలు లేని 30 కోట్ల మంది శ్రమజీవుల బాధలు గమనించినప్పుడు, 'విలాపాగ్నులకు విషాదాశ్రులకు ఖరీదు కట్టే షరాబు లేడోయ్' అనాల్సి వచ్చింది. దిగుబడి బాగా వచ్చిందని సంతోషించిన రైతన్న కొనే నాథుడు లేక అరటి తోటలు ధ్వంసం చేసినప్పుడు, పళ్లు ట్రాక్టర్ల కింద వేసినప్పుడు..'పొలాల నన్నీ హలాల దున్నీ బలం ధరిత్రికి బలికావించే' రైతు బాధ కళ్లకు కట్టింది. అత్యంత సంపన్నమైన దేశాలలో కరోనా విషాద దాడి, పాలకుల నిర్లక్ష్యం చూస్తే 'ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం?' అనే ప్రశ్న మళ్లీ కళ్ల ముందు నిలిచింది. ఇంతటి దుస్థితి లోనూ శ్రమ జీవులు ప్రజా సంఘాలు నూతన పద్ధతులలో నిరసన తెల్పుతున్న ఉత్తేజకర అనుభవాలు

విన్నప్పుడు 'ఖండాంతర నానాజాతులు చారిత్రిక యథార్థతత్వం వినిపిస్తారొక గొంతుకతో' అనే నమ్మకం కలిగింది. ఈ పరిస్థితులలో కూడా కరోనాను గాక కుల మతాల భాషలో మాట్లాడేవారిని చూసినప్పుడు 'మాకు గోడలు లేవు/గోడలు పగలగొట్టడమే మా పని' అనిపించింది.

కేవలం పోరాటాలు ఉద్యమాలే కాదు, సవాళ్లు సంక్షోభాలు ఎన్ని వున్నా మానవాళి పురోగమనం ఆగేది కాదని శ్రీశ్రీ కి తెలుసు. 'పదండి ముందుకు పదండి తోసుకు..దారి పొడుగునా గుండె నెత్తురులు తర్పణ చేస్తూ పదండి పోదాం..' అనే పిలుపు నిరంతరం వినిపిస్తుంటుంది. శ్రమ జీవులనే కాదు, ఇప్పుడు అమితంగా చెప్పుకుంటున్న వైద్యులను కూడా శ్రీశ్రీ తన 'కవితా! ఓ కవితా!'లో ప్రస్తుతిస్తాడు. 'వైద్యశాలలో శస్త్రకారుని మహేంద్ర జాలంలో చావుబతుకుల సంధ్యాసమయంలో..' అంటూ వారి సేవలను గొప్పగా చెప్పడం ఇప్పుడు గుర్తు రాకమానదు.

ఇప్పటి వరకూ మాత్రం కరోనాను అరికట్టడంలో కార్పొరేట్ వైద్య వ్యవస్థ అక్కరకు రాదని తేలిపోయింది. ప్రజారోగ్య వ్యవస్థను కుప్పకూల్చిన పాపానికి పరిహారం రెండు లక్షల మరణాలను దాటింది. అయినా పోరాటం సాగుతూనే వుంటుంది. మనిషి ముందుకు పోవలసిందే. 'వెనక్కు తిరిగి చూసుకునే అలవాటే లేదు నాకు/అర నిముషం గడిచేసరి/ కదే నాకు గత శతాబ్ది/ ఎందుచేతంటే భవిష్యత్తు మీదే ఎప్పుడూ వుంటుంది నా నిఘా/ఇవాళ కంటే రేపు/ఎంతో బాగుంటుందంటాను నేను/'. విప్లవ చైతన్యం ప్రసరించడమే కాదు, విజ్ఞాన శాస్త్ర విజయం తథ్యమని చెప్పిన మాటలు ఈ కరోనా వైరస్‌ను ఎదుర్కొనగలమనే భరోసా ఇస్తాయి. 'చికిత్స లేదనుకున్న వ్యాధులు /చిత్తగిస్తున్నాయి పరారీ/పదార్థ విజ్ఞాన శాస్త్రం అమోఘంగా వికసిస్తోంది/ప్రాణం స్వభావం ఏమిటో/ పరిశోధనలు సాగుతున్నాయి'.

నిన్నటి పోరాటం నేడు అందుకోక తప్పదు!

శ్రీశ్రీ వంటి ప్రజాకవులు కవిత్వంలో చెప్పిన వాటన్నిటి ఆచరణ రూపం మే దినోత్సవ స్ఫూర్తి. రోజులో పదిహేను ఇరవై గంటల పాటు గొడ్డుచాకిరీ చేయించుకుంటే పుట్టిన పిల్లలను కూడా చూసుకోలేనంతగా పనిలో మునిగి తేలేవారట ఆనాటి కార్మికులు. మహా రచయిత మాగ్జిం గోర్కీ మాటల్లో చెప్పాలంటే రోజంతా పని చేసి ఫ్యాక్టరీ వదలిపెట్టిన వ్యర్థాల లాగా బయిట పడేవారట కార్మికులు. వారి పోరాటాలతోనే పని పరిస్థితులు మార్చుకున్నారు. హక్కులు సాధించుకున్నారు. సామ్యవాద సమాజాలు స్థాపించుకున్నారు. సోవియట్ విచ్ఛిన్నం తర్వాత కూడా, చారిత్రికంగా మార్పులు ఎన్ని వచ్చినా ఇప్పటికీ చైనా, వియత్నాం, క్యూబా వంటివి దానికి ప్రతీకలుగా వున్నాయి. కరోనాను అరికట్టిన చైనాపై దుష్ప్రచారాలు సాగుతున్నా వైరస్‌కు వ్యాక్సిన్‌లో 'సినోఫామ్ బయోటెక్' అనేది మొదటి దశను దాటింది. దాన్ని తట్టుకోవడం కోసమే అమెరికా హడావుడిగా తన కంపెనీ ఔషధాన్ని వినియోగించడానికి అనుమతినిస్తున్నది. ఆ సంగతి అలా వుంచితే మేడే పోరాటాల వారసత్వంతో సాధించుకున్న ఎనిమిది గంటల పనికి ఇప్పుడు ఎసరు పెట్టడానికి కరోనా సాకుగా మారింది. భారతీయ పరిశ్రమలలో సంస్థలలో 12 గంటలు పని చేయించుకోవడానికి వీలుగా ఫ్యాక్టరీ చట్టాలనే మార్చేస్తున్న విపరీతం చూస్తున్నాం. 'నిన్న విరమించిన పోరాటం /నేడు అందుకోక తప్పదు' అన్నట్టు పాత హక్కులు పరిరక్షించుకోవడానికి కూడా ఇప్పుడు ఉద్యమించవలసి వస్తున్నది.

**లాక్‌డౌన్ లేని పీడన**

చివరగా వర్తమానం లోకి. లాక్‌డౌన్ పొడిగింపు విషయానికి వస్తే మోడీ ప్రభుత్వ అసమగ్ర పోకడలకూ అరకొర విధానాలకూ అది అద్దం పడుతుంది. పైన ప్రస్తావించుకున్న అంశాలతో సహా అసంఖ్యాకమైన సవాళ్లు దేశం ముందు పరుచుకుని వున్నాయి. రాష్ట్రాలకు ఆర్థిక సహాయం చేయకపోగా రావలసిన నిధులు కూడా ఇవ్వకపోవడంతో ప్రజల అవసరాలను ఆరోగ్య సంరక్షణ బాధ్యతలను నెరవేర్చడం శక్తికి మించిన వ్యవహారంగా మారింది. కేరళ వంటి రాష్ట్రాలు ముందు నుంచి స్పష్టమైన విధానంతో సత్ఫలితాలు సాధించినప్పటికీ ఆర్థిక లోటు వెంటాడుతున్నది. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ఆర్థిక కొరతతో పాటు విధాన పరమైన లొసుగులు కూడా సమస్యను సంక్లిష్టం చేశాయి. కేంద్రం పొడగింపులు, సడలింపులు అంటూ నిర్దేశకాలు ఇవ్వడమే గాని రాష్ట్రాలలో అమలుకు సంబంధించి స్పష్టత ఇవ్వదు. ఆర్థిక బాధ్యత అసలే తీసుకోదు. కరోనా చావులు, ఆకలి చావులు అంటూ పోటీ పెట్టి కంపెనీలు మూయడం తెరవడమే సమస్య అన్నట్టు మాట్లాడటం పాక్షికత్వం అవుతుంది. పైగా ఉత్పత్తి, ఉపాధి అంటూ యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు కార్మికులను ఉద్యోగులను వదిలేయడం,

# తప్పుడు పైకప్పు

పాయల మురళీకృష్ణ
8309468318



దీపంబుడ్డి ఆరిపోకుండా అడ్డుపెట్టిన
చేతుల్లాంటి గుడారం
చీకటి సముద్రాన్ని సుఖంగా ఈది
పగటితీరానికి
రెక్కల్లేని పక్షులతో సహా ఎలా చేరుతుందో
పక్కనే చెట్టుకు కట్టిన జాబిలికి తెలుస్తుంది

కడలి బోర్లించినట్లున్న ఆకాశం క్రింద
అలలపై నడిచే పాదాలకు
పైకప్పు శూన్యమైనంత మాత్రాన కల చెదిరిపోదు
వల గురితప్పదు

హరిత ఛత్రాలైన
వ్రేలాడే ఉద్యానవనాలను
వింతగా భావించే కవ్వింతల్లో
బాబిలోనియా జీవనం
పూరీతీరంలో సైకత శిల్పంలా
ఒకరోజు మెరిసి మాయమైపోతుంది

నిర్విరామంగా పనిచేసి శీతలయంత్రం
నడకలో కాలు బెణికినట్లు ఆగిపోయి
ఊపిరి రూపుతున్నా సరే
తప్పుడు పైకప్పుకింద ఏం తప్పిపోయిందో
తెలుసుకోలేని మెలుకువ కమ్ముకుంటుంది

అలికిన గడపకి నిద్రని కట్టి మరచిపోయి వచ్చిన శరీరం
పింగాణీ మట్టి క్రింద
చలువరాతిపై చేరబడి
కళ్ల చుట్టూ నిశిని పూసుకుంటుంది

రేపటికి ఓ కొత్త సదుపాయమై
త్వరితగతిని రూపాంతరం చెందే
విపణి బందిలదొడ్డిలో కట్టేయబడ్డ మనిషి
రూపాయల కట్టలా రెపరెపలాడకపోతే దినందీరదు

ఇప్పుడు
తప్పనిసరి అనుకున్న తప్పుడు పైకప్పు కింద
కిందకి మరింత కిందకి
దిగజారిపోవడమేంటా అనుకునే ఆలోచనను
తాజా పేపర్లో
"గోప్ప భారతదేశ పండగ"
తన జేబులో వేసుకొని రెండు పేజీల ప్రకటన చేతుల్తో
అలవోకగా తన వెంట లాక్కుపోతుంది

◆

---

వారి ఒత్తిడిపై పని గంటలు పెంచి భద్రతా బాధ్యతలు తగ్గించడం పరిస్థితిని ఇంకా దుర్భరం చేస్తుంది. పైగా పని ప్రదేశం లోనే అందుబాటులో వుండాలన్నట్టు కూడా చెబుతున్నారు. ఇదంతా ఆచరణలో ఎలాంటి సమస్యలకు దారితీసేది చెప్పడం కష్టం. ఆర్థిక మాంద్యం, నిరుద్యోగం, పనులు పోతున్న పరిస్థితి పనివారిని గత్యంతరం లేని స్థితికి నెట్టే ప్రమాదం చాలా ఎక్కువ. పైగా మొత్తం పాత వారందరినీ తీసుకోవడం కూడా జరగదు. ఈ పేదలు అసంఘటిత కార్మికుల ఆకలి తీర్చడానికి రూ.60 వేల కోట్లు కావాలని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ వంటి వారంటున్నారు. కాని కేంద్రం అదే మొత్తం నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ వంటి మోసకారుల ఎగవేత బకాయి మాఫీకి మళ్లిస్తున్నది! ఇక్కడ మళ్లీ శ్రీశ్రీ చరణాలు 'పేదల రక్తం దాల్చిన రూపం/బలిసిన జలగలు దాచిన పాపం/ దేవతలను ఆడించే డబ్బు / మానవులను పీడించే డబ్బు /తెలుపో నలుపో జానేదేవ్/ ఆ తేడాలిక్కడ లేనేలేవ్'. ఏతావాతా కరోనా నివారణ కోసం చేతులు కడుక్కోవడం, దూరం పాటించడం, ఇంట్లోనే వుండటం వంటివి మాత్రమే సరిపోవు. మన చేతులు కడుక్కోవడంతో పాటు పాలక వర్గాల మాయదారి చేతలను కూడా ప్రక్షాళన చేయకపోతే ప్రజలపై దోపిడీ మరింత తీవ్రమవుతుంది. అలా జరగకూడదంటే మేడే అమరవీరులు చూపించినట్టు, మహాకవి చెప్పినట్టు 'పదండి ముందుకు పదండి తోసుకు' అనవలిసిందే!

◆




# భావ కవుల ప్రేమ గోల 'వైతాళికులు'

- పెనుగొండ లక్ష్మీనారాయణ
94402 48778

తెలుగు సాహిత్యానికి పుష్టినీ, తుష్టినీ చేకూర్చినదిగా చెప్పుకోబడినది ముద్దుకృష్ణ సంకలనం చేసిన 'వైతాళికులు' కవితా సంకలనం. తెలుగులో 1935లో వెలువడిన ఈ తొలి కవితా సంకలనం ప్రతి ఇంటా ఉండదగిన ఉత్తమ గ్రంథంగా 'జనహిత' సూచించింది.

ముద్దుకృష్ణ రాసిన ముందుమాటలో తెలుగు సాహిత్యంలోని కొన్ని పరిణామ దశలను రేఖామాత్రంగా వివరించారు. నవయుగం శీర్షికన రాసిన మాటల్లో తెలుగునాట వీరేశలింగం పంతులు లక్ష్యీకరించిన నూతనాదర్శాలతో అంధయుగం సమసిపోయి భావసంచలనం తీవ్రంగా కలిగిందన్నారు. వీరేశలింగంను యుగకర్తగా కీర్తించారు. తెలుగు సారస్వత చరిత్రలో నవయుగ స్థాపనాచార్యులుగా గిడుగు, గురజాడలను కొనియాడారు.

విశాలాంధ్ర ప్రచురించిన ఈ పుస్తకంలో తుమ్మల వెంకట్రామయ్య మే 1973లో రాసిన 'సంస్కృతి' వుంది. ముద్దుకృష్ణ జీవిత విశేషాలతో పాటు సాహిత్యకృషినీ పరిచయం చేశారు. ఈ సంకలనం ప్రచురణలో ఆయన ఎదుర్కొన్న ఇబ్బందులనూ వివరించారు. 1935లో జ్వాల, బెజవాడ ప్రచురించిన ఈ సంకలనం పలు ముద్రణలు పొందింది. పొందుతూనే వుంది.

ఈ సంకలనం గురించి అనేక అనుకూల, ప్రతికూల విమర్శలు వెలువడ్డాయి. లోపాలను ఎత్తిచూపారు. చర్చోపచర్చలు జరిగాయి. మళ్లీ ఎనిమిదన్నర దశాబ్దాల అనంతరం కొద్దిపాటి పరిశీలన. మూల్యాంకాల, పునర్మూల్యాంకాల కాలం కదా యిది.

సంఘ సంస్కరణోద్యమ నేపథ్యం కలిగిన ముత్తాత సామినేని ముద్దు నరసింహం నాయుడు, వీరేశలింగం అనుయాయి అయిన తండ్రి ప్రభావం కూడా బాల్యంలోనే ముద్దుకృష్ణ (రాజమండ్రి, 1899–1973) పై పడింది. అతని 'అశోకం' నాటకం సంచలనం కలిగించింది. అతి కొద్ది కాలమే నడిపినా 'జ్వాల' పత్రిక యువతరంలో కొత్త ఆలోచనలను రేకెత్తించింది. బ్రహ్మచారి అయి వుండీ రాసిన 'దాంపత్య దీపిక' ఎన్నో కాపురాల్లో దీపాలను వెలిగించింది. తెలుగు సాహిత్య సాంస్కృతిక రంగాలకు చెందిన ఎందరో ప్రముఖులతో పరిచయం, స్నేహం కలిగిన వ్యక్తి ముద్దుకృష్ణ.

'1920 నాటి జాతీయోద్యమ ప్రభావం వల్ల స్వాతంత్ర్యాభిలాష కల్గింది. ఇదే 1932–1933 జాతీయద్యమంలో పాల్గొనటానికి ప్రేరేపించింది.' అని తుమ్మల వారు ముద్దుకృష్ణ జాతీయోద్యమ ప్రవేశం గురించి రాశారు. 1941లో ప్రథమ ముద్రణ పొందిన 'ఎక్కడికి' ముద్దుకృష్ణ కథల సంపుటిలో 1935 ప్రాంతంలో జ్వాల పత్రికలో ప్రచురితమైన 19 కథలున్నాయి. 1980లో విశాలాంధ్ర చతుర్థ ముద్రణగా తీసుకొచ్చింది. ఈ సంపుటిలోని కథల్లో సంఘ సంస్కరణ కాంక్ష, జాతీయోద్యమం అభిలాష స్పష్టంగా కనపడతాయి. ముఖ్యంగా వీరేశలింగం పంతులు, రఘుపతి వెంకటరత్నం నాయుడుల ప్రభావంతో రాసిన 'కాలం కల్పించే మార్పు' కథానిక, జాతీయోద్యమ స్ఫూర్తిని రగిలించే 'హక్కులు'1 మరియు 2' కథలు అందుకు గట్టి ఉదాహరణలు.

ఇంతటి నేపథ్యం వున్న ముద్దుకృష్ణ 1932–33 సంవత్సరాలలోనే 'వైతాళికులు' సంకలనం తేవటానికి కృషి ప్రారంభించి 1935 నాటికి తేగలిగారు.

ఈ వైతాళికులు సంకలనం నాటికి తెలుగు

సాహిత్యంలోని పరిస్థితిని తెలుసుకుందాం. "1920ల ప్రారంభదినాలవి. ఆ రోజుల్లోనే జమీందారీ కవిత్వాన్ని తోసిరాజని భావకవిత్వం రంగ ప్రవేశం చేసింది. 1910 – 20ల మధ్య ఈ ఉద్యమాన్ని ప్రారంభించినవారు రాయప్రోలు, అబ్బూరి, అయితే దీనికి 20లలో అఖిలాంధ్ర ప్రాచుర్యం ఇచ్చినవాడు కృష్ణశాస్త్రి". అన్నారు శ్రీశ్రీ (కృష్ణశాస్త్రి ఐదవ సంపుటిలో ప్రచురితమైన 'ఆస్వాదానికి ఆహ్వానం'లో).

1930లలో భావకవిత్వ తిరోగమనం ఆరంభమైంది. తరువాత నవ్య కవిత్వం వీటన్నిటిపై తిరుగుబాటుగా అభ్యుదయ కవిత్వం ప్రారంభమైంది.

తాను సంకల్పించిన వైతాళికులు సంకలనానికి సహకారాన్ని ముద్దుకృష్ణ భావకవితా ప్రక్రియ ప్రవక్త, ప్రచారకుడూ అయిన దేవులపల్లి కృష్ణశాస్త్రి సహకారాన్ని తీసుకున్నారు. తెలుగులో తొలి శ్రవ్యనాటకం ముద్దుకృష్ణ రాసిన 'అనార్కలి'. 1935లో ఆకాశవాణి ద్వారా ప్రసారమయిన ఈ నాటకంలో కృష్ణశాస్త్రి సలీం పాత్రధారి. కాబట్టి వీరిద్దరి మైత్రీబంధం వైతాళికులు ప్రచురణకు ముందునుండీ కొనసాగింది.

వైతాళికులలోని కవితల ఎంపిక కృష్ణశాస్త్రిదే. పరిశీలించి చూస్తే ప్రతి పుటలోనూ కృష్ణశాస్త్రి ముద్ర కనిపిస్తుంది. ఈ సంకలనం ప్రధానంగా భావ కవిత్వానికే ప్రాతినిధ్యం వహిస్తుంది. ముద్దుకృష్ణ పాత్ర కేవలం సంకలనకర్త పేరుకు మాత్రమే పరిమితమయ్యింది. తెలుగు సాహిత్యంలో అద్వితీయుడైన గురజాడ 'దేశభక్తి' గీతానికి ద్వితీయ స్థానాన్నిచ్చి భావ కవితా ఆద్యుడైన రాయప్రోలు 'జన్మభూమి' కి ఈ సంకలనంలో ప్రథమ స్థానాన్ని కల్పించారు. మొత్తం 26 మంది కవుల 191 కవితలున్న ఈ సంకలనంలో దేవులపల్లి వారివే అత్యధికంగా 20 కవితలున్నాయి. కొడవటిగంటి వెంకటసుబ్బయ్యది ఒక్క కవిత మాత్రమే వుంది. రాయప్రోలు జన్మభూమితో ప్రారంభమైన ఈ సంకలనం శ్రీశ్రీ మహాప్రస్థానంతో ముగిసింది. సంపాదకుడైన ముద్దుకృష్ణ కవిత లేదు. ముద్దుకృష్ణ ఒకటీ ఆరా కవిత్వ రచన చేసి వుండవచ్చు గాని కవిగా ప్రచారం పొందలేదు. సంకలనంలోని ఇరవై ఆరు మంది కవులలో దువ్వూరి రామిరెడ్డి, నాయని సుబ్బారావులు మాత్రమే బ్రాహ్మణేతరులు (నాకు తెలిసి), ముద్దుకృష్ణ కూడా బ్రాహ్మణేతరుడే. ఇందులో అత్యధిక భాగం భావ కవిత్వమే. శీర్షికలను చూస్తేనే ఈ విషయం తెలుస్తుంది.

ఉదాహరణకు కొన్ని శీర్షికలు: ఆమె కన్నులు, ఓయీ!, ఓ సఖీ!, నేటి రేయి, పూలబాసలు, ప్రణయ యాత్ర, ప్రణయ లేఖలు, ప్రణయ శాంతి, ప్రణయినీ గీతం, ప్రియుని నిరీక్షణం, ప్రియుడా!, ప్రేమకొరకు, ప్రేమ తత్త్వము, ప్రేమ యాత్ర, ప్రేమావధి, ప్రేయసీ, రంభ, వాల్జడ, విరహవీధి, సఖీ, సింగారము మొదలైనవి. ఇవి పైన కనపడుతున్నవి. కొద్ది మినహాయింపులతో మిగిలినవన్నీ భావ కవిత్వ పోకడలు పోయినవే. సంకలనం భావకవుల ప్రేమగోలగా కనిపిస్తుందనడంలో సందేహం లేదు. 'భావకవులు ప్రణయవ్యాధిగ్రస్తులై ఉన్నారన్న' జాషువా మాటలకు ఈ సంకలనం ఒక నిదర్శనం. వైతాళికము సంకలనంలోని కవులలో కొందరికి జాతీయోద్యమంతో సన్నిహిత సంబంధాలు వుండగా, కొందరు జాతీయోద్యమంలో కూడా పాల్గొన్నారు. అట్టివారిలో అడివి బాపిరాజు 1922లో సత్యాగ్రహోద్యమంలో పాల్గొని సంవత్సరం పాటు జైలుశిక్ష అనుభవించారు. కొడాలి ఆంజనేయులు 1924లో జాతీయోద్యమంలో భాగమైన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని నాలుగేళ్ళు జైలుశిక్షను అనుభవించారు.

జంటకవులైన కాటూరి, పింగళి మరియు బసవరాజు అప్పారావు గాంధీ సిద్ధాంతాలతో, గాంధీ నడిపిన ఉద్యమాలతో ప్రభావితులైనవారు. సౌదామిని (బసవరాజు రాజ్యలక్ష్మి – బసవరాజు అప్పారావు సతీమణి) వార్ధా మహిళాశ్రమంలో మహాత్ముని వద్ద మూడేళ్ళు శిక్షణ పొంది వ్యష్టి సత్యాగ్రహంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. తల్లాప్రగడ సుందరమ్మ సంఘసంస్కరణోద్యమంలో పని చేయటమే గాక 1930లో జాతీయోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. అస్పృశ్యతా నివారణకు కృషిచేశారు. మల్లవరపు విశ్వేశ్వరరావు 1932 సత్యాగ్రహోద్యమంలో జైలుకెళ్ళారు. అయితే వైతాళికులలో ఎంపికచేసిన వీరి కవితలలో జాతీయోద్యమ ఛాయలు కూడా కనిపించవు– అయితే కొడాలి ఆంజనేయులు కవిత 'జైలులో చందమామ' లోని "రాతిగుండెలు గలిగిన రాచబటుల/ కర్కశఘాతముల మేను కందిపోయె,/ శీతల హిమాంబు కణముల చిల్కరించు/ అమృతకిరణాల స్పృశియింపు మయ్య మమ్ము!" చరణాలు హృదయానికి తాకుతాయి. అతని జైలు జీవితాన్ని తెలుపుతాయి. ఈ కవితా భావకవితా బంధనాలలో చిక్కుకున్నదే. ఈ సంకలనంలోని కొందరు కవుల ఉనికి తరువాత కనపడలేదు. కృష్ణశాస్త్రి అభిమానం వలన చేరినవారే.

1932–35లలో జాతీయోద్యమం ముమ్మరంగా జరుగుతూ వుంది. ఎందరో దేశభక్తులు కారాగార క్లేశాలను అనుభవిస్తున్నారు. 1931 మార్చి 23న భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు అమరులైనారు. దేశంకోసం త్యాగపూరిత ఉద్యమాలు జరుగుతున్నాయి. ఈ కాలంలో జాతీయద్యమ

కనీస ప్రభావం కనిపించకుండా వెలువడిన సంకలనం 'వైతాళికులు'. ఇది ఆశ్చర్యం కలిగించే విషయం. దేవులపల్లి కృష్ణశాస్త్రి చేతుల్లోకి వెళ్లాక ముద్దుకృష్ణ జాతీయోద్యమ భావాలు నిషేధమయ్యాయి. ఈ సంకలనంలో గురజాడ, శ్రీశ్రీ, కొద్ది మేరకు రాయప్రోలు కవితలు మాత్రమే గమనించదగినవి. గౌరవించదగినవి.

అయితే ఈ సందర్భంలో భావ కవిత్వ ధోరణులను నిరసిస్తూ, విమర్శిస్తూ భావ కవులెవరూ సమాధానం చెప్పటానికి సాహసించలేని విధంగా ఘాటైన రీతిలో అక్కిరాజు ఉమాకాన్త విద్యాశేఖరులు (గుత్తికొండ గ్రామం 1889-1932) 1926లో వెలువరించిన 'నేటి కాలపు కవిత్వం' పుస్తకం పేర్కొనదగినది. అబ్బూరి, శ్రీశ్రీలు కూడా ఉమాకాన్తంకు ఎవరూ జవాబు చెప్పలేకపోవటాన్ని గుర్తించారు. తెలుగు సాహిత్యంలో తీవ్ర సంచలనం కలిగించిన ఈ గ్రంథం ద్వారా ఊగుడు మాటలు, పులుముడు, వికారాలు, దూడపేడ సంస్కృతం, దండగణం వంటి సామాన్య పదాలతో వారి వారి కవితలను అందుకు ఉదాహరణలుగా తీసుకొని భావ కవిత్వంపై తీవ్రంగా దాడిచేశారు ఉమాకాన్తమ్.

ఉమాకాన్త విద్యాశేఖరులు ఈ పుస్తకంలోని 'అనౌచిత్యాధికారం' అధ్యాయంలో చెప్పిన ఈ మాటలు భావకవులందరికీ చెంపపెట్టే కాకుండా వారికి యిచ్చిన సముచిత సలహా కూడా.

" 'మా అభినవాంధ్ర కవి మిత్రమండలి వారందరూ నా ప్రాణమిత్రులు' అని యెంకి పాటలకర్త తెలిపిన అభినవాంధ్ర కవిత్వ మిదే అయితే దీంట్లో వున్నది ఆధునికత్వంగాని అభినవత్వం గాదని దీన్ని అభినవమన్నా ఆధునికమన్నా యిట్లాటివి చిరకాలము నుండీ వున్నవని ఇవే ఉత్తమ కవిత్వమనుకొనడం అజ్ఞానమని ఈ ఆధునిక కవిత్వం చాలావరకు దుష్టమని ఈ కృతుల్లో చాలామట్టుకు శృంగారం చిల్లర శృంగారమై క్షుద్రమైనదని ఈ రకపు క్షుద్ర కవిత్వానికి చేరిన యిట్లాటి మండల్లు అంతగా శ్రేష్టమైనవి గావని ఇది కవిమిత్రమండలి అయినప్పుడు ఈ కవులను ఉత్తమ మార్గాలకు ప్రేరించడం ఈ మిత్రుల ధర్మమై వుండగలదని చెప్పుతున్నాను."

'నేటికాలపు కవిత్వం' ఇప్పుడు లైబ్రరీలలో బూజు పట్టి పోతోంది' అని శ్రీశ్రీ అన్నా, 'ఉమాకాంతం గారు భావకవిత్వం గురించి చేసిన నిర్ణయాలు కాలంలో నిలవలేదు' అని చేరా అన్నా వారు చేసిన విశ్లేషణలు, వ్యాఖ్యలు మాత్రం విలువైనవి, ప్రామాణికమైనవి.

వైతాళికులు సంకలనంపై మరో తీవ్ర విమర్శ గుర్రం జాషువా (1895-1971) వంటి ప్రసిద్ధుని కవితా ఖండికలను చేర్చలేదని. దీనిపై ముద్దుకృష్ణను సమర్థిస్తూ, విమర్శిస్తూ అనేకులు వ్యాఖ్యలు చేశారు. కొందరు కావాలనే జాషువాను చేర్చలేదంటే మరికొందరు సమాచార లోపం వల్లనే చేర్చలేకపోయారన్నారు. కృష్ణశాస్త్రి భావాల మేరకు కావాలనే జాషువాతో సహా మరికొందరిని చేర్చలేదని నా అభిప్రాయం. అటువంటి వారిలో జాషువాతో సహా త్రిపురనేని రామస్వామి చౌదరి (1887-1943), మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి (1895-1950), కనుపర్తి వరలక్ష్మమ్మ (1896-1975), తుమ్మల సీతారామమూర్తి (1901-1990), పురిపండా అప్పలస్వామి (1904-1982) లెక్కతీస్తే ఇంకా మరెందరో ఉన్నారు. ప్రాంతాల వారీగా చూస్తే వేదుల సత్యనారాయణ శాస్త్రి (భద్రాచలం) తప్పితే తెలంగాణా నుంచి మరెవరూ కనపడరు. ఉభయగోదావరి జిల్లాలు, కృష్ణ, గుంటూరు జిల్లాలవారే అధికంగా కనవడతారు. రాయలసీమకూ అన్యాయం జరిగింది. గురజాడ, అబ్బూరి, శ్రీశ్రీలు వున్నారు కాబట్టి ఉత్తరాంధ్ర సరేసరి. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన డజను మందికి ఈ సంకలనంలో చోటు కల్పించారు. దేవులపల్లి తూర్పుగోదావరి జిల్లా పిఠాపురానికి చెందినవారు. దీన్నిబట్టి ప్రాంతీయాభిమానం కూడా చోటుచేసుకుందని తేటతెల్లమవుతుంది. కులాభిమానం సరే.

ఈ సందర్భంలో ఇంకో సంకలనం గురించి గుర్తుచేయాల్సిన అవసరముంది. అది దక్షిణ భాషా పుస్తక సంస్థ సహకారంతో ప్రతిమా బుక్స్ మే 1959లో ప్రచురించిన 'నవీన కావ్యమంజరి'. సంకలనకర్త: ముద్దుకృష్ణ. ఈ సంకలనంలో జాషువా కవితా ఖండికలు శ్మశానవాటి, శిశువు, శిల్పిని చేర్చారు. బహుశా, వైతాళికులపై వచ్చిన విమర్శను దృష్టిలో పెట్టుకొనే ముద్దుకృష్ణ ఈ పని చేసివుంటారు. ఈ ఖండికలు ప్రాచుర్యం పొందినవే అయినా జాషువా భావజాలానికి ప్రాతినిధ్యం వహించేవి మాత్రం కావు. అభ్యుదయ సాహితీవేత్త అయిన పురిపండా కవితలు చేమంతి, చందమామలను ప్రచురించారు. ఇవి కూడా వారి ప్రాతినిధ్య రచనలు కావు.

తెలుగు కవిత్వంలో ఇప్పటికి దాదాపు వెయ్యి కవితా సంకలనాలు వచ్చివుంటాయి. అందులో సాహిత్య సంస్థలు, సంఘాలు ప్రచురించినవీ, వ్యక్తులు ప్రచురించినవీ, భావజాలాల వారీగా, ప్రాంతీయ నేపథ్యంలో వచ్చినవీ వున్నాయి. వార్షిక, దశాబ్ది కవితా సంకలనాలు వస్తున్నాయి. వీటన్నింటిలో ముఖ్యమైన, మరీ ముఖ్యమైన, అతి ముఖ్యమైన కవితా సంకలనాలను ఈ తరం కొరకు పరిచయం చేయాల్సిన అవసరముంది. ♦

## కవిత

# ఆశాదీపాలు

దారల విజయ కుమారి
9177192275



సామాజిక వర్గాలుగా
ఒకరి పైన ఒకరుండే
నిచ్చెన మెట్లకై నిక్కచ్చిగా నినదించి

రాకెట్ యుగంలోనూ
వర్ణాలు బరువును
భుజాలపై మోసుకుంటూ
రెండు గ్లాసుల పద్ధతులతో
చెప్పులు చేతబట్టి నడుస్తున్న
బడుగుల జీవనాల
అడుగుల భారాలను చూసే
అక్షరాలకు ఆందోళనలు వచ్చాయ్

మనిషిగా
పరిమళించని తనాలను పూజిస్తూ
ఇంకా...స్వప్నాలలోనే ఉన్న
సమసమాజ భావనలకోసం
బాటలై..
నిమ్న జాతుల...బలవంతపు
ఏకాంతాలను..ఏకాకితనాలను
మైదానాల లోకి మళ్ళించే
మలుపులై
ఆదిమ సమాజంలో అయిపు
లేకుండా

సమాజం చాపకిందకి
చప్పుడు చేయకుండా వచ్చి చేరిన
కులాలు...వర్గాలకు
కనువిప్పుల కథలై
పంచభూతాలకు లేని
వెలిని...వెట్టిని చూస్తూ
విస్తుపోతూ
తలకెత్తబడి తరతరాలుగా
మోస్తున్న..తక్కువతనాలను
తలెత్తి అడిగాయి అక్షరాలు

గూడెం గుడిసెలలో
గూళ్ళు కట్టుకొని
కిచకిచ లాడాయి అక్షరాలు
అగ్ర అమానుషాల..ఆగడాలు
గుట్టును గుప్పెడు
గుప్పుమనేలా విప్పేసి
బహుజనుల బలిమికోరి
వెలి వాడలలో
వెలుగులై విరబూసాయి
అణగారిన అనుభూతుల చుట్టూ
అల్లుకుని..

ఆశాదీపాలుగా మారి
కునారిల్లిన వర్గాల కోసం
కూడగట్టే పాటైన అక్షరాలు
దగాపడిన గాయాల ఆనవాళ్ళు
దాచుకుని
మతం చీడకు మాడిమసైనా
మహోన్నత మానవత్వాన్ని
మళ్ళీ మళ్ళీ మోసులేయించే అక్షరాలు
ఎప్పుడూ అణగారిన వర్గాల పక్షమే ♦

---

# ఎర్రటి కల

గోపాలరావు కందిపాటి
9652174640



పుట్టుకకు
గిట్టుబాటు ధర రద్దు చేసి
శ్రమ కొలమానం
దేహానికి
తలమానికం ఐయింది.

ఆకలి ఆదేశాల మేరకే
అసమానతల తక్కెడ కూడా
అవసరాల సరుకుల్ని తూచింది.

అట్టడుగున ఉన్నా
హక్కెక్కడికి పోతుందని
కాసే కాపులో
వేరూ షేరడిగింది .

అన్నాన్ని సృష్టించే
రేగటి చెలకల కలువల్ని
నాగలి సంతకం చేసి
చెమట కాల్వలకి
రాసిచ్చింది.
పనిముట్టు కోని చేతుల్ని
రద్దైన రేషన్ కార్డుల
అరదండాలేసి
ఊరు వెలేసింది . ♦

## విశ్లేషణ

# సాహిల్ వస్తాడు కథ

## వ్యక్తిత్వం - మతం - సమాజం




అఫ్సర్



డా॥ ఎ. రవీంద్రబాబు
8008636981

అఫ్సర్ గత ఏడాది జనవరిలో తన కథల్లోంచి కొన్నింటిని "సాహిల్ వస్తాడు మరికొన్ని కథలు" పేరుతో వెలువరించాడు. "సాహిల్ వస్తాడు" కథా శీర్షికనే సంపుటికీ పెట్టాడు. అంటే ఈ కథ ఎంత ప్రాధాన్యత గలిగిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఈ కథా లోతుల్లోకి తొంగిచూస్తే.. మైనరిటీల అభద్రత, అస్తిత్వం, సమూహంలో ఏకాకితనం, రెండు మానసిక ప్రపంచాల మధ్య ముస్లింల మానసిక వేదన, కౌటుంబిక బంధాల్లోని ఆత్మీయత, వైయక్తిక సమ్మతమై, సమాజం సమ్మతం కానీ బాహ్య మానసిక జీవన నడవడిక, ఇస్లాంలోని స్వచ్ఛత... ఎన్నో అంశాలు రంగురంగుల రెక్కల్లా, బాధామయ శోకంలా దృశ్యాల్లా కదలాడతాయి. తనను తాను అపసవ్యదిశలోకి మార్చుకోని జీవన సౌందర్య స్వేచ్ఛాగానానికి, తితలీ(సీతాకోక చిలుక)లో దాగిన అమాయకత్వపు లేలేత నిజాయితీకి ఈ కథలోని సాహిల్ ఓ నిర్వచనంలా నిలుస్తాడు.

1980ల తర్వాత తెలుగు సమాజం తన సాహిత్య గతిని మార్చుకుంది. అస్తిత్వాలకు పురుడుపోసింది. తెలుగునేలపై చోటుచేసుకున్న అనేక సామాజిక సంఘటనలు, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు అస్తిత్వ సాహిత్య ఉద్యమాలకు దారితీశాయి. ముఖ్యంగా 20వ శతాబ్ది చివరి దశాబ్దం.. సామూహికత్వంలోంచి చలనశీలమైన స్వీయ వ్యక్తీకరణలకు తావిచ్చింది. ప్రతి మనిషికి సంబంధించిన భావ, బౌద్ధిక సంఘర్షణలు, సంవేదనలు, సంలీనతలు.. అన్నీ చారిత్రక, సామాజిక, సాంఘిక, ఆర్థిక నేపథ్యంతో ముడిపడినవేనని రుజువుచేశాయి. ఏకరూపాత నుంచి భిన్నత్వ భావనాలోకాల్లోకి సమాజం వెళ్లిపోయింది.

అగ్రరాజ్య ఆధిపత్యం, చమురుకై పోటీలు, ఉగ్రవాద ముద్రలు.. జీవన పార్శ్వాలకు, సున్నితమైన అంశాలకు సైతం మతం పులమటం, మైనరిటీ అంటూ అభద్రతలోకి నెట్టివేయటం, బాబ్రీ మసీదు విధ్వంసం, తర్వాత చెలరేగిన అల్లర్లు, గుజరాత్ సంఘటన, వరల్డ్ ట్రేడ్ సెంటర్ పై దాడి, దాని పర్యవసానాలు... ఈ క్రమంలో ముస్లింల జీవితాల్లో చోటుచేసుకున్న అభద్రత, అస్తిత్వం, బతుకులు, సడలుతున్న ఆత్మవిశ్వాసం, వీటి నుంచి ఉద్భవించే ప్రశ్నలు.. ఎన్నింటినో సాక్ష్యాలుగా మైనారిటీ వాదం చూపిస్తుంది. సంఘర్షణ, దాని తాలూకూ రాజీ, మింగుడుపడని వాస్తవాలు, ధ్వంసం మవుతున్న బాహ్య, అంతర్ మైనారిటీ జీవితాలను కవిత్వం, కథ, నవలలుగా తీసుకొచ్చింది ఈ వాదం. తమదైన టోన్ ను వినిపించే ప్రయత్నం చేశారు ఎందరో ముస్లిం సృజనకారులు. ఆత్మన్యూనత నుంచి అస్తిత్వ పెనుగులాట వరకు, కన్నీళ్ల నుంచి పోరాటం వరకు సాగిన, సాగుతున్న మైనారిటీవాద సాహిత్యంలో ఎన్నో మలుపులు, మెరుపులు ఉన్నాయి. ఈ క్రమంలో అఫ్సర్ రాసిన "సాహిల్ వస్తాడు" కథా స్థానాన్ని, నేపథ్యాన్ని, వస్తువును, పాత్రల అనుభూతులను, ఆవేదనలను, సామాజిక సందర్భాన్ని, కథా రీతిని గమనిస్తే...

"సాహిల్ వస్తాడు" కథా శీర్షికలోనే సాహిల్ కనిపించడంలేదన్న భావన వ్యక్తమవుతుంది. మరి సాహిల్ ఎక్కడకు వెళ్లాడు? ఎందుకు వెళ్లాడు? అసలు కనిపించకుండా పోవడానికి కారణం ఏమిటి? సాహిల్‌కు సంబంధించిన వ్యక్తులు ఎవరు? వాళ్లు సాహిల్ కోసం ఎలా ఎదురు చూశారు?

సాహిల్‌ను వెతకడం కోసం ఎలాంటి ప్రయత్నాలు చేశారు? సాహిల్ కనిపించకుంటే అతడికి సంబంధించిన వాళ్ల పరిస్థితి ఎలా ఉంది?... కథా శీర్షికే ఇలాంటి ఎన్నో ప్రశ్నలను సంధిస్తుంది. ప్రతి ప్రశ్న వెనుక దాగిన జవాబుకోసం మనల్ని కథలోకి లాక్కుపోతుంది.

రాము దృష్టికోణంతో నడిచే ఈ కథ కలతో, కలత నిద్రతో మొదలవుతుంది. చార్మినార్ చుట్టూ జరిగిన అల్లర్ల అలికిడి, తెగినకలలో సీతాకోక చిలుక గుంపుల శవాలు.. వాటి అలికిడితో మొదలవుతుంది. ఆ స్థలంతో అతడి ఇద్దరు స్నేహితులు ఫణి, సాహిల్‌కు ఉన్న అనుబంధాన్ని వివరిస్తూ ముందుకు సాగుతుంది. వాళ్ల ముగ్గురు అక్కడ టీలు తాగుతారు. కబుర్లు చెప్పుకుంటారు. చాయ్ బిస్కెట్ తోపాటు, సాహిల్ గజళ్లు వాళ్ల మధ్య తితల్లా ఎగురుతూ మనసులకు రంగులు అద్దుతాయి.

"ప్రేమంటే ఏమిటో తెలుసుగాని అందాల నా చెలికి నా ఇల్లే తెలియదు.

దేవుడి పేరు వింటే విన్నదేమో కాని ఆమెకి అతని జాడే తెలియదు.

మరీ పరధ్యానంగా వున్నానేమో, యవ్వనపువనం ఎప్పుడొచ్చి ఎటు వెళ్లిందో తెలియదు.

వసంతం వాకిట నిల్చుందని తెలుసుకానీ, ఆకురాలు కాలమని తెలియదు." ఇలాంటి పాటలు సాహిల్ సమక్షంలో సంగీత సాహిత్యాల పోటీలా ఉంటాయి. సాహిల్ అద్భుతమైన పాటగాడు. స్వచ్ఛమైన పదాలతో అతనే పాటగా మారిన వ్యక్తి.

రాము కూతురుకు తితలీ అని పేరుపెట్టింది కూడా అతనే. "ఈ చిన్నీకి రెక్కలు లేవనే కాని, సీతాకోక పాపలా పుడితే అది ఇలాగే ఉంటుందిరా" అని ఎనిమిదేళ్ల పాపను ముద్దుచేయగల అమాయకుడు. తితలీ "మామూ" అంటూ అతనితో ఆత్మీయంగా ఆడుకుంటుంది. కబుర్లు చెప్తుంది. "తితలీ దగ్గరకు వస్తే తప్ప అతనికి ఆత్మశాంతి ఉండదు".

రాముకు సాహిల్‌తో పరిచయం చదువుకునే రోజుల నుంచి ఉంది. అతడి ఆత్మాభిమానం, మంచితనం, నిజాయితీ.. అన్నీ తెలుసు. తను హసీనాను ప్రేమిస్తూ, కలలో నిద్రలో చేస్తున్న పనులు బాగాలేవు అని స్నేహితుడితో చెప్పిన వ్యక్తి. ఏదయినా వొక విషయం దాస్తే రాత్రంతా నిద్రపట్టని మనిషి. "తప్పు చేస్తున్నానన్న భావం ఇస్లాం దృష్టిలో అలాగే వుండనివ్వదు" అని నమ్మి, ప్రేమించిన హసీనాను పెళ్లి చేసుకున్న నిజమైన ఇస్లాం. అంతేకాదు, "ధర్మ బద్ధం కానిపని ఏదీ నేను చేయలేను. అది కేవలం నా శరీరానికి మాత్రమే పరిమితమయ్యే విషయం అయినప్పటికీ" అన్న ఫిలాసఫర్. భార్య హసీనా, కొడుకు ఫైజ్, స్నేహితులు ఫణి, రాము మాత్రమే అతడికి తెలిసిన ఆత్మీయ ప్రపంచం. అలాంటి సాహిల్ హటాత్తుగా కనిపించకుండా పోతాడు.

దాని వెనుక మత మౌఢ్యంతో చార్మినార్ చుట్టూ జరిగిన అల్లర్లు, శవాల చప్పుళ్లు. ముస్లింలపై జరిగిన దాడులు.. అనేకం. ముస్లింలను అనుమానించడం, అవమానించడం, అరెస్టులు చేయడం, తద్వారా వాళ్ల కుటుంబాలను అభద్రతాభావంలోకి, సంఘర్షణలోకి నెట్టివేయడం లాంటివి ఎన్నో.. అలాంటి నేపథ్యంలోంచే సాహిల్ కనిపించకుండా పోవడాన్ని చూడాలి. ఆ సామాజిక, రాజకీయ, మత పరిస్థితుల నుంచి సమాజం అతడిని చూసే దృష్టికోణాన్ని చెప్పాడు అఫ్సర్. అతడి గురించి అన్నీ తెలిసిన ఆత్మీయ స్నేహితుడు నోరు విప్పలేని నిస్సహాయత, అతడి కుటుంబానికి భరోసా ఇవ్వలేని బాధ, కూతురుతో ఆ విషయాన్ని ఎలా షేర్ చేసుకోవాలో తెలియని మౌనం... ఇవన్నీ కథలో కనిపిస్తాయి. సాహిల్‌ను రెండు ప్రపంచాలుగా చూసే సర్కిల్‌కు, తన భార్యకు ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? చెప్తే పర్యవసానం ఏంటి అనే బాధ రామును భయపెడుతుంది. పోలీస్ స్టేషన్‌లో జరిగే సంఘటనలో...

సాహిల్ కనిపించడం లేదని అతని భార్య, రాము, ఫణి వెళ్తే.. ముస్లింతో స్నేహం చట్ట విరుద్ధమైనట్లు చూస్తాడు సర్కిల్. "వొక్క విషయం చెప్పాలి. అతను ముస్లిం, మీరు హిందువులు. అతనిది ముస్లిం మైండ్! ముస్లింమైండ్ అంటే వయిలెంట్. అంత తేలిక కాదు అర్థం చేసుకోవడం. అది వొక మిస్టరీ! మీకు తెలియని లైఫ్ అతనికి చాలా వుండి వుంటుంది. ఇన్ని బాంబు బ్లాస్టులు, బస్సులు తగలబెట్టడాలూ, చావులూ, హత్యల తర్వాత కూడా మీకీ విషయం అర్థంకాకపోతే మీరు వొట్టి అమాయకులైనా అయి వుండాలి. లేకపోతే, తెలియని మాయలో ఇరుక్కొని వుండాలి." అంటాడు. అది రామును భరించలేనంతగా బాధపెడుతుంది. వాళ్ల స్నేహంమీద నమ్మకాన్నే ప్రశ్నిస్తుంది. రెండు కుటుంబాల మధ్య ఎప్పటి నుంచో ఉన్న తెగని బంధాన్ని, ఆత్మీయతని ప్రశ్నిస్తుంది. నమ్మకంతో అర్ధరాత్రి తన ఇంటికి వచ్చిన సాహిల్ భార్య హసీనా నమ్మకాన్నీ ప్రశ్నిస్తుంది.

ముస్లిం వ్యక్తులను అలాంటి సందర్భంలో సమాజం చూసే విధానం, వాళ్లను అంచనా వేసే ఆలోచనలు ఎంత

దుర్మార్గంగా ఉంటాయో చెప్పే సంఘటన అది. వ్యక్తిని మతం కోణంలో, అప్పటి వరకు జరిగిన అల్లర్లతో ముడిపెట్టి మంచితనాన్ని, హృదయసౌకుమార్యాన్ని కర్కశంగా.. వాళ్లకై వాళ్లు తమదైన దృష్టితో చూడడం ఎంత దుర్మార్గమో చెప్తుంది. మతం అనేది మనిషిని, వ్యక్తిత్వాన్ని, చర్యలను అర్థం చేసుకునే దిక్సూచిలా మారిన వైనానికి నిదర్శనం ఈ సంఘటన. అంతేకాదు సాహిల్ గురించి, అతని వ్యక్తిత్వం, నిజాయితీ, దృక్పథం, మంచితనం, ఆదర్శాల గురించి తెలిసిన రాము ఏమీ చెప్పలేక పోవడం, చెప్పలేని పరిస్థితి దాపురించడం ఎంత దయనీయమో చెప్పే సఘంటన. ముస్లిం వ్యక్తైన సాహిల్‌కే కాదు, రాములోని మూలాలని, మానవీయమైన వాళ్ల స్నేహబంధాల్ని, నోరు విప్పలేని నిస్సహాయ స్థితిని ప్రశ్నించే సంఘటన.

హిందువైన రాముకే రక్తం ఉడికిపోతా ఉంటే.. సాహిల్ భార్య హసీనాకు– " హసీనాకు ఎప్పుడూ గుర్తుంటుంది కదా? అంటే. ఆ ముస్లిం అన్న లేబుల్ కింద పడాల్సిన అవమానాలు, అనుమానాలూ అన్నీ ఈ పాటికి అనుభవించే వుంటుంది! కాదంటావా? అని ఫణి ప్రశ్నిస్తాడు". దానికి రాము దగ్గర సమాధానం ఉండదు. అంటే నిజమనే అర్థమన్నమాట.

"పొద్దున ఇంటి నుంచి బయటికి వెళ్లిన మనిషి సాయంత్రం సజావుగా వస్తాడో రాడో తెలియని ఈ నగరపు బతుకులో– మతం అనేది చివరికి కలహకారణంగానే మిలిగిపోయిన ఈ రోజువారీ హింసలో.. ఆందోళన తట్టుకోలేక తప్పనిసరిగా పోలీస్ మెట్లు ఎక్కాల్సి వచ్చింది."

మతం మనుషుల మధ్య ఎలాంటి చిచ్చు రేపుతుందో, హింసతో ప్రాణాలు ఎలా తీస్తుందో తెలిపే వాక్యాలివి.

పోలీస్ స్టేషన్‌లో జరిగిన సంఘటననే రాము పిడుగు పడినట్లు భావిస్తుంటే.. నమ్మకమైన స్నేహంలోని పొరలు ఒక్కొక్కటి విప్పుతూ ఆత్మీయ మిత్రుడి స్వచ్ఛమైన హృదయాన్ని, వయిలెంట్ మైండ్‌గా చూస్తుంటే.. తట్టుకోలేకుంటే ... భార్య–

"మీరేమీ అనుకోనంటే వొక మాట అడగనా? ఆ పోలీసు స్టేషన్లో మీరు విన్నది నిజమేనేమో! మనకు తెలియని యాంగిల్ సాహిల్‌లో ఇంకోటి ఉందేమో" అంటుంది. ఆ మాటలు అతడిని మరింత బాధపెడతాయి. ఆ మాటలు సాహిల్ లోని మరో కోణాన్ని కాదు, అది వారి స్నేహాన్ని ప్రశ్నిస్తున్నట్లు అనిపిస్తుంది. సాహిల్‌ది అలాంటి వ్యక్తిత్వం కాదని బల్లగుద్ది చెప్పగల మనసును నిలదీస్తుంది. అప్పటి వరకు సాహిల్‌ను ఒక మంచి మిత్రుడిలా చూసిన తన భార్య నీరు అతడిని ముస్లింలా చూడటాన్ని, మతంతో ముడిపెట్టి అతడి వ్యక్తిత్వాన్ని. చర్యలను అంచనా వేయడాన్ని తట్టుకోలేడు.

"నువ్వెవరికీ ఏమీ సమాధానం చెప్పలేవు. ఇప్పుడంతా సాహిల్‌ని ముస్లిం అనే చూస్తారు. కాని మనిషి మిస్ అయ్యాడని అనుకోరు అలా వుంది ఇప్పుడు పరిస్థితి" అన్న మూడో మిత్రుడు ఫణి మాటలు గుర్తొస్తాయి. రచయిత కూతురు తితలీ "సాహిల్ మామూ వస్తాడు. తనతో ఆడుకుంటాడు" అన్న ఆశతో కథ ముగుస్తుంది.

కథలో సాహిల్ వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా చెప్పి, కేవలం ముస్లిం మతస్తుడైనందున అతడిని సమాజం చూస్తున్న కోణాన్ని చిత్రించాడు అఫ్సర్. సాహిల్ ను అనుమానించడానికి పాతబస్తీ అల్లర్లు, వాటి వల్ల హైదరాబాద్‌లో నెలకొన్న పరిస్థితిని నేపథ్యంగా ఎంచుకున్నాడు. ముస్లింలలో ఉన్న మంచితనాన్ని కూడా మతంతో ముడిపెట్టి, ముస్లింల అందర్నీ వయిలెంట్ మైండ్ సెట్ ఉన్న వాళ్లలా చూసే వాళ్ల మైండ్ సెట్టే వయిలెంట్ అని తెలియజేశాడు. ఒక మనిషికి మరో రంగు పులిమి, వాళ్ల కోణంలో చూసే విధానం ఎలా ఉంటుందో, అందుకు మతం కారణమైతే ఎలా ఉంటుందో కూడా కథలో చూపాడు. అప్పటివరకు మనతో కలిసి, మనతో ఉన్న వ్యక్తిని సైతం నమ్మలేని దయనీయ పరిస్థితిని నీరు మాటల ద్వారా వ్యక్తీకరింపజేశాడు అఫ్సర్.

సాహిల్ వస్తాడా, రాడా, ఎక్కడికి వెళ్లాడు? రాకపోతే భార్య హసీనా, కొడుకు ఫైజ్ పరిస్థితి ఏంటి? సాహిల్‌ను ఉగ్రవాదిగా చూస్తున్న సమాజం వాళ్లను ఎలా ట్రీట్ చేస్తుంది? సమాజం ముస్లింలను మంచిగా చూడలేని పరిస్థితి ఎందుకు వచ్చింది? వ్యక్తికి, మతానికి ఉన్న సంబంధం వ్యక్తిత్వాన్ని ఎందుకు నిర్ణయిస్తుంది? మనిషిని మనిషిగా చూడలేని దుస్థితి వెనకున్న కారణాలేంటి? సాహిల్ గురించి బల్లగుద్ది చెప్పగల రాము నోరు విప్పితే పరిస్థితి ఏ విధంగా ఉండేది? నీరు ఆలోచన మారడం వెనుక ఎవరి ప్రభావం ఉంది? పసిపాప తితలీకి సాహిల్ మామ గురించి అర్థమయ్యేలా రాము ఏం చెప్పగలడు? వంటి ఎన్నో ప్రశ్నలు కథ ముగిసినా పాఠకుల మదిలో అలానే నిలిచిపోతాయి. వెంటాడతాయి. వేటాడతాయి. ఒక నిజాయితీగల ముస్లిం వ్యక్తిని, పైగా కనిపించకుండా పోయిన వ్యక్తిని, అతడి కుటుంబాన్ని.. మతంతో ముడిపెట్టి సమాజం చూసే దృక్కోణం, బాధ్యతగల పోలీసుల ఆలోచనాతీరు... దానివల్ల వాళ్లు ఎదుర్కొనే కష్టాలు, కన్నీళ్లే ఈ కథ.

♦

**కవిత**

# నా భార్యకు ప్రేమలేఖ

**అంకే శ్రీనివాస్**
**9652471652**



నాకు పుస్తకం చదవడమంటే
నాకూతురు నా బుగ్గమీద  పెట్టిన
తడియారని ముద్దు లాంటిది.
తల్లి లేని నాకు
తడిసిన నా బుగ్గల్ని పుస్తకమే కొంగుకాగితంతో
తుడిచింది.

ఎక్కడెక్కడి పుస్తకమానవులు!
నువ్వు రాకముందు నుండీ నా వెంట నడిచింది వీళ్ళే.
ఇప్పుడు నేను తినే ప్రతి మెతుకు మీదా
వీరి పేర్లే ఉంటాయి.
నన్నొక పుస్తకంగా మలుస్తున్న నువ్వే ___
పుస్తకాన్ని సవతిలా భావించడం బాలేదు.
ప్రేమకి బానిసని నేను
నిన్ను వదల్లేను, నీ సవతిని వదల్లేను.

పుస్తకాలున్న ఇల్లు సారవంతమై ఫలవంతమైన నేల.
పుస్తకం లేని ఇల్లు
మనుషులుండీ లేని ఊసరక్షేత్రం.
నాకు ఇల్లంటే ___
ఇంతపెద్ద ప్రపంచాన్ని
నాలుగ్గోడల మధ్యకు తీసుకు రావడం.
ఇంకా కుదించి చెప్పనా!
ప్రపంచమంటే సంక్షిప్తం చేసిన పుస్తకం.

నిజమే! ఇల్లంతా ఆవరించిన పుస్తకాలు,
మామిడాకులతో తోరణాలు కట్టినట్లు
పుస్తకతోరణాలు కడదాం.
వస్తువులతో  అలంకరించినట్లు
ఇంటిని జ్ఞానంతో అలంకరిద్దాం.
మనిషికి జ్ఞానమే అలంకారం.


నీటిని చినుకుతాళ్ళతో తోడుకొనే నేలని
గానం చేసిన పుస్తకాలు,
అరచేతిలో ఎండిపోయిన కాలువలకు హరిత క్షేత్రాల్ని
వాగ్దానం చేసిన పుస్తకాలు,
దుఃఖాన్ని ఎర్రని పతాకాలు ఎగరేసిన పుస్తకాలు,
అక్షరాలై అనువదించిన అనుభవాలు,
అనుభవమొక్కటే సత్యమని తేల్చిన పుస్తకాలు.
అందుకే ఇవి మనిషి వాసన వేస్తాయి.

అడవిలో గలగల పాడే వృక్షాలే
చేతిలో రెపరెపలాడే పుస్తకాలు.
పుప్పొడి రేణువులై ఎగిరిపోయి
ఎక్కడైనా మొలకెత్తే విత్తనాలు కదా పుస్తకాలు.
నీకొక మాటిస్తున్నాను,
ఏదో ఒకనాడు ఈ పుస్తకాల్లో ఖచ్చితంగా
నా పుస్తకాలూ కలుస్తాయి.

చదవడం నాకొక వ్యాపకం కాదు.
చదవడం  నా ప్రాణవాయువు,
నా జీతాన్ని జీవితాన్ని కరిగిస్తూ
నన్ను చిరంజీవిని చేస్తున్నది పుస్తకాలే కదా!
నన్నిలా వదిలేయ్!
నిరంతరం ప్రపంచంతో సంఘర్షిస్తూ గానీ సంభాషిస్తూ
గానీ బతికేస్తాను
చదువుతూగానీ రాస్తూగానీ
నా చివరి వీడ్కోలు తీసుకుంటాను. ♦

## నచ్చిన రచన

# శ్రీరమణ నాలుగో ఎకరం కథ




శ్రీరమణ




- డా॥ యం. హనుమంతరాజు

9441130264


నేను ఇటీవల శ్రీరమణ గారు వ్రాసిన "నాలుగో ఎకరం" కథను చదివాను. దాదాపు 2000 సం॥లో కార్పొరేటు వ్యవస్థలు మొదలయి, దాని హవా బాగా ఉన్నప్పుడు ఒక పల్లెటూర్లో వ్యవసాయ భూములు రేట్లు పెరిగి, ఒక ఆసామి దగ్గర వ్యవసాయం చెయ్యలేక ఉన్న భూమిని కొనుక్కొని స్కూలు, ఆసుపత్రి లేదా రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వచ్చి బేరం కుదుర్చుకొని, అడ్వాన్సు ఇవ్వటం జరుగుతుంది. ఆ ఆసామి బీడుపడిన 12 ఎకరాల భూమిని తను, తన కుమారుడు, కుమార్తె మూడు వాటాలుగా చేసుకొని, కూతురు వాటా భూమిని పెళ్ళప్పుడు ఇచ్చేస్తాడు. రేటు పెరిగిన తర్వాత ఆ కూతురు తనకు రావలసిన ఆ "నాలుగో ఎకరం" గురించి తండ్రిని అడుగుతుంది. ఆ విషయం కొడుకుతో ఎట్లా చెప్పాలా, వాడు ఏమంటాడో అని ఆ ఆసామి పడే వేదన "నాలుగో ఎకరం" కథ.

పెదకాపు అనే ఆసామి, ఆయన కొడుకు సాంబ. ఆయన స్నేహితుడు మరియు ఆ ఊర్లో ఉన్న గుడి పూజారి కృష్ణస్వామి, ఆయన కొడుకు. ఈ నలుగురితోనే ఈ కథను సజీవంగా శ్రీరమణ నడిపించారు. ఒకప్పుడు బాగా వ్యవసాయం చేసిన ఆ పెదకాపు జ్ఞాపకాలు చెప్తుంటే ఆ కాలానికి మనం వెళ్తాము. నాగలి చెక్క తయారు చెయ్యడం, ఏరువాక మొదలు పెట్టడం, ఎద్దులకు కట్టే తాళ్ళు పేనటం, చంద్రకోలా గురించి, దరుస్మాసం ఉదయం వేళలో గుళ్లో ప్రసాదాలు తినటం, ఇవన్నీ కూడా శ్రీరమణ మనకు కళ్ళకు కడతారు.

పెదకాపు, కృష్ణస్వామి ఎంత స్నేహితులో వాళ్ల కొడుకులిద్దరూ కూడా అంతే స్నేహితులు. పెదకాపు కొడుక్కి చదువబ్బదు కాని, కృష్ణస్వామి కొడుకు దగ్గర్లోని కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తుంటాడు. ఆసామి భూములు కొనటానికి వచ్చిన రియల్‌ఎస్టేట్ వాళ్ళు, ఆసామి కొడుకుతోనే బేరం కుదుర్చుకొని అడ్వాన్సు ఇస్తారు. తనకు ఏదో మాటవరసకు తర్వాత ఇస్తానన్న నాలుగో ఎకరం గురించి కూతురు తండ్రిని అడగటం వలన ఆ తండ్రి ఇప్పుడు కొడుకుకు, కూతురుకు ఏం చెప్పాలో, ఎట్లా చెప్పాలో, కథ చివర్లో నలిగిపోతాడు. పల్లెటూళ్ళలో కూడా అంతరించిపోతున్న మానవ సంబంధాలు, రియల్ ఎస్టేట్ వలన నష్టాలు, ఒకప్పుడు బాగా వ్యవసాయం చేసినా, లాభదాయం గాక బీడు పెట్టిన ఆసాముల వ్యథ దీంట్లో మనకి సజీవంగా కనిపిస్తాయి.

వ్యవసాయం గురించి "అకాల వర్షాలు, వాయుగుండాల అతివానలు, పంట అనర్థాలు, దళారీ రాజ్యం అన్నీ కలిసి సేద్యగాళ్ళ వెన్ను విరుస్తోంది. అందరూ తలొక బిరుదుతో ఆఖాశానికెత్తే వారేగాని, రైతన్నని ఆదుకునే ఆపన్న ప్రసన్న హస్తం లేదు" అని అంటారు. ఏరువాక గురించి చెపుతూ "ఏఋవాక పున్నమికి అడుగులు అరకలకు పసుపు, కుంకాలు పెట్టి, కొబ్బరికాయలు కొట్టి హారతిలిచ్చి ఎదుర్రావడం రివాజు. నాగలి బుజానేసుకెళుతుంటే తీర్థానికి పిలగాణ్ణెత్తుకెళ్తున్నంత సంబరంగా వుండేది" అంటారు.

పెదకాపు గురించి చెపుతూ, "వున్నా పోయినా మాట తప్పనివాడు కనుక పెదకాపు అయ్యాడు. ఏళ్ళతరబడి గొడ్డుచాకిరీ చేసిన దుక్కిటెద్దుని శక్తివుడిగిపోగానే నిర్దయగా

వదిలేయకుండా, వాటి అగ్రు (ఎద్దు మెడభాగం) కడిగి పోషించాడు. పాలతో, అగ్రులు కడిగాక, యిక కాడికి స్వస్తి, అవి ఉన్నన్నాళ్ళూ చలవ తాటాకు పందిళ్ళ కింద, ఎండుగడ్డి పరుపుల మీద లేత పచ్చికలు నెమరేస్తూ కాపుని దీవిస్తూ కాలం వెళ్ళబుచ్చుతాయి.

తాడిపండు రుచిని "మీరు తినరుగాని సాములూ, రుచంటే తాడిపండుదే రుచి. మూడు ముంజలూ ముదిరి, మూడు టెంకలవుతాయ్. చెట్టున పండి రాలాక దాన్ని పద్ధతిగా కాల్చి, ఇదిగో ఇట్టా తింటుంటే ఉంటదీ చెప్పలేను. మామిడిపండు తింటే ఆ మజా తింటున్నంతసేపే. తాడిపండు రుచి ఆ రోజంతా మనల్ని తరిమిద్ది" అంటారు.

నాగలి తయారి గుఱించి "అబ్బో! ముందసలు నాగలి దుంపకి దుంగ దొరకాల. ఫుల్ చేవపట్టి ఉండాలి. పది జానల తుమ్మ మొద్దుని నాలుగు అమావాశ్యెలపాటు నీళ్ళలో ఊరెయ్యాలి. దాన్ని బయటకు తీసి ఓ నెలపాటు ఎండలో పడెయ్యాలి. పై బెరడు శుభ్రంగా వొలవాల. అప్పుడు బెమ్మం బాబాయ్ దాన్నితట్టి, తిప్పి అన్ని దిశల్నించే చూసి, మాంచి లగ్గంపెట్టి పనిలోకి దిగుతాడన్న మాట. అబ్బో ! అదో పెద్ద అంగామా" అంటూ గొప్పగా ఆసామి చెప్తాడు.

పెదకాపు స్నేహితుడు, హితుడూ అయిన అర్చకస్వామికి పంపాల్సిన మోయిన్లపట్టీ ఈ విధంగా వల్లిస్తాడు. "పెదమూట బియ్యం, తగినన్ని సంబరాలు, బెల్లం మాత్రం దండిగా ఉండాలి. దేవుడికి యెన్న ఇష్టం. అన్నీ జాగ్రత్తగా చూసుకోండి. సాంబయ్య, మంచి అరటిగెల, కొబ్బరికాయలు ముఖ్యం. మంచి గుమ్మడీ... మరి నాలుగు పచ్చికూర్లుండాలి. అయ్యోరికి, అమ్మగారికి పట్టు చదింపులు మర్చిపోకండమ్మాయ్. ఇస్తరాకుతో మొదలుపెట్టి తమలపాకు దాకా తల్చుకుంటే మధ్యలోవన్నీ గుర్తొస్తాయ్. చిట్టెమ్మా, ఇంకా నలుగుర్ని పిలుచుకో. అన్నీ ఒక్కసారిగా తీసికెళ్ళండి. నీ పెళ్ళికి మోయిన్లు బండిలో పంపాం. మన ఎడ్లకి నగలన్నీ పెట్టి గులాములు కొట్టా." – మీసాలు దువ్వుకొంటూ నెమరేసుకున్నాడు. బండెనకమూట పాలు పెరుగుల కావిడ, పళ్ళకావిడి నడిచాయ్ – తలుచుకుని పొంగిపోయింది. ఇంటావిడ. ఈ విధంగా గోదావరి జిల్లాలోని వాతావరణాన్ని భాషను చిత్రీకరించారు శ్రీరమణ.

కూతురికి ఇవ్వాల్సిన భూమి గురించి చెప్తూ "నువ్వేమో మొగుడుచాటు పిల్లవి. పుట్టింటోళ్ళు ఇవ్వలేకనో, ఆడపిల్ల సొమ్ముకి ఆశపడ్డారనో మాట రానేకూడదు. ఎవరివో అమ్మి నీకు డబ్బు కట్టే బదులు, నీకే ఒక ఎకరం (నాలుగో ఎకరం) గట్టు పెడతాంలెహన్న మాట వాస్తవం". చివర్లో పెదకాపు ఆరోగ్యం సరిగా లేనప్పుడు "సాంబయ్య బాగా గ్యాపకం పెట్టుకో నాకేదైనా తేడా పడితే, నన్ను ఈ మానంది బండమీది ఓపాలి పండుకోబెట్టు. నా చేతిలో మన రంగుకుచ్చుల చెర్నాకోల పెట్టు. శంషేరుగా ఆ .... అంతే" అర్థంలేని నవ్వుతో కళ్ళు తుడుచుకున్నాడు.

కథ చివర్లో నాగలిని గాడిపోయ్యిలో వేశారని పెదకాపు "మీయమ్మ కడుపుకాలా.... దాన్నంట్రా పొయిలో వేసేది కూడు – గుడ్డ అన్నీ అదేగదంట్రా ఇచ్చేది" అని గొంతు పెగుల్చుకొని, జీరతో పొడిపొడిగా అంటాడు. పెదకాపు గాడిపొయ్యికి అటోకాలు, ఇటో కాలు వేసి, తటాల్న వంగి లోపల కాలే కాలే నాగలి దుంపని రెండు చేతుల్తో బలంగా పట్టి బయటపడేశాడు. ఈ విధంగా కథంతా మనకు ఒక సినిమా చూపిస్తారు రచయిత. తరువాత కథలో ఆయన్ను కార్లో దగ్గర్లోని ఆసుపత్రికి తీసుకెళ్ళి చూపిస్తారు. చివర్లో రచయిత "ముందే ఫోన్ వెళ్ళిందాన్ని బట్టి ఆస్పత్రి ఎదురొచ్చి అందించాల్సిన తక్షణ వైద్యం అందించింది. వెనకాలే నాలుగు కార్లలో సొంత వాళ్ళు, పొరుగువాళ్ళు వచ్చి చేరారు అని అంటారు.

ఆ తరువాత ఆసామి కొడుకు సాంబయ్య అతని స్నేహితుడుతో "నాన్నను మత్తులో పెట్టారు. జాగ్రత్తగా ఉండాలంట. ఎవరూ లోపలికి తొంగి చూడద్దంట. చుక్కలు ఎక్కిస్తున్నారు" అని చెప్పి వాళ్ళ అక్కయ్య గుఱించి" సాంబా ఇప్పుడటాత్తుగా రిజిస్ట్రేషన్ ఆగిపోయె. నాన్నకి మళ్ళీ వేలిముద్రలు ఎప్పటికీ మొలుస్తాయో తెలవదాయె. నే మళ్ళీ అంతదూరం నించి పడి రావాల్రా. ఈసారి విమానం టిక్కెట్లు నేనే పెట్టుకోవాల్రా. బావయ్యా నానా మాటలు అంటున్నాడు" అని బాధపడ్డాడు.

ఈ విధంగా కథ చివర్లో అటు కూతురికి, కొడుక్కి చెప్పలేక అయోమయ స్థితిలోకి వెళ్ళిన పెదకాపు చేతులు, కాళ్ళను కాల్చుకొని ఆస్పత్రిలో చేరతాడు. చివరి నిముషం దాకా చదివితే కాని "నాలుగో ఎకరం" యొక్క మెలికి పాఠకుడికి తెలియదు. విశ్వనాథ సాహిత్య అకాడమీ, వాసిరెడ్డి ట్రస్టు కలసి చేసిన ప్రచురణ ఇది. ఇంకా రచన రజతోత్సవ సంచిక (ఉగాది 2019)లో వచ్చిన కథ ఇది. కాబట్టి దొరికితే ఇది చదివి ఆనందించండి.

♦

## మనిషి నీడలో మరో మనిషి!!

- బత్తిన కృష్ణ
9989370681

ఎప్పుడూ లేని నిశ్శబ్దం చిక్కగా అల్లుకుపోయి
నిర్మానుష్యంగా రాజ్యమేలుతోంది

ఇంతకాలం భద్రంగా బ్రతికినందుకు వేడుక చేసుకోవడమే
కాదుగదా.. ఇపుడు ఎల్లకాలం
భద్రంగా బ్రతకడానికి చాటే ప్రభోదగీతాలు రాసుకోవాలి.

ఇపుడు కాలం కాలుష్య జలాల కడలి
ఇపుడు కాలం అరాచక విషక్రిముల తిమిర జ్వాల
కరాళ నృత్యం చేస్తున్న కరోనా నర్తనశాల

కరోనా
కవిత

ఏం! నేర్పించింది ఏం! నేర్చుకోమంటుంది
అస్సలేం నేర్పాలనుకొంటుంది మనిషికీ కాలం
ప్రకృతిని విస్మరిస్తే విషప్రళయాలు  ప్రపంచానికి
విషసూచికలిస్తున్న కాలం మనిషిని మింగేస్తుంది

పంచవేదాలు కాదిపుడు స్మరణ చేయాల్సింది
మనిషికి భద్రత కావాలి. బ్రతుకు భరోసా కావాలి
ఏ మలుపులోనో దేశం దారితప్పిపోయింది

రంగులు మార్చి మార్చి వ్యంగ్యంగా హావభావాలతో
ఆర్భాటంగా సంబరాలు చేసుకొనే శీర్షికలతో వచ్చే
వార్తాపత్రికలు సైతం భయపడుతున్నాయి

మనిషి తన జీవితాన్ని కొత్త కొత్త ఊహాలతో
నింపేసుకొని తనను తాను ఇరికించుకోలేనంతగా
వ్యాప్తిచెంది చివరికి నేనెవరినీ అనే ప్రశ్నకు సమాధానం
కోసం పరితపిస్తున్నాడని.

గెలిచాడో ఓడిపోయాడో తెలియదుగానీ
జయాపజయాలను ప్రకటించని కాలం కోసం
ఎదురు చూస్తున్నాడు.

మనిషైతే ఓడిపోడు తన సర్వశక్తుల్ని కూడదీసుకొని
విజయఢంకాను మ్రోగిస్తాడు.

మనిషికిపుడు స్వర్ణాలక్కర్లేదు స్వర్గాలక్కర్లేదు
ఈ కళాంకాన్ని ఒక చిటికెలా ఊదేయ్యడానికి ఒక శపథం
చాలు. అడుగు జవదాటని ఆదేశం చాలు

అందుకే ఆశల్ని అక్షరాలుగా తుంచి అందరిమీద
విసిరేస్తాను ఆత్మీయంగా వారి ఆర్తిని గ్రహిస్తాను
అంకుశంగా నా ఆశయసాధను నెరవేరుస్తాను. ♦

---

## కలలు కరిగిన కడలిలో

గంగిరెడ్డి ప్రద్యుమ్న కుమర్ రెడ్డి
9491858031



రాజీ లేని ఊహల్లో
ఎల్లలు లేని కలల్తో
ఆశల అశ్వాలకు రెక్కలు కట్టి
సారంగాల దుర్గంలో... ఆకాశ మార్గంలో
ఊగుతూ ఊరేగుతూ
ఆదమరిచిన నిద్రపోతున్న నన్ను...
కారు మబ్బుని గిల్లిన చల్లగాలిలా
ప్రాయపు పరుగుల పైర గాలులూ
సోమరి దారుల వాడి గాయాలు
ఆవహించి అమాంతం అల్లుకున్నాయి.

నేను కనులు తెరిచే నాటికి.. ఆ అలజడిలో
ఆశలు కరిగి ఆవిరై.. ఊహలు విరిగి నేలరాలి
కన్నీటి ధారలే మిగిలాయి.
విసిగివేసారి కాలం నది ప్రవాహంలో
కొట్టుకుపోతూ
దహిస్తున్న ఓటమి జ్వాలల్లో
నివురిగప్పిన నిప్పులా అణిగున్న నేను. .
అలల తరంగాల్లా ఎగిసి నింగిని చెరుకుంటానో..
బండరాళ్ళ దారులలో బ్రతుకు పాటను మార్చుకుంటూ
కొత్తరాగం ఆలపిస్తానో..!
అలసిపోయి పాయలుగా చీలి పరిస్థితులకు తలవంచుకుని
ప్రవాహంలో కొట్టుకుపోతూ కనుమరుగైపోతానో..! ♦



# అతిథి

మూలం: ఆంటోని చెహెూవ్
తెలుగు: ఉషారాణి
9490098422

Anton Chekhov Story
Troublesome Guest

పొట్టి ద్వారం ఉన్న ఓ చిన్న గుడిసె అది. గుడిసెలోని గదిలో పెద్ద నల్లని నీడలో ఇద్దరు మనుషులు ఒక బెంచి మీద కూచుని ఉన్నారు. ఆ నీడలో ఒకటి ఆర్టీఓమ్ ది. ఆర్టీఓమ్ ఆటవికుడు, అడవికి నియమించబడిన కాపలాదారుడు. పొట్టిగా బక్కపలచగా ఉంటాడు, చర్మం ముసలితనంతో ముడతలు పడి ఉంటుంది. మెడమీద కాస్తంత గడ్డం మొలిచుంటుంది. మరొకడు వేటగాడు. కాషాయ రంగు చొక్కా వేసుకుని, వానలో కూడా చక చకా నడవగలిగే పెద్ద బూట్లు వేసుకుని హుందాగా ఉన్నాడు. యువకుడు. అడవిలో వేటాడడానికి వచ్చాడు. రాత్రికి ఆ గుడిసెలోనే మకాం పెట్టాలని ఆలోచన. వారు కూచున్న బల్ల కెదురుగా మూడుకాళ్ళ చెక్క టేబుల్ ఉంది. దానిమీద ఒక సీసాలో జంతు కొవ్వుతో వెలుగుతున్న సన్నని కాండిల్ దీపం ఉంది. సీసాలో గుచ్చ బడిన ఆ కాండిల్ దీపం బద్ధకంగా వెలుగుతూ ఉంది.

కిటికీ బయట చీకటి దట్టంగా అలుముకుని ఉంది. తుఫాను ముందు వచ్చే భయంకరమైన గాలి, శబ్దం అడవిలోని చీకటి నిశ్శబ్దాన్ని చీలుస్తున్నాయి. గాలి కోపంతో రంకెలేస్తున్నట్టు ఉంది. చెట్లు దయనీయంగా మూలుగుతున్నాయి. గుడిసెకున్న కిటికీ అద్దం పగిలిపోడంతో దానికి కాగితం అంటించారు. గాలికి తెగిపడి రాలుతున్న ఆకులు కాగితంపై పడి టప టప మని శబ్దం చేస్తున్నాయి.

కాస్తంత బెదురు చూపులతో రెప్పవేయకుండా వేటగాడి వైపు చూస్తూ, బొంగురు గొంతుకతో నెమ్మదిగా, “నాకు తోడేళ్లన్నా ఎలుగుబంట్లన్నా భయం లేదు. నిజానికి ఏ క్రూరమృగమన్నా కూడా భయం లేదు. కానీ మనిషంటేనే భయం. ఓ తుపాకీతోనో, మరో ఆయుధంతోనో మనల్ని మనం క్రూరమృగాల నుండి రక్షించుకోగలం. కానీ దుష్టుల నుండి మనల్ని మనం రక్షించుకునే ఆయుధమే లేదు” అన్నాడు ఆర్టీఓమ్.

“నిజానికి మనం ఒక మృగాన్ని కాల్చి చంపవచ్చు. కానీ ఒక దొంగను కాల్చలేము. కాల్చినా దానికి జవాబు చెప్పుకోవలసి వస్తుంది. శిక్ష అనుభవించవలసి వస్తుంది.”

“ఈ అడవిలో గత 30 సంవత్సరాలుగా, అంటే నేను పసివాడిగా ఉన్నప్పటినుంచి ఉంటున్నాను. ఎంతమంది దుష్టులను భరించ వలసి వచ్చిందో నీకు తెలియదు. ఎంతమంది చెడ్డవాళ్ళు ఉన్నారో లెక్కేలేదు. అదిగో ఆ దారులున్నాయి కదా! వాటిమీద బళ్ళల్లో వచ్చిపడుతుంటారు దుర్మార్గులు. అన్నిరకాల మొరటోళ్ళు వస్తుంటారు. ఒక సంస్కారం ఉండదు. దైవ భక్తి ఉండదు. సరాసరి నేరుగా గుడిసెలోకి వచ్చి పడతారు. “ముసలి ముండా కొడకా, రొట్టె ఇమ్మని గదమాయిస్తారు. అందరికి రొట్టెలు ఎక్కడి నుండి తేను? అసలు నా మీద పడి రొట్టెలు తినే హక్కు వారికెక్కడిది? నేనేమన్నా లక్షాధికారినా, దారిన పోతున్న ప్రతి తాగుబోతు

వెధవ ఆకలి తీర్చడానికి? ద్వేషంతో వాళ్ల కళ్ళుమూసుకుపోయి ఉంటాయి. రాక్షసులకు కాస్తంతయినా భయము భక్తి ఉండవు. వాళ్లతో పోట్లాడలేము కూడా. చెంప ఛెళ్ళు మనిపించి మరీ మాట్లాడతారు. వెధవలు. కొంతమంది భుజాలయితే రెండేసి గజాలు ఉంటాయి. నా కాలి బూట్లంత పిడికిళ్లు. ఇక నన్ను చూడు. ఎంత అర్భకంగా ఉన్నానో! అందులో ఏ ఒక్కడయినా చిటికిన వేలితో నన్ను చితకబాద గలడు. ఇక చేసేదేముంది. రొట్టె ఇవ్వాల్సిందే. ఇచ్చిన రొట్టెను గుటుక్కున మింగి గుడిసెలో హాయిగా కాళ్ళు బారజాచుకుని పడుకుంటారు. కనీసం, కృతజ్ఞతలు కూడా చెప్పరు. పైగా కొంతమంది నన్నే డబ్బులు ఎదురడుగుతారు. "నీ డబ్బులు ఎక్కడ దాచావో చెప్పు?" అంటారు. నా దగ్గరేదో డబ్బున్నట్టు! ఇదంతా ఎలా భరించాలో ఏమో!

"అడవిని కాపలా కాచేవాడివి. నీదగ్గర డబ్బులు లేకపోవడమేమిటి?" అని నవ్వాడు వేటగాడు.

"నీకు ప్రతి నెల జీతం వస్తుంది కదా . పైగా అడవిలోని కలప అధికారుల కళ్ళు కప్పి అమ్ముతూనే ఉంటావాయే."

అతిథి ముఖం వైపు ఓ సారి వంకరగా చూసాడు ఆర్టీఓమ్. గోకరాయి పక్షి తోకని అటు ఇటు ఆడించినట్టే గడ్డాన్ని అటుఇటు మెలికలు పెడుతూ ఊపాడు.

"నన్నింతలేసి మాటలను అనే వయసుకాదు నీది. ఇందుకు నువ్వు దేముడికి సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది. నువ్వెక్కడి వాడివయినా, నీ బంధుగణం ఎవరయినా నువ్విలా మాట్లాడడం తప్పే"

"నేను వ్యజోవకా నుండి వచ్చాను. నెఫెడ్ అనే ఉరిపెద్ద మా నాన్న."

"నువ్వు వేటకొచ్చావు. యవ్వనంలో ఉన్నప్పుడు నాకు కూడా వేటంటే మక్కువే. మన పాపాలు దారుణమైనవి" అన్నాడు ఆర్టీఓమ్ బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ.

"మంచివాళ్ళు కొంతమందే ఉండడం, చెడ్డవాళ్ళకు హంతకులకు అంతులేకుండా ఉండడం విచారకరం– దేముడికి మనపై దయ ఉండుగాక" అన్నాడు ఆర్టీఓమ్ .

"నీకు నేనన్నా భయంగా ఉన్నట్టుందే... "

"అబ్బె అదేంలేదు. ఏయితేనేం . నాకు నిన్ను చూసి భయపడాల్సిన అవసరం ఏముంది? నేను నిన్ను చూడగానే నువ్వు అందరి లాంటి వాడివి కావు అని అర్థం చేసుకున్నాను. నువ్వు వస్తూనే దైవాన్ని స్మరించుకున్నావు. పద్ధతిగా ఉన్నావు. మర్యాదగా మాట్లాడుతున్నావు. నీకు ఆహారాన్ని ఇస్తాలే . కానీ నాకా భార్యలేదు. నేను వంటపొయ్యి రాజేయను. నాకున్న తేనీరు కాచుకునే సమోవార్‌ని కూడా అమ్మేసాను. మాంసం గాని అలాంటి ఇతర ఆహారపదార్థాలు గాని కొనే స్తోమత నాకు లేదు. అటువంటివేవీ ఇక్కడ ఉండవు. కానీ నా దగ్గర రొట్టె ఉంది. అది నీకు ఇస్తాను."

ఆలా అంటుండగానే బెంచి కింద నుండి గురగుర శబ్దాలు వినిపించాయి. ఆ శబ్దాల తరువాత బుసలు కొట్టే శబ్దం వచ్చింది. వేటగాడు వెంటనే కళ్ళు పైకెత్తి ఏమయ్యుంటుందా అని కిందికి చూసాడు.

"నా కుక్క నీ పిల్లి వెంట పడుతున్నది" అన్నాడు. "నోరుమూసుకుని శబ్దం చేయకుండా పడుకోండి" అంటూ వాటిని గట్టిగా గదమాయించాడు .

"నీ పిల్లి మరీ బక్కగా ఉంది. ఒట్టి ఎముకలపోగును చర్మంతో కప్పినట్టుంది."

"అది చాలా ముసలిదిలే. ఇప్పటికే చనిపోయి ఉండవలసింది. అయితే నువ్వు వ్యజో వకా నుండి వచ్చావన్న మాట ?"

"నువ్వు దానికి తిండి పెట్టవనుకుంటాను. అది పాపం పిల్లే అయినా జీవే కదా... ఊపిరి తీసుకునే ప్రాణే కదా .. నీకు దానిపై జాలి ఉండాలి."

ఇదేమీ పట్టించుకోకుండా "వ్యజోవకా వాసులు వింతయిన మనుషులు. అక్కడి చర్చి రెండు సార్లు దోపిడీకి గురయింది. వాళ్ళని 'చెడ్డ వాళ్ళ'నడం కూడా వారిగురించి తక్కువగా చెప్పడమే అవుతుంది. వాళ్ళకసలు దేముడన్నా మనుషులన్నా భయం లేనే లేదు. అటువంటిదేద యినా ఉంటే ఏకంగా దైవం సొమ్మునే కాజేస్తారా ? వారికి ఉరి శిక్షకూ డా తక్కువే. పాతకాలంలో అయితే పాలకులు వారి చర్మాలు ఒలిచేసే వారు."

" తల్లీ ! మమల్ని రక్షించు, కాపాడు !! దుష్టుల నుండి శత్రువుల నుండి మమల్ని కాపాడు! కిందటి వారం వోల్లోవై జాయిమిస్ట్యీ అనే పచ్చిక చదును చేసే వాడు తనతోటి పచ్చిక చదును చేసేవాడిని కొడవలితో ఛాతీపై పొడిచి చంపేశాడు. ఇంతకీ కారణ మేంటని అడుగు. ఒకడెమో తాగి చావడిలో నుంచి బయటికి వచ్చాడు. మరో తాగిన వాడు వాడికి ఎదురు పడ్డాడు. మాటామాటా పెరిగింది. అంతే....

వింటున్న వేటగాడు ఒక్కసారిగా ముఖం గంభీరంగా

పెట్టి ఎక్కడో దూరం నుంచి వస్తున్న శబ్దాన్ని శ్రద్ధగా వినడం మొదలు పెట్టాడు.

"ఉండు. ఎవరో కేకలేస్తున్నట్టున్నారు" అన్నాడు అడవి కాపలా దారునితో.

వేటగాడు కాపలాదారుడు ఇద్దరు తలలు కిటికీ బయటికి పెట్టి చెవులు రిక్కించి వినడంమొదలు పెట్టారు. ఈదురు గాలులు హోరుగా వీస్తున్నప్పటికీ, రకరకాల శబ్దాలు వస్తున్నప్పటికీ ఆ శబ్దాలలో తేడాలు ఇద్దరూ గమనించ గలుగుతున్నారు. కానీ అది కిటికీలో నుంచి గాలి లోపలికి దూసుకు వస్తూ చేస్తున్న శబ్దాలో, మనుషులు సహాయం కోసం వేస్తున్న కేకలో సరిగ్గా తేల్చుకోలేక పోతున్నారు. కొంత సేపటికి ఈదురు గాలిజోరు కిటికీకి అతికించిన కాగితాన్ని ఊడగొట్టింది. ఇప్పుడు మనుషులు సహాయం కోసం చేస్తున్న అరుపులు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"అదిగో హంతకులు వచ్చారు. ఎవరో దోచుకో బడుతున్నారు" అన్నాడు వేటగాడు భయంతో లేస్తూ.

"దేముడా రక్షించు !" అన్నాడు ఆటవికుడు కూడా భయంగా.

వేటగాడు గుడిసెలో అటు ఇటు తిరుగుతూ మధ్యలో కిటికీ దగ్గర ఆగి శబ్దం ఎటునుంచి వచ్చిందో అని తల బయటకి పెట్టి గమనించే ప్రయత్నం చేస్తున్నాడు.

"ఎంతటి కాళరాత్రి ! మన ముందున్న మన చేయిని కూడా చూసుకోలేక పోతున్నాము. చూసావా! మళ్ళీ అరుపులు వినిపిస్తున్నాయి."

అడవి మనిషి ఒకసారి బయటికి చూసి తిరిగి వేటగాడి వైపు చూసాడు. వెంటనే దుర్వార్త విన్నవాడిలాగా బెంచీమీద కుప్పకూలిపోయాడు.

"దేముడా! ఇదిగో, నువ్వు బయటికి వెళ్లాలనుకుంటే వెళ్ళిపో. ఆ తలుపేసేయి. ఇక లైట్లు ఆర్పేయాలి." అన్నాడు కన్నీటితో.

"ఎందుకు"

"లైట్ల వెలుగు కనిపిస్తే మన దురదృష్టం కొద్దీ వాళ్లిక్కడికి రావచ్చు"

"ఇప్పుడు మనం బయటికి వెళ్ళాలి. నువ్వేంటీ, తలుపులు వేసుకోవడం గురించి మాట్లాడుతున్నావు? నువ్వు గొప్పోడివే! బయటికి వస్తావా రావా ?"

వేటగాడు చేతిలోకి తుపాకీని తీసుకున్నాడు. తలపై టోపీ పెట్టుకున్నాడు.

" తుపాకీ పట్టుకో. సిద్ధంగా ఉండు. ఓయ్, ఫ్లేర్కా ఇటురా" అంటూ తన కుక్కని పిలిచాడు.

వేటకుక్కకి పెంపుడు జంతువుకి మధ్యస్థంగా ఉండే పొడుగాటి చెవులున్న కుక్క బెంచి కింది నుండి బయటికి వచ్చింది. వస్తూనే ఒక్కసారి ఒళ్ళు విరుచుకుని, తోకూపుకుంటూ యజమాని కాళ్ళ దగ్గర చతికిల పడింది.

"ఇంకా కూచుని ఉన్నావేం ? బయటికి రావా?" అరిచాడు వేటగాడు.

"ఎక్కడికి"

"సహాయం చేయడానికి "

"నేనెందుకు సహాయం చేస్తాను ? ఎక్కడి నుండో వచ్చిన అరుపులకు నేనేందుకు స్పందించాలి" అన్నాడు ఆటవికుడు.

"నువ్వు రాకుండా ఎలా ఉంటావు "

" ఒకపక్క ఇంతటి భయంకరమైన విషయాలు చూస్తూ, నేనీ చీకటిలో బయటికి రాలేను. దయచేసి నన్ను వదిలేయ్! అసలింతకీ నేనేందుకు బయటకు రావాలి ?"

"నువ్వెందుకు భయపడుతున్నావు? నీ దగ్గర తుపాకీ ఉంది కదా! దయచేసి మనిద్దరం కలిసి వెళ్దాం. ఒక్కడినీ వెళ్ళాలంటే నాకూ భయంగా ఉంది. ఇద్దరం కలసి వెళితే భయం ఉండదు. వింటున్నావా? లే. బయలు దేరు" అరిచాడు వేటగాడు.

"ఎక్కడికి నాయనా బయలుదేరేది? మూలిగాడు ఆటవికుడు. నన్ను నేను సమర్పించుకోడానికి బయలు దేరమంటావా ఏం? అంత అమాయకంగా కనిపిస్తున్నానా?"

"అంటే నువ్వు రావన్న మాట "

ఆటవికుడు సమాధానం చెప్పలేదు. మనిషి నిస్సహాయంగా వేస్తున్న కేకలు విని కుక్క ఓ మూలుగు మూలిగింది.

"నిన్నే అడుగుతుంటా, వస్తావా? రావా?" కోపంతో కళ్ళురుముతూ గద్దించాడు వేటగాడు.

"నువ్వెళ్లు. నన్నడగకు" అన్నాడు ఆటవికుడు కోపంగా.

"ముదనష్టపువాడ!" తిట్టుకున్నాడు వేటగాడు.

"ఫ్లేర్కా పద"

తలుపుతీసుకుని బయటికి నడిచాడు. గాలి ఒక్కసారిగా గుడిసెలోకి చొచ్చుకువచ్చింది. కాండిల్ దీపం వెలుగు కాసేపు గాలికి రెపరెప లాడి, చివరికి ఆరిపోయింది.

వేటగాడు బయటికి వెళ్ళగానే ఆటవికుడు తలుపు గొళ్ళెం బిగించాడు. కిటికీలోనుంచి మెరుపుల వెలుగులో తన అతిథి దారిలో నడుస్తూ వెళ్లడం, పైన్ చెట్లు ఊగడం, రోడ్డు మీద బురద గుంటలు ఆటవికుడికి కనిపిస్తున్నాయి. ఎక్కడో దూరంగా ఉరుముల ప్రతిధ్వనులు వినిపిస్తున్నాయి.

" దేముడా, దేముడా, దేముడా, ఏం వాతావరణం రా భగవంతుడా" అని గొణుకుంటూ, ఆటవికుడు గుడిసె వెచ్చగా ఉండేందుకు వెలిగించిన కట్టెపొయ్యి దగ్గరికి చేరాడు. పొయ్యి వెలిగించుకున్నాడు. తలమీది నుండి పాదాలదాకా గొర్రె చర్మంతో తయారుచేసిన రగ్గు కప్పుకుని పడుకుని, చుట్టూ వినిపిస్తున్న శబ్దాలను గమనిస్తున్నాడు. ఇదివరకు వినిపించిన మనుషుల అరుపులు ఇంక వినిపించడం లేదు కానీ ఉరుముల శబ్దం గట్టిగా వినిపించడమే కాదు ఎక్కువసేపు వినిపిస్తున్నాయి కూడా. ఈదురు గాలి వీస్తూనే ఉంది. వాన ద్వారబందాల మీద, కిటికీలమీద చాచి కొడుతూనే ఉంది.

"తెలివితక్కువ పనిమీద వెళ్ళాడు. ఈ సరికి వానలో చిత్తుగా తడిసిపోయి ఉంటాడు. అడుగులు తడబడుతూ ఉండి ఉంటాయి. గజగజా వణుకుతూ ఉండి ఉంటాడు" అని వేటగాడిని తలుచుకుంటూ అనుకున్నాడు ఆటవికుడు.

పదినిముషాలు గడిచాయో లేదో అడుగుల చప్పుడు వినిపించింది. ఆ తరువాత తలుపు కొట్టిన శబ్దం.

"ఎవరది" అంటూ అరిచాడు ఆటవికుడు.

"నేనే, తలుపు తియ్యి" అన్న యువకుడి గొంతు వినిపించింది.

ఆటవికుడు పొయ్యి దగ్గరి నుండి లేచాడు. కాండిల్ వెతికి పట్టుకుని ముట్టించాడు. తలుపు తెరిచాడు. ఎదురుగుండా వేటగాడు, అతని కుక్క వానలో తడిసి ముద్దయి కనిపించాయి. ముంచుకొచ్చిన వానలో తప్ప తడిసారు. ఇప్పుడిక వాన వెలిసింది గాని వాళ్ళ బట్టలు మాత్రం ఉతికిన తరువాత పిండడానికి సిద్ధంగా ఉన్న బట్టలలాగా నీళ్లు కారుతున్నాయి.

"ఏం జరిగింది" అడిగాడు ఆటవికుడు

"ఒక మహిళా రైతు బండి తోలుకొస్తున్నది. బండి దారిలో ఇరుక్కుపోయింది. ఆమె పాపం చాలా ఇబ్బంది పడుతుండింది." గట్టిగా ఊపిరి పీల్చుకుంటూ జవాబు చెప్పాడు వేటగాడు.

"ఆ ! పిచ్చిది. భయపడి ఉండి" ఉంటుంది. ఇంతకీ బండిని దారి పైకి ఎక్కించావా?"

"నీలాంటి నీతి నియమాలు లేని వాడితో నాకు మాట్లాడవలసిన అవసరం లేదు. నువ్వొక అడవిని కాపలా కాచేవాడివి! పైగా నీకు జీతంకూడాను! నువ్వొక వెధవవి!!" తడిసిన కోటును బెంచీమీదకి విసిరేస్తూ అన్నాడు.

ఆటవికుడు అపరాధంతో కుంగి పోయాడు. పొయ్యి దగ్గరికి నెమ్మదిగా జారుకున్నాడు. కాస్త గొంతు సవరించుకుని నిద్ర కుపక్రమించాడు. యువకుడు బెంచి మీద కూచునే ఉన్నాడు. ఆలోచిస్తూ కాళ్ళు బారజాపాడు. కాసేపటికి లేచి నిలబడ్డాడు. కాండిల్‌ని ఆపేసాడు. మళ్ళీ పడుకున్నాడు. ఇంతలో మళ్ళి పెద్దగా ఉరుములు మొదలయ్యాయి. ఉరుముల మెరుపుల మధ్యలోనే లేచి. నేలమీద గాండ్రించి ఉమ్మి అరవడం మొదలెట్టాడు.

" వీడో పిరికోడు.... ఆ అమ్మాయే గనక హత్య చేయబడి ఉంటే ... ఏమయ్యేది? ఆ అమ్మాయిని రక్షించే నాథుడెవడు? ఈ ముసలోడు పైగా దైవ భకుడు కూడా నట! వీడొట్టి పంది వెధవ."

ఆటవికుడు ఓ నిట్టూర్పు విడిచాడు. ఇంతలో ఏమూలో పడుకున్న ఫ్లేర్కా వానలో తడిసిన ఒంటిని గట్టిగ విదిలించుకుంది. ఆ నీళ్లు గదంతా చిమ్మాయి. ముసలోడి పైన కూడా పడ్డాయి.

"నీకు ఒక అమ్మాయి హత్యకు గురైనా లెక్క లేదన్నమాట?" నువ్వింత నిష్ఠ దరిద్రుడివని నాకు తెలియదు.

కాసేపు నిశ్శబ్దం ఆవరించింది. ఇప్పుడిక ఉరుములు మెరుపులు చాలా దూరం నుంచి వినిపిస్తున్నాయి. వాన మాత్రం పడుతూనే ఉంది .

"సహాయం చేయమని, ఆ అరుస్తున్నది వేరే ఎవరో అమ్మాయి కాకుండా, నువ్వే అయి ఉంటే ! అప్పుడేమయి ఉండేది. నిశ్శబ్దాన్ని చీలుస్తూ ప్రశ్నించాడు వేటగాడు. " నీకెలా అనిపించేది ? పశువా! ఎవరూ సహాయానికి రాకపోతే నీకెలా ఉండేది? నీ పాడు బుద్ధి చూ స్తే నాకు అసహ్యం వేస్తున్నది. పురుగులు పడి చస్తావు!"

మళ్ళీ చాలాసేపు విరామమిచ్చి :

"నీ దగ్గర డబ్బులు ఉండి ఉంటాయి. అందుకే నువ్వు మనుషులను చూసి భయపడుతున్నావు! ఒక పేద వాడు ఎన్నటికీ ఇలా భయపడడు."

"నన్నిలా అన్నందుకు నువ్వు దేముడికి సమాధానం

## కవిత

# టీ పాయ్

బంగార్రాజు కంఠ
8500350464

అది కళ్ళముందుంటే
పక్కనొక మనిషున్న ఫీలింగ్
నన్ను నేను డిస్మాండిల్ చేసి
ఒక్కో వస్తువుగా దానిపై పేర్చబడ్డట్టుంటుంది
టీ మాత్రమే పెట్టుకునే ప్లేస్ గా
పిలవబడుతున్నప్పటికీ
పొద్దున్నే రోడ్డు మీదనుంచి గుమ్మమ్ముందుకి
గిరాటేయబడ్డ ప్రపంచం
చూపులతో చేతులతో తడిమేసాక
దానిపై మడతలుగా ముడుచుకుంటుంది



ప్రతీసారీ నా రెండుకళ్ళు నానుంచి వేరుపడి
దానిమీద చూపులుగా సేదతీరుతాయి
చేతినుంచి విదిలించుకున్న కాలమానం
అక్కడ నిమిషాలూ గంటల్లెక్కన గింజుకుంటుంది
నిజానికి టీ చప్పరింతలకు
పరిమితమవ్వాల్సిన దాని ఇలాక
ఎప్పుడన్నా నా చరవాణి సంగీతానికి
ముసిముసిగా తాళం వేస్తుంటుంది

వేళకు వేసుకోవాల్సిన మందుబిళ్ళై
నా ఆరోగ్యం దానిమీద నుంచి
నన్నుచూసి నవ్వుతుంటుంది
అప్పుడప్పుడు పిల్లవాడి ఆనందం
గుప్పెడు చాక్లెట్లై అక్కడ కేరింతలు కొడుతూ
ఆడుకుంటుంది
నెలకోసారి రాసిపెట్టుకున్న సరుకుల చీటీతో
నా వైపు ఉరుమురిమి చూస్తూ
జేబులో మిగిలిన చిల్లరపైసల్తో
గలగలలాడుతుంటుంది

ఒక్కనిమిషం దాన్ని పక్కకు జరిపినా
ఎందుకో మనసు కకావికలమౌతుంది
నాకంటూ మిగిలిన
ఆంతరంగికుల్లో నాకీ టీ పాయొకటి
పేరుకది టీ పాయే
పక్కనుంటే మిత్రుడు చలపాయ్ తోడున్నట్టుంటుంది. ♦

---

చెప్పుకోవలసి ఉంటుంది. నా దగ్గరేం డబ్బు లేదు." బొంగురు గొంతుకతో పొయ్యి దగ్గరి నుండే అన్నాడు ఆటవికుడు.

"అబద్ధం! నీలాంటి నీతిలేని వారిదగ్గర తప్పకుండా డబ్బు ఉంటుంది. లేకపోతే నువ్వు మనుషులను చూసి ఇలా భయపడేవాడివి కాదు. నీ దగ్గరున్న డబ్బంతా తీసుకుని నీకు పాఠం చెపుతాను!" అరిచాడు వేటగాడు.

ఆర్టీఓమ్ పొయ్యిదగ్గరి నుండి నెమ్మదిగా లేచాడు. కాండిల్ వెలిగించాడు. దేముడి విగ్రహం ముందు కూచున్నాడు. అతని మొఖం పాలిపోయి ఉంది. వేటగాడినే చూస్తున్నాడు. అతడి నుంచి దృష్టి మరల్చడమే లేదు.

"నిన్ను దోచుకు తీరతాను" కూచున్న చోటు నుండి లేస్తూ అన్నాడు వేటగాడు. నేనంటే ఏమనుకుంటున్నావు? నీలాంటి వాడికో గుణ పాఠం చెప్పాలి. చెప్పు. డబ్బు ఎక్కడ దాచావో చెప్పు?"

ఆర్టీఓమ్ లేచి కూచుని కళ్ళు పైకెత్తి తదేకంగా వేటగాడినే చూస్తున్నాడు.

"ఎందుకలా గింజుకుంటున్నావు? డబ్బెక్కడ దాచావు? నోరేమన్నా పడిపోయిందా? సమాధానం చెప్పవేం?"

అరుచుకుంటూ యువకుడు ఆటవికుడి పై పైకి ఎగబడ్డారు.


"వీడు గుడ్లగూబలాగా చూస్తున్నాడు! సరే! నాకు డబ్బిచ్చేయి. లేదా నేను నిన్ను కాల్చేస్తాను."

"నా మీదెందుకు పడతావు? గద్దించాడు ఆటవికుడు". కంటి నుండి పెద్ద నీటి చుక్కలు జల జల రాలాయి.


దేముడన్నీ చూస్తూనే ఉంటాడు. నేనే పాపం ఎరగను. నన్నన్న మాటలకు నువ్వు దేముడికి సమాధానాలు చెప్పుకోవలసి వస్తుంది. నా డబ్బులు అడిగే హక్కు నీకేమాత్రం లేదు."

కన్నీరు మున్నీరవుతున్న ఆర్టీఓమ్ మొఖాన్ని వేటగాడు చూసాడు. కోపంతో గదిలో అటూ ఇటూ పచార్లు చేసాడు. టోపీ తలపై పెట్టుకున్నాడు. తుపాకిని చేతిలోకి తీసుకుని అడుగులు బయటికి వేసాడు.

♦




కె. శివారెడ్డి



# ఆగిపోని కవితా యాత్ర

- కెంగార మోహన్
9000730403

అతడు అక్షరానికి ఆయువు నింపుతాడు..ఆ అక్షరం స్వేచ్ఛగా మొలకెత్తి మనుషుల వైపు చూస్తుంది. మనిషిని శోధిస్తుంది..అన్వేషిస్తుంది..అనంతానంత దిగంతాల్లోకి వెళ్ళేముందు ఉత్తేజాన్ని నిండా నింపుకుని సంచరిస్తుంది. అతడి అక్షరానికి పదునెక్కువ..మాట్లాడుతున్నట్టే..చెబుతున్నట్టే ఉన్నట్టనిపించినా ప్రపంచాన్ని, నాగరిక సమాజాన్ని పొరలు పొరలుగా చెబటం ఈ శివుడికే సాధ్యం..ఈయన కవిత్వాన్ని ఈ కవితా ప్రపంచానికి పరిచయం చేయాలని ఎంతో మంది కవులు ఉవ్విళ్ళూరుతుంటారు..అది సహజం..అతడి కవిత్వం..అతడికి మాత్రమే సాధ్యమయ్యే కవిత్వం..అతడు మాత్రమే స్పృశించగల కవిత్వం..ఈ అనంతానంత కవిత్వ విశ్వంలో ఏదైనా ఉందంటే అది కె.శివారెడ్డి కవిత్వం..అనేకానేక సంఘర్షణల్ని..అనేకానేక సందిగ్ధ యుద్ధమైదానాల్ని దాటుకుంటూ..కవిత్వానికి తన చిటికెన వేలునందించి నడిపిస్తున్నవాడు..ఎవరైనా ఇలానే రాయాలని అనాలని ఉన్నా..ఇతడిలా రాయడం...ఇంతలా..మైక్రోవేవ్ లెంత్‌లో చూడ్డం ఎవరికైనా సాధ్యమేనా..!. తన పిడికిట్లో కవిత్వాక్షరాలను బంధించి ఒక్కొక్కటిని అస్త్రాలుగా వదుల్తున్నాడా..ఈ సంఘమంటే..ఈ మనుషులంటే..ఎంత ప్రేమంటే మనిషి పడే మనో యాతనల్ని కూడా రికార్డు చేయగలుగుతున్నాడు..ఉషోదయాల్ని రవి అస్తమయాల్ని చీల్చుకుంటూ వచ్చి పలకరించిన రక్తం సూర్యుడు(1973) కవిత్వాన్ని శివారెడ్డి కవిత్వ ప్రేమికులు..కాదు కాదు..కవిత్వాన్ని మాత్రమే ప్రేమించే కవిత్వ ప్రేమికులు మర్చిపోతారా..శివారెడ్డి కవిత్వమంటే వండి వార్చే కవిత్వం కాదు..ఇప్పటికి 27 సంపుటీలిచ్చి 28వ సంపుటిగా వచ్చిన **కొంచెం స్వేచ్ఛగావాలి** తో ఈయన కవిత్వ వయసు 28..ఒక్కోసారి కంటి చూపుకు కాగితంపై విన్యాసం చేస్తున్న అక్షరానికి మధ్యదూరం కొలవాలనిపిస్తుంది.

ఇప్పుడు మాట్లాడుకోవాల్సింది స్వేచ్ఛ గూర్చి..కె.శివారెడ్డి కోరుకుంటున్న స్వేచ్ఛ గూర్చి మాట్లాడదాం..

*కొంచెం స్వేచ్ఛ గావాలి*
*రెక్కలల్లార్చటానికి*
*చినుకుపడ్డ రెక్కల్ని విదల్చటానికి*
*ముక్కుతో ఈకలు సరిదిద్దుకుంటానికి*
*ఈ కాలు యిలా, ఆ కాలు అలా చాచటానికి*
*టప్ మని ఒక చినుకు నెత్తిమీద పడితే*
*తలపైకెత్తి చెట్ల ఆకులకేసి చూడటానికి*
*మహామృదువుగా గాలి వీస్తే*
*ముక్కుపుటాలు పెద్దవి చేసి కళ్ళతో గాలి పీల్చటానికి*
*కొంచెం స్వేచ్ఛగావాలి మనిషిని మనిషని చెబటానికి*
*పశువుని పశువని చెబటానికి*
*కొంచెం స్వేచ్ఛ గావాలి*
*రాత్రిని రాత్రని చెబటానికి*
*పగటిని పగలని చెబటానికి*
*కొంచెం స్వేచ్ఛగావాలి*

రెక్కలల్లార్చి గాల్లో ఎగరటానికి... ఎందుకింతలా సేచ్ఛను కోరుకుంటున్నాడు. మనిషిని పద్మవ్యూహంలో బంధించి, మనిషని నిరూపించుకోకపోతే నిర్ధాక్షణ్యంగా డౌట్‌ఫుల్ జాబితాలోకి నెట్టేసి డిటెన్షన్ సెంటర్లలోకి విసిరేశాక నేను మనిషినని చెబటానికి స్వేచ్ఛకావాల్సిందే కదా..మనిషి బతుకే ప్రశ్నార్థకమైంది. మనిషి అస్తిత్వమే కోల్పోయిన స్థితి..ఈ స్థితికి కారకులెవరో చెప్పకపోయినా ఈ తీవ్రభయాందోళనలు సృష్టిస్తున్నదెవరో మాత్రం ఈ పౌరులకు తెలుసు. ఎన్నడూ లేనంత అసహనం..ఎప్పుడూ అనుభవించలేనంత క్షతి..ఈ బాధలకు కారణం స్పష్టంగా తెలుసు. అతడు పాలకుడు..ప్రజల యోచనల్ని కూడా హత్యచేయాలని చూసే హంతకుడు..

*మోదీని చూస్తే*
*కొండమీదికి రాతి గుండు దొర్లించేవాడు*
*గుర్తొకొస్తాడు-*
*మోదీని చూస్తే*
*యిల్లు తగలబడుతుంటే*
*చుట్ట ముట్టించుకునేవాడు గుర్తుకొస్తాడు.*

ఈ కవితలో పాలనపై వ్యతిరేకత, పాలకుడిపై నిర్లిప్తతతో కూడిన ధిక్కారం కనబడుతుంది. కవితను ఇలా చెప్పడం శివారెడ్డికే సాధ్యం..అందరూ అనుకున్నట్టే చైనావాలంత విశాల బంధాల్ని కాంక్షిస్తాడు. కవి శివారెడ్డి గంభీరంగా కనబడినా చాలా సున్నితంగా కవితల్లేలా ప్రయత్నించినా అవి పురుడుబోసుకున్న పులిలా గర్జిస్తాయి. అందుకే తెలుగు కవిత్వంలో శివారెడ్డిది ప్రత్యేక ప్రపంచం. ఏ కవి అయినా మనిషిని కేంద్ర బిందువుగా చేసుకుని కవిత్వీకరిస్తే ఈ కవి మనిషి చుట్టూ అల్లుకుపోయిన ప్రతీ బంధం, ప్రతిబంధకం, శైశవ బాల్య వయస్సుల్నుంచి అనేక వయో గమ్యాలను అధిగమించి చరమాంకం వరకు జరిగే సన్నివేశాలను, సంఘర్షణల్ని యోచించి కవితాక్షరాలను ఈ క్షేత్రంలో విత్తుకుంటూ వెళతాడు. అతడ్ని కవి అనాలనిపిస్తుంది.

*ఎప్పటికప్పుడు కొత్తగా మొదలయ్యే/ ప్రయాణంలో మజిలీలుంటాయేమోగాని/ ముగింపులేదు/ కాలికింద/ కన్నీటి చుక్కలు పడి పగిలిపోతాయి..*ఇది జీవితం అనాలనిపిస్తుంది. అంతకంటే ఏం చెబుతాం. కవి ఆర్ద్రత..కవి వేదన, కవి కవితావేశం అన్నీ అన్నీ ఒక్కొక్కటి ఇలా ఇతని కవిత్వంలో పేర్చుకుపోతాయి..ఎంత బాగా చెబుతాడు కదా శివారెడ్డి అనిపిస్తుంది. చాలా పద్దతిగా శ్రద్ధగా చెబుతున్నట్లుంది అతని కవిత్వం..కన్నీటి చుక్కలు కాలికింద పడి నలిగిపోవడం ఎంత గొప్ప భావుకత..పిల్లాళ్ళకు పంచతంత్ర కథలు చెబుతున్నట్లుగా, పెద్దలకు ఇతిహాసగాథలు చెబుతున్నట్లుగా ఈ కవి ఈ వర్తమాన సమాజానికి కవిత్వాని ఇంత గాఢతగా చెబుతాడు.

*తలనిండా ఆకులు/ నేను ఏ చెట్టు కింద నుంచీ నడచి రాలేదు /కానీ , తలనిండా ఆకులు తల ఆకులపింఛంలా- మూసీనది ఒడ్డున రకరకాల /రంగుల బుట్టలు తయారుచేసినట్టు/పచ్చపచ్చని వాసన గదంతా అల్లుకుని -/*

*మనిషిలో ఒక చెట్టుందేమో/ అదిలా చిగురించిందేమో/ విరబూసిందేమో/ఆకుల గలగలలు విన్పిస్తున్నాయి/ మబ్బులన్నీ నా తలను తాకి వెడుతూ /లోపలెక్కడో వేళ్లు కదిలిన జాడ / నీళ్లు పారిన జాడ /గుంపులు గుంపులుగా పిట్టలొస్తున్నట్టుంది /గూళ్లు కట్టుకుంటాయేమో తెలియదు/ నే నడుస్తుంటే మనిషి నడిచినట్టు లేదు /చెట్లు నడిచి నడిచి వస్తున్నట్టు/ మనుషులు చెట్లయితే /చెట్లు మనుషులయితే/ ఎంత బాగుండు/ లోకమెంత పచ్చపచ్చగా వుంటుందో /ప్రపంచమెంత మిసిమిలీనుతుందో..*

మనిషి ఇక ఖచ్చితంగా ప్రకృతిని ప్రేమించాల్సిందే. ఆరాధించాల్సిందే ప్రకృతే మనిషికి సర్వస్వం..కర్త కర్మ క్రియ ప్రకృతే. ఇన్నాళ్ళు.. ఇప్పుడు కూడా ప్రకృతిని ధ్వంసం చేయాలని, విధ్వంసం చేయాలనే చూస్తున్నాం..మన చిటికెన వేలు పట్టుకుని ప్రకృతంతా కలియదిరిగి అమ్మను ఆత్మీయంగా పలకరించినట్టు నాన్న గుండెలపై ఆడుకున్నట్టు అనిపిస్తుంది ఈ కవిత చదివితే.. ఈ కవిత్వం సాదాసీదాగా సాగిపోయేలా ఉండదు..అనంతానంత మది సంద్రాల్ని పలకరిస్తూ వెళు తుంటాడు.

శివారెడ్డి కవిత్వమంటే బాగా రాస్తాడని చెప్పటం కాదు..శివారెడ్డి కవిత్వాన్ని చదివించేలా రాస్తాడు..చదివి జీర్ణం చేసుకునేలా వ్యాక్యాల్ని వండుతాడు..ఈ కవిత్వంలో రైతు గురించి చారికల్లో విత్తనాలను విత్తనాలను విత్తుతున్నట్టు..ఈ కవిత చూడండి

**అతడు ఆకాశం నుంచి జారిపడ్డాడు/ ఆకాశాన్ని , కొండ ఎక్కినట్టు ఎక్కుదామనుకున్నాడు/ ఆకాశంలోకి ఎగరాలి తప్ప, ఎగబాకగూడదని అతనికి తెలియకనా/ కాదు, దేన్నీ మామూలుగా చేయటం యిష్టం లేక/ ఎగరాల్సినదాన్ని, ఎగబాకగూడదా /ఎగబాకే అనుభవాన్ని, అనుభవిద్దామని /** ***ఆకాశాన్ని అడ్డంగా తిప్పి ఎగబాకాడు / సూర్యచంద్రుళ్లు, చుక్కలు అతని పొట్ట కింద /ఇంత మట్టి జేబుల్లో***

## కవిత

# మెలకువలో...

- మల్లారెడ్డి మురళీ మోహన్
8861184899

*నీడ కొమ్మలు కత్తిరించినా గానీ*
*నిదుర రావట్లేదు, ఈ రాత్రి.*

*నిద్రచితిపై నీళ్లుజల్లి*
*తప్పించుకోజూస్తున్నాయి కన్రెప్పలు*

*మోసుకొచ్చే కలల మందసం బరువెక్కి*
*నిద్ర దారితప్పినట్టుందీ రాత్రి*

*గడపకావల పగటి కొక్కేనికి*
*తగిలించిన బతుకు బరువుని*
*బేఖాతరు చేయమంటోంది*
*లోలోపలి నిశాచరతత్వం*

*ఈ రాత్రి – మెలకువ చెట్టుకి*
*పాళీలు పూసినా బావుణ్ణు*

*నా సుషుప్తిలో చిగురించిన*



*ఇంద్రధనుస్సుకి ఎనిమిదోరంగునై*
*ఇమిడిపోతానని మిణుగుర్లతో*
*రాయబారం పంపుతోంది– చిక్కని రాతిరి వర్ణం*

*ఈ రాత్రి– మెలకువ మబ్బులు కరిగి,*
*సిరా కురిసినా బావుణ్ణు*

◆

***నింపుకుపోయి/ ఆకాశంలో వెదజల్లుదామని /ఆకాశానికి భూమితనం యిద్దామని /అక్కడ కూడా ఇత్తులు చల్లుదామని /మొక్కలు నాటుదామని /అతని ఊహ – ఆకాశం భూమి అయితే/భూమి ఆకాశమయితే /పెద్ద తేడా ఏముందిలే/ ఆకాశవాసులు భూమ్మీదకి జారతారు/ భూవాసులు ఆకాశానికెగబాకుతారు/మనిషి ఎక్కడున్నా మనిషే/ అరకగట్టాలి, దుక్కిదున్నాలి, విత్తనాలు చల్లాలి/ అందరికోసం పంటలు పండించాలి..*** నిజమే అందరికోసం పంటలు పండించే రైతిప్పుడు ఏమౌతున్నాడో అందరికీ తెలుసు. ఎంత హృదయ విదారక దృశ్యాన్ని మన కళ్ళముందుపరిచాడు..ఎంత దయనీయ స్థితిని చూపుడువేలుతో చూపించినట్టు చూపించాడు. ఇతడు ఇంత నిశితంగా యోచిస్తాడా..ప్రత్యక్ష అనుభవాలున్నట్టే ఉంటుంది. కవి అంతరంగం చాలా విస్తారమైంది.

ఈ కవిత్వం చదివాక ఒక మనిషి వొక్కో వృక్షమై ..వొక్కో పూలవనమై ఆవిష్కృతమౌతాడు. ఈ కవి కొంచెం స్వేచ్ఛగావాలి అని అన్నప్పుడే ఎక్కడికై ఊహించని ప్రపంచాన్నే పరిచయం చేస్తాడనిపించింది. ప్రతికవితలోనూ కవి కొత్తగా గాయం చేస్తాడు.


***నువ్వొక కవిత రాస్తావు/ అది ఎగురుతుంది/ ఎగిరే నీ కవితలోకి నేనెలా ప్రవేశిస్తాను/ ఊహల రెక్కలతో తప్ప సగం కవిత నువ్వు రాస్తే/రెండో సగం నే పూర్తిచేయాలి/ ప్రతి కవితా అసమగ్రమే/ దాన్ని నేను సమగ్రం చేయాలి/ ఎవడిచ్చేదయినా సగమే/ రెండో సగం మనమందించాలి / నువ్వు, అక్కడొక మాట, యిక్కడొక మాట/ ఏరుకొచ్చి గూడు కడతావు / అందులోనే గుడ్డు పెట్టాలి/ ఎవడో, ఎవరో, ఎన్నాళ్లో కొన్నాళ్లు పొదిగినపుడు అది పిల్లవుతుంది/ పిల్లయి పాడటం మొదలెడుతుంది..*** ఇలా కవిని కదిలిస్తాడు..కవిత్వమై మాట్లాడతాడు..శివారెడ్డికి స్వేచ్ఛనివ్వాల్సిందే..కాని ఇవ్వాల్సిందెవరో కూడా ఈ కవిత్వంలో స్పష్టంగా చెప్పాడు..కవితలన్నీ దేనికవే అవిభాజ్య ప్రపంచాన్ని అన్వేషించుకుంటూ మదిపొరల్ని స్పృశించుకుంటూ సాగిపోతాయి..మనమూ ఒక ప్రపంచాన్ని చూడాలనుకుంటే కవి కె.శివారెడ్డి కొంచెం స్వేచ్ఛగావాలి కవిత్వం చదవితీరాల్సిందే...

◆

విశ్లేషణ

# సాహిత్య ప్రక్రియగా కథ

- వల్లంపాటి వెంకటసుబ్బయ్య




వల్లంపాటి వెంకటసుబ్బయ్య
15.03.1927 - 02.01.2006

నవల చరిత్ర కంటే కథచరిత్ర ఎంతో దీర్ఘమైంది. ప్రపంచంలోని దాదాపు అన్ని భాషల్లోనూ కథలూ, కథా మాలికలూ ఉన్నాయి. అంతకంటే ముందు అంటే – నాగరికతలు కూడా అభివృద్ధి చెందని కాలంలో – ఆదిమ మానవులు వాన కురుస్తున్న రోజుల్లోనూ, వెన్నెల రాత్రుల్లోనూ కథలు చెప్పుకొని కాలక్షేపం చేసి ఉండవచ్చు. ఆదిమవాసుల కొండ గుహల్లో కనిపించే చిత్రకళ కన్నా కథలు చెప్పటం ప్రాచీనకళ కావచ్చు.

పాశ్చాత్యదేశాల్లో బొకేషియో కథలూ, మధ్య ప్రాచ్యంలో అరేబియన్ రాత్రుల కథలూ, చార్ దర్వేష్ కథలూ, భారతదేశంలో పంచతంత్రం కథలూ, భట్టి విక్రమార్క కథలూ, మదన కామరాజు కథలూ, శుక సప్తతి కథలూ, కాశీ మజిలీ కథలూ, ఎంతో ప్రసిద్ధిని పొందాయి. కానీ నేటి కథ ఈ ప్రాచీన కథలోంచే నేరుగా అవతరించిందని ఆధునిక విమర్శకులు భావించడం లేదు. ప్రాచీన కథలో కథ చెప్పటం ఉంది కానీ చెప్పటంలో శిల్పానికి ప్రాధాన్యత లేదు. ఈ సూత్రానికి మానవజీవితాన్ని జంతువుల మీద ఆరోపించి కథలు చెప్పిన "పంచతంత్రం" మినహాయింపు కావచ్చు. ఆధునిక కథలో కథనశిల్పం ప్రధానలక్షణం. దాదాపు ప్రాచీన కథలన్నీ ఒక నాయకుని చుట్టూరానో, ఒక నాయిక చుట్టూరానో తిరుగుతాయి. మరీ ముఖ్యంగా వారి వీర, శృ:గారానుభవాల చుట్టూరా అవి పరిభ్రమిస్తూ ఉంటాయి. ఈ కథల్లోని పాత్రలకు మానసిక జీవితమూ, మనస్తాత్వికమైన లోతూ దాదాపుగా ఉండవు. కొత్త కథలో నాయకుని బలపరాక్రమాలు కానీ, నాయిక శృంగారవిజయాలు కానీ ముఖ్యం కాదు. పాత్రల మనస్తత్వం ముఖ్యం. ప్రాచీన కథలో దేశ కాలాలు ఉండవు. అక్కడక్కడా కొన్ని నగరాల పేర్లు వినిపించినా ఆ నగరాల జీవిత చిత్రణలో ప్రత్యేకత ఉండదు. సాధారణీకరణం చేయటం చేత ప్రాచీన కథలో తక్షణత్వం, సమకాలీనత **(Immediacy, Contemporanity)** ఉండవు. ఈ రెండు గుణాలూ ఆధునిక కథకు ప్రాణం.

నవలా, కథా – రెండూ కూడా వచన కథాసాహిత్య ప్రక్రియలే అయినా ఈ రెండింటి మార్గాలూ వేరువేరని అర్థం చేసుకోవటం అవసరం.

నవల ఒక పాత్ర జీవితాన్నీ, లేదా ఒక జీవితపద్ధతినీ, ఒక ప్రాంతంలో ప్రజల జీవిత విధానాన్నీ – ఇలా ఎన్నింటినో కూలంకషంగా చిత్రిస్తుంది. సాధారణంగా నవల కాలవ్యవధి కూడా ఎక్కువగానే ఉంటుంది. (ఈ సూత్రానికి మినహాయింపుగా ఒకరోజును మాత్రం చిత్రించిన "యులిసిస్', కొన్ని గంటల్ని మాత్రం చిత్రించిన "వేవ్స్" లాంటి నవలలు లేకపోలేదు) కానీ కథ ఒక పాత్ర మీదనో, ఒక సంఘటన మీదనో, ఒక భావం మీదనో ఆధారపడి

కళాకారుడు ప్రపంచాన్ని ఏకకాలంలో చాలా పార్శ్వాల నుంచి దర్శించాలి; ప్రస్తుతం ఉన్న దాంట్లో జీర్ణించి పోతూ వున్న గతాన్ని, మెరుగవుతూ, రూపుతీసుకుంటూ ఉన్న భవిష్యత్తునీ రెండింటినీ చూడాలి.

- మక్సీం గోర్కీ



ఉంటుంది. ఇతర పాత్రలూ, సంఘటనలూ, భావాలూ ఉన్నా అవి కథా వస్తువును వ్యక్తం చేసే కేంద్రబిందువు ప్రాధాన్యతను నిరూపించటానికే ఉపయోగపడతాయి.

నవల మసకచీకటి మైదానం మీద పెద్దలైటు వేసి కనుచూపు ప్రసరించినంత మేర చూపుతుంది. కథ చిన్న టార్చిలైటు వేసి జీవితరేఖలోని ఒక బిందువును, ఒక జీవిత శకలాన్ని చూపుతుంది. నేను నా 'కథాంగాలు' అన్న వ్యాసంలో చెప్పినట్లు నవల ఇచ్చే అనుభూతి క్రమక్రమంగా రూపొందుతుంది. అనుభూతి తీవ్రతను కథ మాత్రమే ఇవ్వగలుగుతుంది. "మంచి కథలోని జీవితశకలం ఆ కథలో చిత్రించబడుతూ ఉన్న జీవితానికి మచ్చుతునక **(Sample)** గా ఉంటుంది. ఆ శకలాన్ని ఆధారం చేసుకొని పాఠకుడు కథావస్తువును ఊహించే అవకాశాన్ని రచయిత తన శిల్పనైపుణ్యంతో కల్పిస్తాడు. అలా ఇతివృత్తం లోనూ, పాత్ర చిత్రణలోనూ, కాలవ్యవధిలోనూ నవలకూ, కథకూ మౌలికమైన తేడాలున్నాయి.

కానీ సాహిత్యప్రక్రియగా కథకున్న ప్రత్యేకతను పాశ్చాత్యవిమర్శకులూ, రచయితలూ కూడా చాలా ఆలస్యంగానే గుర్తించారు.

గొప్పప్రతిభ ఉన్న రచయితలు కావ్యాలు, నాటకాలు, నవలలు రాస్తారనీ, తక్కువ ప్రతిభ ఉన్న రచయితలు కథలు రాస్తారనీ అనుకునే వాళ్ళూ, అనేవాళ్ళూ ఈనాటికీ ఉన్నారు. ఇందుకు అజ్ఞానం కూడా ఒక కారణం కావచ్చు, కానీ అంతకుమించిన కారణం కథాసాహిత్య విమర్శ మనలో అవసరమైనంతగా అభివృద్ధి చెందకపోవటం. కథను గురించి ఏమీ తెలియని వారిలో అలాంటి అభిప్రాయాలు ఉండటంలో ఆశ్చర్యం లేదు. కానీ గొప్ప కథారచయితల్లో కూడా ఇలాంటి ఆత్మన్యూనతాభావం ఉండటం విచిత్రం.

మపాసా మొదటి కథాసంపుటాన్ని చూసి ఎమిలిజోలా "ఇతడు ప్రతిభను నిరూపించుకోవటానికి ఒక నవల "బౌల్ **"Boule de Suif"** లాంటి కథలున్నాయి. ఎమిలీజోలా కూడా కథారచయితే. కథా రచయితలే కథను తక్కువగా చూడటం ఇతరుల్లో కూడా కనిపిస్తుంది. సుప్రసిద్ధ కథారచయిత రడ్యార్డ్ కిప్లింగ్ కథను నవలకు "పేదచుట్టం" గా భావించాడు. మరో ప్రసిద్ధ కథారచయిత వి.ఎస్. ప్రిట్ ఛెట్ కూడా నవల కంటే కథ తక్కువరకం సాహిత్య ప్రక్రియ అన్న అర్థం వచ్చే మాటలన్నాడు. మరి కొంతమంది కథారచయితలు కొన్ని కథలు రాయటం నవల రాయటానికి "తయారీ" గా భావించారు. ఆర్నాల్డ్ బెనెట్ కూడా "నవల రాయటం కంటే కథ రాయటమే సులభమైన పని" అన్నాడు. అందుకు అతడు మూడుకారణాలు కూడా చెప్పాడు.

1. రచనలో పొరపాట్లు వస్తే కథలోనైతే వెనక్కి తిరిగి చూసుకోవటం సులభం. నవలలో కష్టం మాత్రమే కాక, ఎక్కువ కాలం పడుతుంది.

2. మనకు తెలియని విషయాల్నీ, చెప్పటానికి కష్టమైన విషయాల్నీ కథా రచనలోనైతే వదిలిపెట్టవచ్చు.

3. రచనకు సంబంధించిన భావోద్వేగాన్ని కథలోనైతే తక్కువకాలం భరిస్తే చాలు. నవలలో చాలా ఎక్కువ కాలం భరించాలి.

నవల రాయటం కంటే కథ రాయటమే కష్టమని భావించే రచయితలు కూడా లేకపోలేదు. కథా ప్రక్రియలోని క్లుప్తత, తీవ్రత దాన్ని చాలా కష్టమైన ప్రక్రియగా తయారు చేశాయని వీరు నమ్ముతారు.

నవల చదివి పూర్తి చేసిన తరువాత – అది ఎంత గొప్ప నవలైనా సరే – దానికి సంబంధించిన అనుభూతి మాత్రమే పాఠకుని మనసులో నిలుస్తుంది. కొన్ని సందర్భాల్లో కొన్ని పాత్రలు కూడా మనసులో నిల్వవచ్చు. కానీ మంచి కథను చదివినప్పుడు అలా జరగదు. మంచి కథ మొత్తంగా పాఠకుని మనసులో నిలుస్తుంది. అంతరాంతర జ్యోతిస్సీమల్ని ఒక్కసారిగా వెలిగిస్తుంది.

అలాంటి కథా ప్రక్రియ ఏ సామాజిక, బౌద్ధిక, సాహిత్య నేపథ్యంలో ఉదయించిందో చూద్దాం.

*(వల్లంపాటి వెంకటసుబ్బయ్య 'కథా శిల్పం' పుస్తకం నుండి)* ♦

# సామాజిక చైతన్య కవితా గొంతుక




కొండసాని రజిత



- డా॥ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
9440222117

*ఆమె అనుగ్రహిస్తే*
*ప్రేమను పంచే అమృతభాండం*
*ఆగ్రహిస్తే*
*శిరస్సును తుత్తినియలు చేసే కోదండం*

ఇటీవల వాట్సప్‌లో చదువుతున్నాను కొండసాని రజిత కవితలు. ఎవరీమె? కవితలు చాలాబాగా రాస్తున్నారు అనుకున్నాను. తర్వాత తెలిసింది ఆమె అనంతపురం వాసి అని. ఇంతలోనే ఆమె కవితలు పుస్తకంగా రావడం, ఆవిష్కరించడం జరిగిపోయాయి. ఏప్రిల్‌నెల 28న వరంగల్లు నుంచి రైలు దిగి నేరుగా రాధేయ పురస్కార ప్రదాన సభకు వెళ్ళాను. లోపలికి వెళ్ళగానే రజిత వచ్చి పుస్తకం చేతిలోపెట్టారు. ఆమెను చూడడం అప్పుడే. అంతకుముందు కొన్నిసార్లు ఆమెకవితలు చదివినప్పుడు వాట్సప్‌లో అభిప్రాయం చెప్పడమే. ఆమె కవితల్ని ఒక్కసారిగా చదివినప్పుడు రజిత చాలాప్రామిసింగ్ కవి అనిపించింది. కొంత భావజాల పరిపక్వత, మరికొంత లోకానుభవం వస్తే ఆమె తనను తాను ఉన్నతీకరించుకోగలరు.

అందరు మహిళలలాగే రజితకూడా కళాకారిణి కావడానికి పెద్ద సంఘర్షణే పడవలసివచ్చింది. పదేళ్ళ వయసులోనే తాతకు పురాణాలు చదివిపెట్టడంతో ఆమెకు సాహిత్యంతో పరిచయమేర్పడినా, వెంటనే ఆమె రచనారంగంలోకి ప్రవేశించలేక పోయారు. చిన్నవయసులోనే పెళ్ళి, సంసారం, అంగన్వాడిఉద్యోగం వంటివి ఆమె రచనాజీవితాన్ని కొంతకాలం నివారించాయి. మంచిభర్త, అతని ప్రోత్సాహం ఆమెలోదాగి ఉన్న కవిని పంజరం నుండి బయటికి తీసుకొచ్చింది. ఫలితంగా "ఒకకల రెండుకళ్ళు" కవిత్వసంపుటి బయటికి వచ్చింది. ఈ సందర్భంగా రజితకు అభినందనలు.

రజిత కవితలన్నీ ఇటీవలి ఏడాదిలోపలివే. చాలా తాజాకవితలు. రజిత కవితలలో గట్టి రాజకీయ స్వరముంది. ఆమె కవితలను సీమకవితలని, రాజకీయ కవితలని, స్త్రీ పురుష సంబంధాల కవితలని విభజించి అధ్యయనం చేయవచ్చు, ఇతరాలు ఏవైనా ఒకటీ అరా ఉండవచ్చు.

రజిత వ్యవసాయకుటుంబంలో పుట్టారు. ***"కారుమేఘంతో పోరుసలిపే కరువుకు నిలువెత్తు రూపమైన రాయలసీమలో ఒసాధారణ రైతు"*** కుటుంబంలో పుట్టారు. జిల్లారాజకీయాలతోను కొంతసంబంధం ఉన్నట్లుంది. వర్తమాన భారతీయ రాజకీయాలమీద ఆమెకు తీవ్రమైన విమర్శనాత్మకదృష్టే ఉంది. పెట్టుబడిదారీ రాజకీయాలమీద గట్టి విమర్శ పెట్టారు. అంతాబాగుంది, దేశం వెలిగిపోతోంది వంటి భ్రమలు ఆమెకులేవు.

భారతదేశం వ్యవసాయ దేశమని, రైతు దేశానికి వెన్నెముక అని ప్రచారం జరుగుతుంది. ప్రణాళికలు, బడ్జెట్లు రైతుపేరుమీద అపారమైనడబ్బు ఖర్చవుతూ ఉంటుంది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలలో వ్యవసాయశాఖ మంత్రులుంటారు. అన్నీఉన్నా, రైతులు గిట్టుబాటు ధరకోసం ఎన్నికలలో

నామినేషన్లు వెయ్యాల్సి వస్తున్నది. ఉద్యమాలు నడిపి లాఠీచార్జీలకు, కాల్పులకు, అరెస్టులకు గురవ్వాల్సివస్తున్నది.

రజిత 'నాదేశపువెన్నెముకా'కవితలో దళారీవ్యవస్థ, ఎన్నికల రాజకీయం రైతును ఎలా నాశనంచేస్తున్నాయో అధిక్షేపగొంతుకతో చెప్పారు. పాలకులు రైతును ఓట్లుపెట్టే బంగారుబాతుగా చూసే దుర్మార్గాన్ని ఎత్తిచూపారు. రైతు అప్పులఊబిలో దిగబడి పోవడాన్ని ప్రస్తావించారు. రాజకీయ వైఫల్యాన్ని నిలదీశారు.

*ఐదేళ్ళనాడు జరిగే/ పోలింగ్ పండుగనాడు/ గద్దెనెక్కే ఖద్దరు పెద్దలకోసం/ ఫలం రాకున్నా పొలందున్నే/ నీహలం వర్ధిల్లాలి కలకాలం*

పాలకులు ఎన్నిరకాలుగా ప్రజల్ని వంచించినా, వాళ్ళు అవసరమైనప్పుడల్లా ఓట్లరూపంలోనే తమ సత్తా చూపుతున్నారు. రాజకీయవాదుల అంచనాలను తలక్రిందులు చేస్తూనే ఉన్నారు. 'నిజం గ్రహిస్తే' కవితలో ఈ నిజాన్నే ఎన్నికలముందు పాలకులకు గుర్తుచేశారు.

*అధికారంలోకి రాకముందు/ సుపరిపాలనను జపించి/ అవకాశం దక్కి, కుర్చీఎక్కి/ 'స్వ'పరిపాలనతో తపిస్తే/నిజాన్ని నీ రాజకీయ ఇజాన్ని/ గుర్తించిన జనం/ మళ్ళీ తమఓటు / పోటుగో/ నిన్ను ఉరితీస్తారు.*

అని హెచ్చరించారు. ఇంత ఖచ్చితమైన ప్రజాపక్షం వహించడం ఇతర కవులకు అనుసరణీయం, కవుల కంఠాలలో ఈ నిర్దిష్టత నేటి అవసరం.

చదువురాని వాళ్ళు మన రాజకీయాలలోకి వచ్చి పాలకులై విధానాలు రూపొందిస్తున్నారని రజిత చిన్నప్పుడు విన్నట్టున్నారు. ఇది ఒకప్పుడు నిజం. ఇప్పుడు కాదు. నిన్న, మొన్న మాధ్యమాలలో ప్రకటించారు 60% నుండి 88% దాకా అన్నీ పార్టీలూ విద్యావంతులకే, కనీసం డిగ్రీ చదివినవాళ్ళకే సీట్లు ఇస్తున్నారు. అయితే 'మినహాయింపు' కవితలో రజిత లేవనెత్తిన ప్రశ్న ప్రతి చిన్న ఉద్యోగికీ అనేక రకాల వడపోత ఉంటుంది, కానీ, అధినేతలై విధానాలను రూపొందించే వాళ్ళకు ఏ వడపోతలూ లేవు ఎందుకు? అన్నది. రాజకీయ రంగంలో గిరీశంల ప్రాధాన్యం పెరగడంపట్ల 'మహానటులు' అంటూ రజిత ఆగ్రహపడ్డారు. డబ్బుతో ఓట్లు కొనుక్కునే దుష్టసంప్రదాయాన్ని రజిత 'పోలింగ్‌పండుగ' ఏటేటా వస్తే బాగుండునని అధిక్షేపించారు. ఎటూ ఓట్లను కొంటున్నారు గనక, ప్రతిఏడాదీ కొంటే ప్రజలు పాలకులకు జ్ఞాపకం ఉంటారంటారామె. ఈ అధిక్షేపమంతా ఎందుకంటే, రాజకీయం ప్రజారాజకీయం, రాజకీయం ప్రజాస్వామ్య రాజకీయం కాకపోవడం వల్లనే.

కరువు అనంతపురం జిల్లాకు రోజూ వచ్చే చుట్టం. 'అనంత' జీవితం కరువుపట్టాల మీదనే సాగుతుంది. కరువు మీద కవితరాయని సీమకవులు లేరు. రజిత 'కరువుపూలు' రాశారు. కరువును గురించి ప్రచారం జరగడమేగాని, కరువునిర్మూలనా ప్రయత్నాలు అంతగా జరగడంలేదు. రజిత కరువు కరువుగానే మిగిలిపోయి, కరువుపేరుమీద జరిగే హడావిడిని ఎత్తిచూపారు.

*వల్లకాడయిన పల్లెతనం*
*రంగుల ఫోటోలుగా రూపాంతరం చెంది*
*పత్రికల పతాకశీర్షిక అవుతుంది*

రజిత భవిష్యత్తులో కరువు, కరువును ఆవరించిన రాజకీయ క్రీడను, కరవు సృష్టిస్తున్న ముఠాకక్షలను గురించి విస్తృతంగా కవితలు రాయవలసి ఉంటుంది. అలాగే ఫాక్షనిజం వల్ల, కరువుల వల్ల స్త్రీలు పడే బాధల్ని కూడా ఆమె చిత్రించడం అవసరం. అదే సమయంలో కోస్తా సినిమా రాయలసీమ ఫాక్షనిజంమీద చేప్పే అబద్ధాలనుకూడా రజిత తన కవితలలో విమర్శించడం అవసరం.

చెట్టును ప్రేమించని మనిషి ఉండదు. అనేక రకాల సంస్కృతి ప్రపంచమంతా చెట్టును ఆవరించి ఉంది. అదేచెట్టు వ్యాపారుల సరుకైపోయి పర్యావరణసమస్య ఏర్పడుతున్నది. చెట్లు అదృశ్యమౌతున్నాయి. బడావ్యాపారుల ప్రయోజనాల కోసం, కలపదొంగల కోసం చెట్లు, అడవులు అదృశ్యమౌతున్నాయి. కవులు ప్రకృతిప్రేమికులు. మానవత్వం మనుషులపట్లనే కాదు, ప్రకృతిపట్ల కూడా ప్రదర్శిస్తారు కవులు. రజిత 'చెట్టు' కవితరాశారు. చెట్టు మనిషికి పుట్టుక నుండి చావుదాకా ఏయే దశలలో ఎలా ఉపయోగ పడుతుందో వర్ణించారు.

*నీపుట్టుక నుండి తోడైవచ్చి*
*గిట్టాక నీ దేహంపై కప్పినమట్టిపై*
*మళ్ళీ చిగురించి చెట్టవుతుంది*

ప్రపంచీకరణయుగంలో కార్పొరేట్ విద్యావ్యవస్థలో జరిగే దుర్మార్గాలు అన్నీ ఇన్నీ కావు. విద్యావ్యాపారులుగా ఉన్న వాళ్ళు ఇవాళ రాజకీయ నాయకులై చదువును అంగడి సరుకుగా చేసి మానవ విలువల్ని ధ్వంసం చేస్తున్నారు. ఈ దుర్మార్గాన్ని మానవత్వం ఉన్న కవులు, విద్యపట్ల గౌరవం ఉన్న కవులుఎవరూ సహించరు. రజితకూడా "కార్పొ' రేట్'

చదువు" కవిత రాశారు.

*చదువుకునే వారికంటే /చదువు 'కొనే' వాళ్ళు/ఎక్కువ*

అని అధిక్షేపించారు. మందపుచర్మాలకు ఈ అధిక్షేపం అంటుతుందా! చదువును లక్షలు, కోట్లు పెట్టి కొనేవర్గం బలపడుతున్న సమాజంలో పేదరికం కూడా బలపడుతుంది. చిన్న చేపను పెద్దచేప మింగే వ్యవస్థలో ఆర్థికఅంతరాలు ఇంకా పెరుగుతాయి. రజితకు ఈ స్పృహ ఉంది. 'ఆకలిఅలారం' రాశారు. చెత్తకుండీలలో కుక్కలతో పోటీపడి అన్నం మెతుకులను ఏరుకునే భారతీయ పౌరుణ్ణి రజిత ఈకవితలో దయనీయంగా వర్ణించారు. ఈ కవిత ఏడుదశాబ్దాల స్వతంత్రభారత రాజకీయ వైఫల్యానికి నిదర్శనం. దేశంలో ఇంకా ఆకలి మనుషులుండడం ఒక 'అలారం' ప్రమాద హెచ్చరిక అంటున్నారు కవి.

*వాడిదేహం*
*డ్యూటీచేసే కార్పొరేషన్ కార్మికుల కర్రదెబ్బలను*
*పోటీకి దిగే వీధి కుక్కల పంటిగాట్లను*
*మౌనంగా భరించి నెత్తుటి గాయాలను పూస్తుంది*

స్త్రీ పురుష సంబంధాలు వస్తువుగా, రజిత, వైవిధ్యభరితమైన కవితలు రాశారు. స్త్రీగా తనంటే ఏమిటో రజిత నిర్వచించుకున్నారు, 'కీర్తిపతాకను' కవితలో. స్త్రీలోని రెండురకాల శక్తులను గుర్తు చేశారు 'రెండోకోణం'లో. ఇది స్త్రీగా, కవయిత్రిగా తననుతాను నిర్వచించుకోవడం, అస్సర్టైన్ చేసుకోవడం. 'కీర్తిపతాకను' కవితలో స్త్రీ అబలకాదు, సబల అని పురుషసమాజానికి గుర్తుచేశారు. ఉల్లేఖాలంకారం లాగా స్త్రీ అంటే ఏమిటో అనేక పోలికలు చెప్పారు. స్త్రీ శక్తిసామర్థ్యాలను నొక్కిచెప్పారు.

*నేను నారిని/ మ్రోగించిన సమరభేరిని* అని మొదలైన కవిత *నేను నారిని/ విజయం సాధించే సమరభేరిని* అని ముగిసింది.

స్త్రీశక్తిని చాటడంలో కొన్ని అతిశయోక్తుల్ని ఉపయోగించుకున్నా, స్త్రీని చులకనగా చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి అని హెచ్చరించడానికి వాటిని వినియోగించుకున్నారు. 'రెండోకోణం'లో కవి, స్త్రీలోని ద్విముఖశక్తిని వర్ణించారు. ఇదికూడా ఆకతాయి పురుషప్రపంచానికి హెచ్చరికే.

*అమ్మఒడి*
*త్రిమూర్తులనే జోకొట్టి నిద్రపుచ్చిన ఊయల*
*మదాంధులైన అసురులను*
*తుదముట్టించిన మృత్యుహేల*

ఈ రెండు కవితలూ స్త్రీలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి, స్త్రీలు తాము అబలలు కాదు అని గ్రహించడానికి ఉపయోగపడతాయి. అయితే ఈ పౌరాణిక పదజాలం నుండి ఆధునిక కవులు బయట పడవలసి ఉంది. అభ్యుదయ కవిత్వంలో పురాణపదాలను ఆధునికార్థంలో ఉపయోగించడం మొదలైంది. అది ఇంకా కొనసాగవలసిన అవసరంలేదు.

'స (రి)తిగమలు' కవితలో రజిత నేరుగా మొగవాడిమీద యుద్ధమే ప్రకటించారు. కుటుంబ స్త్రీ వేదనను చెప్పారు. మొగవాడైన సృష్టికర్తనే ప్రశ్నించారు. ఇది మూడు కవితల క్లుప్తరూప కవిత.

*వంటింట్లో కత్తిపీట/కూరలు తరిగేందుకే కాక/*
*మొగుడికి మొలిచిన/ 'మగాడి'ననే కోరలు తరిగేందుకూ/*
*ఉపయోగపడితే ఎంతబాగుండో*

పురుటిబాధలు మొగాడికెందుకు కల్పించలేదని మొగాడైన సృష్టికర్తను రజిత నిలదీయడం గమనించవలసిన అంశం. అదే సమయంలో రజిత తన జీవితసహచరుని, అతని ప్రేమను కొనియాడారు.

*అడుగడుగునా నువ్వుచూపిన ఓర్పు*
*నీ ఓదార్పు, నీ సహనం, నీ సాహచర్యం*
*నన్ను నానుండి వేరు చేసి నీలో కలిపేస్తున్నాయి*
*నిజమైన జీవనసహచరుడికి అర్థం చెబుతున్నాయి*

స్త్రీవాదమంటే పురుషులను ద్వేషించేది అనే మూఢనమ్మకంగల వారికి రజిత కవితలు, ఇదివరకే చాలా మంది రాసినట్లు, చెప్పినట్లు, స్త్రీవాదం పురుషాధిపత్యాన్నే తప్ప, పురుషులను ద్వేషించదని తెలియచేస్తున్నాయి. ఇదే శాస్త్రీయమైన పద్ధతి. ఆధునిక వైజ్ఞానిక శాస్త్రఫలితమైన, వైద్యవిజ్ఞానంలో విప్లవఫలితమైన 'స్కానింగ్' స్త్రీలకెలా నష్టం చేస్తున్నదో ఇదివరకే చాలామంది కవితలు రాశారు. రజితకూడా 'ఆదిపరాశక్తివై' కవిత రాశారు.

*అష్టలక్ష్మీ వినవే అంటూ/ పదేపదే అదేపనిగా పొగుడుతూనే/ అసమానత్వాన్ని ప్రదర్శించే/ ఆటవికతత్వాన్ని/ ఆదిపరాశక్తివై సంహరించు* అని పిలుపునిచ్చారు. అష్టలక్ష్మిని, ఆదిపరాశక్తిని అలా ఉంచి, మన సమాజంలో స్త్రీపేరుమీద స్త్రీకే అన్యాయం చేస్తున్న దుర్మార్గాన్ని ప్రతిఘటించమని కవి పిలుస్తున్నారు.

స్త్రీశక్తిని గురించి, స్త్రీ స్థితినిగురించి, స్త్రీ చైతన్యం గురించి

చైతన్యవంతమైన కవితలు రాసిన రజిత స్త్రీపురుష సంబంధాలను గురించి మరికొన్ని కవితలు రాశారు. ఋతువులసాక్షిగా, అద్దానికిసైతం, నువ్వేనేనుగా, కలనిజం చేసేందుకైనా, నిరంతరయత్నం, నీ చెలిమితో, నేను వల్లవించిన పాటగా మొదలైనవి. ఈ కవితలలో పురుషునికోసం స్త్రీనిరీక్షణ, పురుషుని పట్ల స్త్రీ తన్మయభావన, తాదాత్మ్యభావన, శరణాగతి వంటి ధోరణులు కనిపిస్తున్నా, అందమైన ప్రేమభావనలు రజిత వ్యక్తం చేయగలిగారు. స్త్రీని సినిమాలు భోగవస్తువుగా, కామవస్తువుగా ప్రదర్శిస్తున్నాయి. సీరియళ్ళు ఆడవాళ్ళజుట్లు ముడేస్తున్నాయి. సమాజంలో ప్రేమ పేరుతో పైశాచిక దాడులు స్త్రీలమీద జరుగుతున్నాయి. ప్రజాసంఘాలు స్త్రీలమీద దాడులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో రజిత రాసిన కవితలలోని నాగరికలక్షణాన్ని అభినందిస్తూనే, మరీ మొగవాళ్ళ పట్ల అంత తన్మయ, తాదాత్మ్యభావన అవసరం లేదని చెప్పవలసివస్తున్నది. అది స్త్రీలకు నష్టం చేస్తుందేమోననిపిస్తుంది. ప్రేమభావాభివ్యక్తిలో నిగ్రహం, సహనం లోపించకూడదు.

*నాకు నేనెవరో గుర్తే ఉండదు*
*నాలోని ప్రతిఅణువూ నీపేరే కలవరిస్తుంటే*

ఇది చెడ్డభావన అని ఎవరూ అనరు. స్త్రీపురుషులిద్దరూ తమతమ విడివిడి తనాలను వదులుకొని ఒక్కటవ్వడం అనేది చాలా ఉదాత్తమైన భావన. స్త్రీ నుంచి ఈ ప్రతిపాదన రావడంతో బాలు మొగవాడి కోర్టులోపడింది.

*ఇంతకూ నాకు అర్థంకానిది ఒక్కటే/ మనిద్దరం ఒకటేనని అద్దానికి ఎలా తెలుసో మరి/ తనలోకి తొంగిచూస్తే /ప్రతిబింబంగా నిన్ను చూపిస్తోంది*

స్త్రీ పురుష సమానత్వాన్ని కాదు, స్త్రీ పురుషసమైక్యతను చెప్పేతీరు రజితకు బాగా చేతనైంది. 'అద్దానికిసైతం' అనే కవితలో, కవి తనవైపు నుంచే కాకుండా, పురుషుడివైపు నుంచి కూడా ఆలోచించారు. అతనూ తనలాగే ఉండాలని కోరుకున్నారు.

*అంతర్ముఖుడైన అతడి ఆలోచనలన్నీ*
*కుసుమం చుట్టూ పరిభ్రమించే తుమ్మెదలా*
*నా గురించే పరితపిస్తుంటాయి*

ప్రేమ అనేది నిజమైన ప్రేమ అయితే అది ఒక స్త్రీ ఒకపురుషుని మధ్యనే సంపూర్ణరూపం తీసుకుంటుందనే భావన శాస్త్రీయమైనదే కాదు, అర్థవంతమైనది కూడా.

*సంతోషమంటే ఏంటో అనుకున్నా*
*నీసమక్షంలో వుండడమేనని తెలిసింది*

స్త్రీపురుషులు ఎదురెదురుగా కూర్చొని సంతోషంచడమనేది మధ్య తరగతి భావన. శ్రామిక స్త్రీపురుషులు శ్రమలో పాల్గొంటూ ఆనందిస్తారు. రజిత తన కవిత్వంలో మధ్యతరగతి స్త్రీపురుష సంబంధాలే చిత్రించారు.

స్త్రీ పురుషుని సాన్నిహిత్యం కోసమే తపన పడటం, అలాగే పురుషుడు స్త్రీసాన్నిహిత్యం కోసం తపన పడటం – ఈ ప్రక్రియ వైయక్తికంగా ఉండరాదు. అది శ్రమలో భాగంగా ఉన్నప్పుడే శ్రమైక జీవనసౌందర్యం అవుతుంది. స్త్రీని పువ్వుగా, పురుషుని తుమ్మెదగా పోల్చడం అయితే ప్రబంధ కవిత్వమో, కాకపోతే భావకవిత్వమో అవుతుందని యువకవులు గ్రహించాలి. నిజమే స్త్రీ స్త్రీగా, పురుషుడు పురుషుడుగా ఉండిపోవడం సజీవవ్యవస్థ అనిపించుకోదు. స్త్రీపురుషుల సమన్వయమే సమాజంలో సూర్యోదయం. అదే సమయంలో అది ఎవరో ఒక్కరే లాభం పొందడానికి దారి తీయకూడదు.

*నీ చూపుసోకి/రమణీయ శిల్పాన్నయ్యాను/నీ స్పర్శ తాకి ఉరికే జలపాతాన్నయ్యాను*

వంటి అభివ్యక్తులు ముగ్ధమనోహరంగా ఉంటాయి. అదేసమయంలో, అనేక అసౌకర్యాలవల్ల ఒంటరిజీవితాలు గడిపే వాళ్ళమీద ఈ అభిప్రాయాలు ఎలాంటి ముద్ర వేస్తాయో కూడా ఆలోచించాలి. ఒంటరి జీవితం నిష్ఫలమైందా? అనే అభిప్రాయం కవిత్వం కలిగించకూడదు.

కొండసాని రజిత చిన్నప్రాయంలోనే అందమైన కవిత్వరచనా శక్తిని కూడగట్టుకోవడం అభినందనీయం. సంప్రదాయ కుటుంబస్త్రీ పడవలసినదంతా పడి, ఆమె తనలోని కవిని కాపాడుకొన్నారు. సంసార లంపటంలో పడినా తనలోని కవిని కాపాడుకొని మళ్ళీ బయటికి తీసుకొచ్చి కావ్యం రాయగలిగారు. కోడికి ఎగరడం తెలిసినట్లు, కోయిలకు పాడడం తెలిసినట్లు రజితకు కవిత రాయడం తెలిసింది. దృక్పథం, తాత్వికతలను స్పష్టంగా ఏర్పరచుకుంటే తన కవిత్వాన్ని తానే సాపుచేసుకోగలరు. ఇందుకు సామాజిక శాస్త్రాల, పూర్వకవిత్వ అధ్యయనం సహకరిస్తుంది. సమాజంలో కొనసాగుతున్న ఉద్యమాలను అర్థంచేసుకున్నా చాలు.

♦

కవిత

## వాళ్ళిప్పుడు....

కరోనా కవిత

వైష్ణవి శ్రీ
8074210263

పచ్చని చెట్లనే గాజుల్లా
తొడుక్కున్న
పొలం గట్లతో ఆ ఊరు వారికి
వడ్డించే అమ్మలా ఉండేది

సూర్యుడు ఒళ్లు విరుచుకుని
కళ్లు తెరవకముందే
గంజో అన్నమో
నంజుకోవడానికి
ఒక మిరపకాయ కానులో
సర్దేసుకుని
పొలం గట్ల మీదనో
పొగాకు కంపెనీల ముందో
పక్షుల్లా వాలిపోయే వాళ్లు
ప్రపంచమంతా పరుచుకున్న
డబ్బు కాలుష్యానికో
భూగోళం మొత్తం మోగిన వస్తు
ధ్వని మాయకో
భూములు ధాన్యాలను కాక
చేపలనో రొయ్యలనో
కాపు కాస్తున్నందుకు చేతులు
ఖాళీ అయిపోయి చేష్టలుడికి
ఆకలి పొట్టల్ని భుజానేసుకుని
నగరానికి వచ్చి పడ్డారు
పైర గాలికి
భూమి పచ్చి వాసనలకు
అలవాటు పడ్డ ఆ పల్లె
గుండెలు
చల్లటి చెరువు నీళ్లు తాగి
తడిసి ముద్దైన ఆ గొంతులు
పట్టణ కాలుష్యంతో
ఊపిరితిత్తుల్ని
ధ్వంసం చేసుకుని
నీళ్ల సీసాల్లో చేపల్లా
కొట్టుకుంటున్నారు
పిజ్జాలు బర్గర్ల వాసన వాళ్లని
సోకవు
క్లబ్బులు పబ్బుల శబ్దాలు

వాళ్లని సోకవు
మెట్రోలు, మల్టీ ప్లెక్సులు వాళ్లని
ఆకర్షించలేవు

నగరమంటే వాళ్లకు రోడ్లు
నగరమంటే వాళ్లకు కాలుష్యం
బ్రతకడానికొచ్చారు కానీ
పల్లె గుండెల్ని పారేసుకోలేని
వాళ్లు ఎప్పటికీ పల్లె పిట్టలే
వాళ్లనొక్కసారి కుదిపి చూడండి
చెరువు నీళ్ల చప్పుడు వినబడుతుంది
వాళ్ల నవ్వుల్లో వరికంకులు
జలజలా రాలిపడతాయి
వాళ్ల మాటల్లో పొలం గాలి
ఎగిరొచ్చి మిమ్మల్ని చుట్టుకుంటుంది

రాత్రి ఏదైనా రైల్వే ట్రాక్ పక్కనో
గుడారాల్లోనో ఒళ్లు వాల్చినప్పుడు
వాళ్ళు మగతగా ఊరు గుడిసె
ముందున్న అరుగుల్ని
తడుముకుంటారు
నులక మంచం స్పర్శ కోసం
ఆరాటపడతారు

ఊళ్లో పిలగాడు మధ్యాహ్నం భోజనం
కోసమైనా బడికెళ్తున్నాడో, సెలవలొస్తే
బర్రెలు కాస్తున్నాడోనని దిగులు
పడుతుంటారు
అమ్మానాన్నల ముసలి చర్మాలు కలల్లో
వాళ్ల ముఖాలను నిమురుతుంటాయి

వాళ్ళు విమానాల్లో తిరిగింది లేదు
ఏ దేశానికి వెళ్ళేది లేదు
ఏ క్రిమినీ మోసుకు వచ్చింది లేదు
ఎవరివో డబ్బు సూట్ కేసుల మీద

పొక్కుంటూ వచ్చిన పురుగేదో
వారి బ్రతుకునంతా కొరుక్కుతిన్నది

గేట్లు మూసేసారు
కాంక్రీటు నిర్మాణాలు
సగం బట్టలు కట్టుకుని
సిగ్గుతో నిలబడిపోయాయి
నిలబడిన నేలంతా సర్రున లేచి
ఒక్కసారిగా వీపుమీద చెయ్యేసి
తోసేసింది

వాళ్లు మళ్లీ ప్రయాణమయ్యారు
ఏ సత్యమూ కనుక్కోకుండానే
ఏ జ్ఞానమూ పొందకుండానే
తిరిగి ఇంటికి బయల్దేరిన సిద్ధార్థుల్లా
వాళ్లిప్పుడు ఊరి వైపుగా నడుస్తున్నారు

నడిచే వాళ్ల కాళ్లు కూలొచ్చు
వాళ్ల గుండెలు తడబడొచ్చు
గొంతులు మూగబోవచ్చు
ఏమైనా కావొచ్చు
కానీ వాళ్లిప్పుడు తప్పిపోయిన పిల్లలు
తిరిగి అమ్మ ఒడిని చేరుకున్నంత
ఆత్రంగా చేతులు చాచి పిలుస్తున్న
ఊరు వైపు నడుస్తున్నారు
ఇప్పుడు వాళ్లు ఊరు కోసమే
ఊరుకి వెళుతున్నారు

ఎందుకంటే
ఊరు వాళ్ల చావు బతుకుల సహజాతం
ఊరికో భరోసా ఇచ్చి చూడండి
వాళ్ళు దేశానికే వెన్నెముకై
ఎప్పటికీ పడిపోకుండా మనల్నే
నిలబెడతారు!! ♦

కథ



# మట్టికాదు మనిషి

- కళ్ళేపల్లి తిరుమలరావు
9177074280

ఆ పట్నంలో ప్రధానమైన ప్రాంతాలలో అది ఒకటి. విద్యా, వైద్యం, రవాణా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండే ప్రాంతం అది.

ఆ ప్రాంతంలోని ప్రధాన రహదారి, దాని నుండీ పోయే ఉపరహదారి – రెండిటి మధ్యన ఉంది. ఆ ఆరుసెంట్ల స్థలం. దానిలో వాడకుండా వదిలేసిన రెండు గదుల రేకుల ఇల్లు ఉంది.

అది వడ్రంగి రమణయ్య ఇల్లు. రమణయ్య నలభై సంవత్సరాల కిందట పక్కనున్న చిన్న పల్లెటూరి నుండీ ఆ పట్నానికి వచ్చాడు.

అతనికి వడ్రంగం పని తప్ప ఏమీ తెలియదు. ఆ పని మీదే ఆ స్థలం కొన్నాడు. ఆ చిన్న ఇల్లు కట్టుకున్నాడు.

అతని ఇద్దరు కొడుకులూ అక్కడే పుట్టారు. పెద్దకొడుకు రంగారావు తండ్రిలాగా వడ్రంగం పని నేర్చుకున్నాడు. రెండో కొడుకు నాగరాజు మోటారుసైకిళ్ళ రిపేరు పని నేర్చుకున్నాడు.

ఇద్దరికీ పెళ్ళిళ్లు చేశాడు రమణయ్య.

కొడుకులు, కోడళ్ళు, తను, తన భార్య ఉండగలిగేంత ఇల్లు కాదది. మరి రెండు గదులు కట్టించే ఆర్థిక స్తోమత రమణయ్యకు లేదు.

రెండు గదులు కట్టుకుని అక్కడే ఉండమని కొడుకులతో చెప్పాడు. రంగారావు సరేనన్నాడు.

'స్థలం పంచితేగానీ గదులు కట్టటానికి వీలులేదు' అని అడ్డుపడ్డాడు నాగరాజు.

'నేను చనిపోయాక ఈ స్థలాన్ని ఇద్దరూ సమానంగా తీసుకోండి' అని కొడుకులతో అనేవాడు రమణయ్య.

రంగారావు, నాగరాజులు ఆ పక్క పేటల్లో అద్దె ఇళ్ళలో కాపురాలు పెట్టారు.

తల్లిదండ్రులను తన వద్దకు వచ్చి ఉండమన్నాడు రంగారావు. వాళ్ళు వినలేదు. దానితో వాళ్ళను అక్కడే ఉంచి అన్ని అవసరాలూ తనే చూసేవాడు రంగారావు.

అక్కడే రమణయ్య భార్య చనిపోయింది.

రమణయ్య కూడా అక్కడే చనిపోయాడు – తన స్వార్జితమైన స్థలాన్ని ఇంటిని చూస్తూ

దానితో ఇల్లు మూతపడింది.

♦♦♦

'అన్నయ్యా, నాన్న చనిపోయి రెండు సంవత్సరాలు నిండాయి. ఆ స్థలం ఇద్దరం పంచుకుందాం. మెల్లగా ఇళ్ళు కట్టుకుందాం. ఈ అద్దె ఇళ్ళతో అవస్థలు పడలేకపోతున్నాం' అన్నాడు తమ్ముడు నాగరాజు.

సరేనన్నాడు అన్న రంగారావు

స్థలం కాగితాలు బయటకు తీశారు. కొలతలు వేయించారు.

ఆ ఆరుసెంట్ల స్థలానికి దక్షిణాన ప్రధాన రహదారి, తూర్పున ఉపరహదారి ఉన్నాయి.

దక్షిణాన ఉన్న ప్రధాన రహదారి వైపు స్థలాన్ని రెండుగా విభజిద్దామంటే వెడల్పు తగినంత లేదు.

తూర్పున ఉన్న ఉపరహదారి వైపు స్థలాన్ని రెండుగా విభజిస్తే ఇద్దరికీ స్థలం చదరంగా వస్తుంది. అలాగే చేశారు.

వాస్తు ప్రకారం ప్రధాన రహదారి, ఉపరహదారి రెండూ ఉన్న స్థలభాగం అన్న తీసుకోవాలి. ఉపరహదారి మాత్రమే ఉన్న స్థలభాగం తమ్ముడు తీసుకోవాలి.

కానీ రెండు రోడ్లు ఉన్న భాగం నాకే కావాలని పట్టుపట్టాడు నాగరాజు. రంగారావు సరేనన్నాడు.

స్థలంలోని రేకుల ఇల్లు కూల్చేశారు. సర్వేరాళ్ళు పాతారు. సుమారు చెరొక నూటయాభై గజాల స్థలం వచ్చింది. రిజిస్ట్రేషన్ అయిపోయింది.

♦♦♦

ఆరునెలలు గడిచాయి. అన్నదమ్ములిద్దరూ తమ స్థలాలలో ఇళ్ళు కట్టాలనుకున్నారు. డబ్బు సమకూర్చుకునే ప్రయత్నాలలో ఉన్నారు.

ఇంతలో రోడ్ల విస్తరణ మొదలైంది.

నాగరాజు స్థలానికి దక్షిణం వైపు ఉన్న ప్రధాన రహదారిని విస్తరించారు. నాగరాజు స్థలంలోని వంద గజాలు రోడ్డులోకి పోయాయి. యాభై గజాల స్థలం మాత్రమే సన్న పీలికలా మిగిలింది.

ఆ యాభై గజాల పీలిక నాగరాజుకు ఎందుకూ ఉపయోగపడదు. ఎవరికైనా అమ్ముదామా అంటే – ఎవరికీ ఉపయోగపడదు.

ఒకరోజు అన్న రంగారావు దగ్గరకు వచ్చి 'నా యాభైగజాల స్థలం నువ్వే తీసేసుకో – అక్కడ ఉన్న రేటుకి' అన్నాడు నాగరాజు.

తమ్ముడు, నిజానికి నువ్వు తీసుకున్న స్థలం నేను తీసుకోవలసినది. దాన్ని నువ్వు కావాలని తీసుకున్నావు. ఒకవేళ దాన్ని నేనే తీసుకుని ఉంటే అప్పుడు రోడ్ల విస్తరణలో నా స్థలమే పోయి ఉండేది.

నువ్వు మాత్రం ఇప్పుడు ఎక్కడికి పోతావు నా స్థలం నుండి యాభై గజాలు నీకు ఇస్తాను. అప్పుడు నీకు వంద గజాలు అవుతుంది. ఇల్లు కట్టుకోవటానికి సరిపోతుంది' అన్నాడు రంగారావు.

'అయితే అక్కడ గజం పదివేలు పలుకుతుంది. మరి ఎంత ఇవ్వమంటావు?' అడిగాడు నాగరాజు.

'తమ్ముడూ, నేను నీకు యాభైగజాల స్థలం ఇస్తానంది డబ్బులకు కాదు' తమ్ముడి భుజం మీద చెయ్యేసి నిమురుతూ చెప్పాడు రంగారావు.

అన్న మాటలకు ఆశ్చర్యపోయాడు నాగరాజు

తను ప్రతిదీ లాభనష్టాల దృష్టితో చూశాడు. అందుకే విలువ ఎక్కువని రెండు రోడ్డులు ఉన్న స్థలం పట్టుపట్టి తీసుకున్నాడు.

అలాగే తల్లిదండ్రుల చివరి దశలో వాళ్ళను చూసే బాధ్యత పెద్ద కొడుకుదేనన్నాడు. తను తప్పించుకున్నాడు.

ఒకవేళ రోడ్ల విస్తరణలో అన్న స్థలమే పోయి ఉంటే – పోగా మిగిలిన స్థలాన్ని అన్న నుండీ తను మరీ తక్కువ ధరకు కొని ఉండేవాడు.

కానీ అన్న తనలాంటి వాడు కాదు.

ఇదంతా ఆలోచిస్తే నాగరాజుకు కళ్ళనీళ్ళు తిరిగాయి.

'అయితే ఈసారి వాస్తు ప్రకారం రెండు రోడ్డులున్న స్థలం నువ్వు తీసుకో. దాని పక్కనున్న ఒక్క రోడ్డు ఉన్న స్థలం నేను తీసుకుంటాను.

ఆరు నెలల క్రితం వాస్తును పాటించకుండా నేను స్థలం తీసుకున్నాను. దానితో నా స్థలం రోడ్ల విస్తరణలో పోయింది. ఇంకా నాకు చిన్న రోడ్డు ప్రమాదం కూడా జరిగింది అన్నాడు నాగరాజు.

'మరి, ఆరు నెలల క్రితం నేను కూడా వాస్తు తప్పి నువ్వు తీసుకోవలసిన స్థలం తీసుకున్నాను కదా. మరి నాకు ఏ నష్టం జరగలేదు.

నీ స్థలం రోడ్ల విస్తరణలో పోవటం, నీకు రోడ్డు ప్రమాదం జరగటం – కేవలం యాదృచ్ఛికం.

జీవితం అనిశ్చితమైనది. జీవితంలో ఎప్పుడూ ఏదో ఒకటి జరుగుతూనే ఉంటుంది. ఒక్కోసారి వరసగా మంచి జరగవచ్చు. మరోసారి వరసగా చెడు జరగవచ్చు. వాటిని వాస్తుకో, మరోదానికో అంటగట్టటం మానవ నైజం.

వాస్తు అనేది ఇంటికి గాలీ, వెలుతురూ సక్రమంగా రావటం కోసం. నూతులు, బోరింగులు, లెట్రిన్ టాంకుల

కవిత

# పరిపూర్ణత

పి.వి.ప్రసాద్
9440176824

సుదీర్ఘ జీవనయానంలో
వృద్ధాప్యం ఆఖరి ప్రస్థానం
నిజానికి వృద్ధాప్యమంతా
వేదనలపాలే...
హరించుకుపోయిన శక్తియుక్తులు
కృశించుకు పోయిన అవయవాలు
క్షీణించిన రూపురేఖలు
వేధించే శారీరక రుగ్మతలు
వెంటాడే మానసికాందోళనలు...
వృద్ధాప్యానికి హెచ్చరిక చిహ్నాలు !
అలసి సొలసిన దేహానికి
పెను సవాళ్ళు!
ముదిమితనం మోయలేని
బతుకు భారాలు!!
కానీ–
నా అన్నవాళ్ళందించే–
పిడికెడు సానుభూతి
కొద్దిపాటి ఆదరణ
కాస్తంత కరుణ
కించిత్తు ప్రేమానురాగాలు
కాసిని ఓదార్పు వచనాలు...
కుంగిపోతున్న వార్ధక్యాన్ని
ఊతకర్ర సాయంలా
కాచుకుంటాయ్..ఆదుకుంటాయ్
రోగికి వైద్యుడు చేకూర్చే



ఉపశమనంలా
ముసలి తనానికి సాంత్వన
చేకూరుస్తాయ్..భరోసానిస్తాయ్
నిరాశా నిస్పృహల్ని పారద్రోలే
ఉత్తేజ ఉత్ప్రేరకాలవుతాయ్
మినుకుమినుకుమను
వృద్ధాప్యపు దీపానికి
సరికొత్త వెలుతురునందిస్తాయ్.
చీకటి ముసిరే మలి సంజెలో
వార్ధక్యం సేద తీరుతుంది!
మనసులో వ్యధ
మటుమాయమౌతుంది!!
ఆత్మీయుల ఆలంబనతో కుదుటపడ్డ వ
ృద్ధత్వం–
అనుభవాల అనుభూతుల్ని
జ్ఞాపకాల దొంతరల్ని
నెమరువేసుకుంటూ
జీవితపు చివరిటంచులవైపు
పయనం సాగిస్తుంది!
కడదాకా సాగే ఈ పయనం
వార్ధక్యానికి పరిపూర్ణత నిస్తుంది!! ◆

---

మధ్య దూరం పాటించటం కోసం. పక్కపక్కనే నివాసాలు ఉండే వారి మధ్య వివాదాలు రాకుండా ఉండటం కోసం మాత్రమే.

అంతేగానీ వాస్తు వల్ల ప్రాణం పోతుంది. లేదా కోటీశ్వరులు అవుతారు అనేది కేవలం భ్రమ.

ఈ విషయం నాలాంటివాడు కాక పండితులు చెపితే సమాజంలో మార్పు వస్తుంది.

నువ్వు మోజుపడ్డ రెండు రోడ్ల స్థలం నువ్వే ఉంచుకో మరో ఆరు నెలలు చూడు. దానినిబట్టి ఆలోచిద్దాం' అన్నాడు రంగారావు.

◆◆◆

ఆరు నెలల గడిచాయి.


నాగరాజు వ్యాపారం బాగుంది. అతనికి ఏ నష్టం జరగలేదు. ఇల్లు కట్టటానికి డబ్బు బాగా సమకూరింది.

రంగారావు తన స్థలం నుండీ యాభైగజాల స్థలాన్ని తమ్ముడు నాగరాజుకు ఇచ్చాడు. రిజిస్ట్రేషన్ చేశాడు.

అన్నదమ్ములు ఇద్దరూ తమ స్థలాలలో ఇళ్ళు కట్టటం మొదలెట్టారు.

'స్థలం, డబ్బు కంటే అనుబంధం, ఆత్మీయతలు గొప్పవి. వాస్తు కేవలం సౌకర్యం కోసమే' తను తెలుసుకున్న నిజాలు ఆచరిస్తూ, నలుగురికీ చెప్పసాగాడు నాగరాజు. ◆

విశ్లేషణ




మందరపు హైమవతి



# పురుషాధిక్య సమాజంపై ధిక్కార స్వరం

- వొరప్రసాద్

మందరపు హైమవతి కొత్త కవితా సంపుటి 'నీలిగోరింట'. ఆమె మునపటి కవితా సంపుటి 'నిషిద్ధాక్షరి' ద్వారా స్త్రీవాద కవయిత్రిగా పేరు పొందారు. స్త్రీని కేంద్రంగా చేసుకుని సామాజిక నిబద్ధతతో కవిత్వం రాస్తున్న సీరియస్ కవయిత్రి మందరపు హైమవతి. ఎంపిక చేసిన 57 కవితలతో ఈ 'నీలిగోరింట' ను వెలువరించారు. సమాజం రోజు రోజుకీ ఆధునికంగా మారటం చూస్తున్నాం. మనదేశంలో 1990 నుండి అమలు జరిగిన ప్రపంచీకరణ విధానాలు ప్రజల జీవనప్రమాణాల్లో తీవ్రమార్పులకు కారణమయ్యాయి. మధ్యతరగతి ప్రజల్లో కొంతభాగం అభివృద్ధి ఫలాలను, అమెరికా డాలర్లను అందుకోగలిగారు. అదేసమయంలో దేశంలోని మెజారిటీ ప్రజానీకం అభద్రతతో కూడిన జీవితాలవైపు నెట్టబడ్డారు. పెరిగిన జీవనప్రమాణాల మెరుపులు పైకి బాగానే కనపడుతున్నాయి. ఇదంతా పైకి పటాటోపంగా కనబడుతున్న కోణం. ప్రచారానికి నోచుకున్న కోణం మాత్రమే. అయితే ఈ మెరుపుల వెనుక ఉన్న మనుషుల అంతరంగాల కల్లోలాలను, అమానవీయ పరిస్థితులను, మానవ సంబంధాల్లో పేరుకుపోతున్న అమానుషత్వాన్ని సామాజిక నిబద్ధత కలిగిన కవులూ, రచయితలూ రికార్డు చేస్తున్నారు.

మెట్రో సిటీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ లక్షలు సంపాదించే యువతి పదంతస్తుల తన ఆఫీసు భవనం మీద నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడటం వెనుక కారణాలను ఈ రచయితలు వెలికితీస్తున్నారు. ఈ ప్రపంచీకరణ ఆర్భాటాల హోరులో బతుకుతెరువు కోసం వందల, వేల కిలోమీటర్ల దూరానికి వలసబాట పట్టిన రోజూ కూలీల వెతల వెనుక నిజాలను ఈ రచయితలు పట్టుకుంటున్నారు. ఈ ప్రపంచీకరణ ప్రచార ఘంటికల మధ్య పండిన పంటకు గిట్టుబాటు ధర రాని రైతు పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకోవడం వెనుక ఉన్న రహస్యాల్ని ఈ రచయితలు వెలికితీస్తున్నారు. ప్రపంచీకరణ మోసుకొచ్చిన కార్పొరేట్ చదువుల కార్ఖానాల్లో 'చదువు' ఆత్మహత్య చేసుకోవడాన్ని ఈ కవులు పట్టుకుంటారు.

పసిపిల్లల నుండి పండు ముదుసలి వరకూ పవిత్ర భారతదేశంలో దుర్మార్గంగా హత్యాచారానికి గురవ్వడానికి కారణమైన ప్రపంచీకరణ విషఫలాలను ఈ రచయితలు సాహిత్యానికెక్కిస్తారు. ఇదే ఈ రోజు కవులూ, రచయితలూ నిర్వర్తించాల్సిన చారిత్రక బాధ్యత. ఆ మార్గంలో నడుస్తున్న కవయిత్రి మందరపు హైమవతి. తన పదునైన అక్షరాలను తూటాలుగా మార్చి తుప్పుపడుతున్న వ్యవస్థపై నిప్పులు కురిపిస్తున్నారు.

*'ఎవడ్రా! కూసిన మగవెధవ/ 'ఆడ జన్మ మధురమ'ని/ ఒక్కసారి కనిపిస్తే/ మొహం మీద/ ఎడమకాలి చెప్పుతో/ ఎడాపెడా కొడితే గానీ/ నా కసి తీరదు'* అంటారు– 'అద్దెకో గర్భం' కవితలో. ప్రపంచీకరణ తీసుకొచ్చిన 'అద్దె గర్భం' సంస్కృతిని ఈ కవితలో చీల్చి చెండాడతారు. ***'అద్దెకో***

*గృహంలా/ అద్దెకో గర్భం/ అమ్మకం కొనుగోళ్ళ వ్యవస్థలో/ ఏ వస్తువైనా అద్దెకివ్వడం/ అద్దెకు తీసుకోవడం/ మామూలైన మార్కెట్ యుగంలో/ కలిగినమ్మల సంతానేచ్ఛను తీర్చడానికి..'* అంటూ తీవ్ర ఆగ్రహాన్ని ప్రకటిస్తారు. మార్కెట్ వ్యవస్థలో గర్భాన్ని కూడా సరుకుగా మార్చి వ్యాపారం చేయడం ప్రపంచీకరణ అమానవీయతకు పరాకాష్టగా మనకు ఈ కవితలో చూపిస్తారు మందరపు హైమవతి. 'గర్భాన్ని' అద్దెకు తీసుకున్న 'కలిగనమ్మ', 'గర్భాన్ని' అద్దెకిచ్చిన 'నలిగినమ్మ' ఇద్దరూ ప్రపంచీకరణలో ప్రత్యక్షమైన రెండు ముఖాలుగా మనకు ఈ కవితలో కళ్ళకు కట్టిస్తారు కవయిత్రి. ప్రపంచీకరణ తీసుకొచ్చిన తీవ్ర ఆర్థిక వ్యత్యాసాలు ఎంతటి అమానవీయ పరిణామాలకు దారితీసాయో అర్థం చేసుకోవటానికి ఈ కవిత నిదర్శనంగా నిలుస్తుంది.

మనదేశంలోని వైవాహిక వ్యవస్థ స్త్రీలకు ఆత్మగౌరవం లేకుండా చేసింది. వాళ్ళ ఆత్మవిశ్వాసాలను అణిచివేసింది. స్వీయ కులంలోనే వివాహం చేసుకోవాలన్న ఆచారం కులవ్యవస్థ కొనసాగింపుకు కారణమవుతూనే వుంది. తద్వారా స్త్రీ కులవ్యవస్థ పునరుత్పత్తికి ప్రధాన వాహికగా మారింది. అన్ని రకాలుగా స్త్రీని బంధించివేసి పరిహాసమాడుతున్న వ్యవస్థను 'మాటలు లేని ఎడారిలో...' కవితలో చిత్రించిన తీరు ఆలోచనలు రేపుతుంది- *'ఒకే చూరుకింద వున్నా/ ఎడమొహం పెడమొహం గీతాల్లా/ ఎప్పటికీ కలవని విభిన్న ధృవాలం/.../ సంప్రదాయ పంజరం ఊచలు విరిచి/ రెక్కలు విప్పి స్వేచ్ఛా గగనంలో/ ఎగిరిపోతాయనుకొంటా కానీ/ కాళ్ళకు చుట్టుకొన్న అల్లిబిల్లి తీగల్లా/ అల్లుకున్న పిల్లల్ని తప్పించుకోలేక/ మాటల్లేని ఎడారిలా ఒంటరి ఒంటెను"* అంటారు. వేల సంవత్సరాల భారతీయ పవిత్ర పురుషాధిక్య సంస్కృతి 21వ శతాబ్ది స్త్రీని కూడా ఎలా నియంత్రిస్తుందో కళ్ళకు కట్టినట్టు ఈ కవితలో చిత్రించారు. కరడు కట్టిన పురుషాధిక్య భావజాలాన్ని తన పదునైన కవితల ద్వారా బద్దలు కొడుతుంది మందవరపు హైమవతి. స్త్రీలలోనూ పురుషులలోనూ పేరుకుపోయిన పితృస్వామ్య భావజాల తుప్పుని వదిలిస్తాయి హైమవతి కవితలు.

*'ఎ.టి.ఎం. కార్డు శాశ్వత చిరునామా/ ఎప్పుడూ మా ఆయన జేబే/..../ నిత్యావసరాల కోసం భర్త ముందు/ చేతులు చాచే ఆధునిక మహిళను"* అంటారు 'నెలకోసారి" కవితలో. ఉన్నత చదువులు చదువుకొని, ఉన్నతోద్యోగం చేస్తూ కూడా ఎ.టి.ఎం. కార్డులు మాత్రం భర్తల జేబుల్లో ఉండటాన్ని కవిత్వీకరిస్తారు. ఈ కవితలో స్త్రీ చదువుకోవడం, ఉద్యోగం చేయడం ఆధునికత... ఆర్థికంగా, సామాజికంగా భర్త నియంత్రణలో ఉండటం పురుషాధిక్య వ్యవస్థకు ప్రతీక. సంప్రదాయాలు, సంస్కృతి పేరుతో వివాహ వ్యవస్థలో, కుటుంబ వ్యవస్థలో అసమానతలతో కూడిన పురుషాధిక్యత కొనసాగుతున్న తీరును ఈ కవిత ఎత్తిచూపుతుంది. మనదేశంలో ప్రపంచీకరణ పేరుతో జరిగిందని చెబుతున్న ఏ అభివృద్ధీ కూడా ఈ పితృస్వామిక భావజాలాన్ని బద్దలు కొట్టలేకపోయింది. నిజానికి పెట్టుబడిదారీ ప్రపంచీకరణ అసమానతల వ్యవస్థని మరింత బలోపేతం చేసుకుంటుంది. ఆర్థిక వ్యత్యాసాలు సామాజిక అసమానతలకు దారితీస్తాయి. మానవ సంబంధాల్లోని ఆర్థిక సంబంధాలను రచయితలు అర్థం చేసుకోవడం చాలా అవసరం. అప్పుడే మనుషుల ప్రవర్తన, స్వభావాలను తమ రచనల్లో గాఢంగా చిత్రించగలుగుతారు.

*"ఔను/ నేనెప్పుడూ/ రెండవ పుటనే!/ అప్రాముఖ్య అక్షరాన్నే!/..../ జనన మాదిగా మరణపర్యంతం/ నియమాల ముళ్ళతీగల మధ్య/ నిషేధాల వలయాల నడుమ/ చిక్కుకొన్న స్వేచ్ఛా విహంగం/ కొట్టుకొంటూనే వుంది/ అటు ఇటు ఎగరలేక/ రెక్కలు విప్పలేక"* అంటారు. వర్తమాన సమాజంలోని మహిళల అంతరంగానికి ఈ కవిత అద్దం పడుతుంది. 'రెండవ పుట'గా ఉన్న తన స్థితిని గమనించే స్థితికి వచ్చినా నిషేధాల వలయాల నడుమ చిక్కుకొని ఎగరలేకపోతున్న స్థితిలో పెనుగులాడుతున్న మహిళలందరూ ఈ కవితలో ప్రత్యక్షమవుతారు.

*"మార్కెట్ యవనిక మీద/ మోహ ప్రవాహాల దేహాల వేలాల్లో/ నానావిధ వస్తు విక్రయాల్లో/ తానూ ఒక వస్తువైన విషాద సందర్భంలో"* అన్న *'వేదనా వేణువు'* కవితలోని చరణాలు మనల్ని వెంటాడతాయి. మార్కెట్‌లో మహిళను వస్తువును చేసిన ఆధునిక సమాజం నిజంగా ఆధునికం అనిపించుకుంటుందా ఆలోచించాలి.

*"అడిగిన వెంటనే/ అంగీకార ప్రేమలేఖనందించలేదని/ చూపుల వలలో/ దేహ విహంగం చిక్కుకోలేదని/ అగ్ని వర్షమో ఆమ్ల వర్షమో కురిపించి/ శరీరకావ్యాన్ని దగ్ధం చేస్తారా'* అంటూ ప్రశ్నించిన హైమవతికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రతీ పురుషుడిదీ.

# ఎలా?

**రాయపాటి శివయ్య,**
**9885154281**

*నేనిట్లా*
*ద్రవించలేని కఠినశిలగా*
*వృథాగా పడివుంటే ఎలా?*
*ప్రాణం పోసుకొని మనిషనిపించుకున్నాక*
*పదిమందికి బాసటగా నిలవకపోతే ఎలా?*
*మంచిని విత్తుగా గుప్పిట పట్టి*
*సంఘక్షేత్రంలో విత్తకపోతే ఎలా?*
*ఉరకలెత్తే గాలిని శ్వాసించే నేను*
*గుండెల్ని కదిలించే తడివున్న*
*ఒక జీవద్భాషను సృష్టించకపోతే ఎలా?*
*సాంద్రమైన ఒక మాటను నాటి*
*మనిషిని మనిషిని కుట్టి*
*అనుబంధపు పరిమళాలు*
*వెదజల్లక పోతే ఎలా?*
*పదును మొనలున్న*
*ఒక పదమో, పద్యమో విసిరి*
*విశ్వాన్ని కొత్తగా*
*వికసింపజేయకపోతే ఎలా?*



*సలసల మరిగే చారెడు అక్షరాలు ధారగా పోసి*
*లేలేత పత్రాల ఎద లోతుల్లోనూ,*
*సుతారమైన పూల నరాల్లోనూ పిడికిలెత్తే నినాదాలు*
*పండించకపోతే ఎలా?*
*ఒంటరై కృంగిన ఎదలో ఉత్తేజం నింపేందుకు*
*తన లోతట్టు సరస్సులోనే దాగిన విశ్వాసపు ఊటను*
*తోడిపోయకపోతే ఎలా?*
*ఎప్పుడూ నా స్వార్థపు ఊబిలోనే చిక్కుబడిపోకుండా*
*సమాజ హృదయాంతరాల్లోకి తొంగిచూసి*
*మంచి చెడులను పరామర్శించకపోతే ఎలా?*
*గుండెల్లో గూడుకట్టుకున్న జడత్వపు గుట్టల్ని బద్దలుకొట్టే*
*చలనకిరణాలు ప్రసరించకుండా*
*శూన్యాన్ని మోస్తూ వట్టిబొమ్మలా తొలగిపోతే*
*నేనింతా నిరర్థకచిహ్నమై*
*పిడికెడుమట్టిగా మిగిలిపోవడమే.* ♦

---

ఈ కవితా సంపుటిలో స్త్రీవాద కవితలు సింహభాగమే అయినా మానవీయ కోణంలో రాసిన కవితలూ మనల్ని ఆకట్టుకుంటాయి. ఆలోచింపచేస్తాయి. మానవ సంబంధాలన్నీ మార్కెట్ సంబంధాలైనప్పుడు నిస్సహాయులైన వృద్ధులకు గౌరవం ఎలా ఉంటుంది. వాళ్ళు చనిపోయిన తర్వాత మాత్రం తమ ఆర్భాటాలన్నీ ప్రదర్శిస్తూ అపరకర్మలు చేయడాన్ని 'ఎవరేం చేసినా' కవితలో ఆక్షేపిస్తారు – ***"అమ్మా!/ నీవలా కన్నుమూయగానే/ అపరకర్మ నిర్వహించి/ పున్నామ నరకం నుంచి రక్షించే/ పుత్ర పదాన్ని సార్థకం/ చేసాడు – కుమారుడు/ తల్లి జీవించినపుడు/ పట్టెడన్నం పెట్టనివారు/ మరణించాక తద్దినం పెడతారు/ బ్రతికున్నపుడు/ కొండంత అండగా ఉండని వారు/ కన్ను మూశాక/ సమాధి మీద నామ ఫలకం చెక్కిస్తారు"*** అంటూ వ్యంగ్యంగా కవిత్వీకరిస్తారు. ఆడంబరాల చుట్టూ, అమ్మకాల కొనుగోళ్ళ చుట్టూ తిరిగే సమాజం మానవత్వం పోగొట్టుకుంటుందనడానికి వర్తమాన కాలంలోని వృద్ధుల పరిస్థితి నిదర్శనంగా మనకు చూపెడతారు కవయిత్రి. బతుకు తెరువు కోసం, ఆ తర్వాత డబ్బు సంపాదన కోసం చేసే పరుగుపందెంలో కుటుంబ నిరాదరణకు గురయ్యే వృద్ధులు మనకు నిత్యం తారసపడతారు. ఆందోళన కలిగించే ఇటువంటి అంశాలను కవిత్వం చేసి నలుగురిలో ఆలోచన నింపేపని చేయడం నిజంగా అభినందనీయం.


సీనియర్ కవయిత్రిగా మందరపు హైమవతికి కవిత్వం ఎలా రాయాలో తెలుసు? ఏం రాయాలో కూడా బాగానే తెలుసు అనడానికి ఈ సంపుటిలోని ప్రతీ కవితా మనకు సాక్ష్యంగా నిలబడుతుంది. ఈ పుస్తకానికి ప్రముఖ కవి శివారెడ్డి రాసిన ముందుమాట కవయిత్రి కవితా ప్రయాణం గురించిన అవగాహనను మనకు అందిస్తుంది.

స్త్రీలకు సంబంధించిన సమస్యలను తనదైన శైలిలో కవిత్వీకరించి కవితా పాఠకులను ఆకట్టుకుంటారు హైమవతి. ప్రతీ కవితా ఏదో ఒక సమకాలీన సామాజిక సమస్యను వ్యక్తీకరిస్తుంది. ఆ కవితా వాక్యాలు పాఠకుల్ని కదిలిస్తాయి. చదివిన పాఠకుల ఆలోచనలను ఎంతోకొంత ప్రభావితం చేయకుండా ఉండవు ఈ సంపుటిలోని కవితలు.


శక్తివంతమైన కవిత్వం మానవ సంస్కారాన్ని ఉన్నతీకరిస్తుంది. అలాంటి కవిత్వం పుష్కలంగా వున్న కవితా సంపుటి ఈ 'నీలిగోరింట'. ఈ పుస్తకం చదవాలనిపిస్తే 9441062732 కు ఫోన్ చేయండి. ♦

విశ్లేషణ

# కనుమరుగౌతున్న కళారూపానికొక జ్ఞాపిక




వి.ఆర్. రాసాని




- పొదిలి నాగరాజు
7989320752


*"రాతిరిసూస్తి యేసములు రమ్మెముగా గురులాన మొన్నబా*
*గోతుల సత్తెబామ యన గూడని తాపమెల్ల సేసె మా*
*పాతకురాలు రాద వల పచ్చము రుక్మిణి సుద్దికిష్టమం*
*టీతీరుగనంచు వచియించును మూర్ఖుడు చంద్రశేఖరా"*
*(ఆంధ్రనాటక రంగ చరిత్ర)*

చంద్రశేఖర శతకంలోని ఈ పద్యం బాగోతులు వీధినాటకం ప్రదర్శించే తీరును తెలియజేస్తుంది. వీధి నాటకం జానపదుల భాషలోనే ప్రదర్శింపబడుతుందని చెప్పటానికి ఇదొక నిదర్శనం. ఒక కళను మరచిపోవటం సులభం. అదే కళను పునర్నిర్మించటం అసాధ్యం. అది ప్రాచీన కళ అయితే దానిని మరవటం తప్ప పోషించే అవకాశం వుండదు. అటువంటి వాటిలో వీధినాటకం ఒకటి. కొద్దిపాటి పరికరాలతో ప్రధాన వీధిలో ప్రజలముందు ఉచితంగా ప్రదర్శించే నాటకాలే వీధినాటకాలు. భాగవత కథలను వీధులలో నాటకాలుగా ప్రదర్శిస్తూ, దానినే కులవృత్తిగా స్వీకరించిన నాటక కళాకారులను బాగోతులు అంటారు. వీరి వీధి నాటకాలు వందల సంవత్సరాలు పండిత, పామరులచేత నీరాజనాలు అందుకున్నాయి. జానపదులు బాగోతులవాళ్ళను గౌరవించే విధానమే వాళ్ళు వీధినాటకాలను కులవృత్తిగా స్వీకరించటానికొక కారణం. ప్రాచీన కాలంలో రాజులు, ధనవంతులు, భూస్వాములు, అధికారులు వీరిచేత నాటకాలు వేయిస్తూ ఎంతోకొంత పారితోషికమిచ్చి పోషించేవారు. ఆనాటికాలంలో గ్రామ ప్రజలకు వీధినాటకాలే వినోదం, విజ్ఞానం. అందువల్లే వీధినాటకాన్ని జానపదుల కళారూపం అంటారు. తాను పుట్టింది వీధినాటకాన్ని పోషించటానికే అన్నంతగా వీధి కళాకారులు ఆ వృత్తికే జీవితాన్ని అంకితంచేసి ఇతర వృత్తులకు దూరమైపోయారు. వీరికి వీధినాటక సమాజంతో తప్ప మరేతర సమాజంతో సంబంధాలు ఉండేవి కావు. ఆధునిక కాలంలో చదువు, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన తర్వాత నాటకాలకు ఆదరణ తగ్గటం వల్ల వీళ్ళ పిల్లలు కూడా చదువుల బాటలో పడి వీధినాటకాలకు స్వస్తి చెప్పారు.

ఇప్పటికీ రాయలసీమలో ఎక్కడో ఒకచోట వీధినాటకాలు ప్రదర్శింపబడుతూనే వున్నాయి. అటువంటి వాటిలో కంగుంది నాటక సమాజం ఒకటి. ఈ వీధి నాటక సమాజం గురించి నేటి సమాజానికి పరిచయం చేసిన నవలే బతుకాట. ప్రభుత్వం చూపుకు నోచుకోని ఒకానొక వీధినాటక కళాకారుల సామాజిక వాస్తవిక జీవితాన్ని ప్రతిబింబించిన నవల ఇది. ఇందులో వి.ఆర్. రాసాని ఒకపక్క వీధికళాకారుల జీవితాన్ని చిత్రిస్తూనే మరోవైపు వీధినాటకం కనుమరుగు కావటానికి కారణాలను తెలియజేశారు.

వీధి నాటకాలను ప్రదర్శించే భాగవత మేళాలు రాయలసీమలోనే ఎక్కువగా వుండేవి. రాయలసీమలో నాటకాన్ని 'ఆట' అంటారు. ఆట ఆడేవాళ్ళను ఆటోళ్ళ

అంటారు. బతుకుతెరువు కోసం ఆటలు ఆడటం వల్ల రచయిత నవలకు 'బతుకాట' అనే పేరు పెట్టారు. వీరు ఎక్కువగా దొడ్డకవి సుగ్రీవ విజయము, కుమ్మర బాలయ్య సారంగధర, రుద్రకవి శశిరేఖా పరిణయం, బెడుదూరు రంగాచార్యుల హరిశ్చంద్ర, వేములపల్లి కృష్ణమాచార్యుల విరాటపర్వం, నరసింహారెడ్డి చుక్కలూరి రామనాటకం, భక్త ప్రహ్లాద, నల చరిత్ర లాంటి నాటకాలను ప్రదర్శించేవారు.

1867లో మరణించిన అణ్ణావు పటేరావు నుంచి ఐదవతరం వాడైన అణ్ణావు సిద్ధప్ప అలియాస్ సిద్ధోజీ వరకు గల ఐదు తరాల వీధి నాటక కళాకారుల జీవిత కథా విశేషాలే బతుకాట నవలా ఇతివృత్తం.

రాయలసీమ చిత్తూరు జిల్లాకు చెందిన యామిగానిపల్లె వీధినాటకాలకు ప్రసిద్ధి. ఊళ్ళో వీధి కళాకారులకు గురువు సిద్ధప్ప. తరాల నుంచి వారసత్వంగా వస్తున్న గురుత్వం సిద్ధప్పది. ఈయన భార్య పూర్ణమ్మ. కొడుకు నాగప్ప, కోడలు నీలమ్మ, మనవడు రవణ. ప్రతి ఉగాది రోజున తన పూర్వీకులను తలచుకొంటూ నాటకం వేయటం సిద్ధప్ప వంశాచారం. వీధినాటకాలకు ఆదరణ తగ్గిపోయిందని తెలిసినా సిద్ధప్ప ఉగాదికి విరాటపర్వం నాటకం వేయాలని శిష్యులందరినీ సిద్ధపరుస్తాడు. 'తరతారల గురువుల చరిత్ర' అనే పుస్తకం తెరచి తన వంశ గురువులందరినీ గుర్తుచేసుకుంటాడు. నాటకం వేసే ఉగాది రోజున సిద్ధప్ప తన పూర్వీకులు సమాధులు వున్న గురువుల తోపుకు వెళ్ళి పూజలు చేసి వారి ఆశీర్వాదాలను పొంది తర్వాత రాత్రికి నాటకం ఆడాలి. విజలాపురం జమీందార్లు తన వంశంవాళ్ళకు ఇనాముగా ఇచ్చిన గురువులతోపుకు శిష్యులతో వెళ్ళి గురువుల సమాధులకు పూజలు చేసి ఆ సమాధుల గత చరిత్రను శిష్యులకు వివరిస్తాడు.

అణ్ణావు పటేరావు (1867), ఆటోకు కోటేశ్వరరావు (1826–1902), అణ్ణావు తుక్కోజీరావు (1856–1906), అణ్ణావు వెంకోబరావు (1887–1950) లాంటివాళ్ళు వీధి నాటకాలకు చేసిన సేవగురించి సిద్ధప్ప శిష్యులకు చెబుతాడు. అదేరోజు సిద్ధప్ప తన గతాన్ని గుర్తుచేసుకుంటాడు. వెంకోజీ, బూసమ్మలు సిద్ధప్పకు తల్లి, తండ్రి. రేణుక, సుదేష్ణలు అక్కలు. వెంకోబరావు (వెంకోజీ) యామిగానిపల్లెకు గురువే కాదు ఊరి పెద్ద కూడా. కురువకోటప్ప, బలిజ బాలమ్మ లేచిపోయారని వెంకోజీ వారిద్దరిని ఊరినుంచి వెలేస్తాడు. వెంకోజీ పెద్దకూతురు రేణుక బంగారప్పతో కలిసి కుప్పం సంతలో లేచిపోయినప్పుడు కూడా వెంకోజీ వాళ్ళిద్దరినీ ఊరినుంచి వెలేస్తాడు. అప్పుడు సిద్ధప్పకు పది సంవత్సరాల ప్రాయం. రేణుక లేచిపోయి పెళ్ళిచేసుకోవడంతో వెంకోజీ కుటుంబం అవమానంతోపాటు ఆవేదనను భరిస్తుంది. సిద్ధప్ప పెద్దవాడై మంచి నటుడవుతాడు. కడపనుంచి సురభి నాటకాలలో వేషం వేయటానికి కబురు వస్తుంది. సురభి నాటకాలలో వేషాలు వేస్తూ సురభి నాటకాల పెద్ద నాగేశ్వరరావు కూతురు పూర్ణమ్మను పెద్దల ఇష్టప్రకారం పెళ్ళి చేసుకుంటాడు. భారతంమిట్టలో భారతం కథలు ఆడడానికి తండ్రికి బదులు సిద్ధప్ప సిద్ధమౌతాడు.

రచయిత స్వయంగా చిత్తూరు ప్రాంతమంతా సంచరించి వీధి కళాకారుల జీవితాలను పరిశీలించి, పరామర్శించి రచించిన నవల ఇది. అంతేగాకుండా వీధి నాటకాలు ఆడిన అనుభవం కూడా రచయితకు వుంది. అందువల్లే ఇలాంటి దృశ్యరూపకమైన నవలను చిత్రించారు. ప్రేక్షకుడైన నవలా రచయిత ఇలాంటి నవలలు రాయటం అసాధ్యం.

చిత్తూరు జిల్లాలోని కంగుంది ప్రాంతంలో వీధినాటకాలకు నాంది పలికినవాడు, ఆదిగురువు అణ్ణావు పటేరావు. ఈయన 1867లో మరణించాడు. "ఆయప్పకు సిన్నప్పట్నుంచీ కొంచెం ఆటపాటలు పాడేది, సిరిసాపలల్లేది వచ్చునంట! అందువల్ల తాటాకు మట్టలకు, మడిసి తల మాదిరి రంగులేసి, వాటినే రాముడిగా, రావణుడిగా సెప్పి రామాయణం కథపాడి అందర్నీ మెప్పించి, వాళ్ళిచ్చే దాంతో బతుకీడ్చినాడంట. అట్ల మన ఆటకు నాంది పలికినోడు ఓం ప్రథమంగా మనకు ఆదిగురువైనోడు ఈయప్ప!" అంటూ రచయిత కంగుంది వాళ్ళు నాటకాలను ఎలా మొదలుపెట్టారో తెలియజేసారు.

బతుకుతెరువుకు మొదలుపెట్టిన పటేరావు ఆట ఎన్నో తరాలను బతికిస్తుంది. పటేరావు బావమరిది ఆటోకు వెంకటేశ్వరరావు రెండవ గురువు. వెంకటేశ్వరరావు, పటేరావు ఆటనే కొంత మార్పు చేసి కొత్తపద్ధతిలో ఆడేవాడు. రాయలసీమలో అప్పటికే వ్యవహారంలో వున్న కొరవంజి, వీధినాటకాలను నేర్చుకొని ప్రదర్శనలిచ్చి పేరువహిస్తాడు.

1870లో ధాతుకరువు ఏర్పడినపుడు కోటేశ్వరరావు తన పల్లె వదిలి సీమ పల్లెలన్నీ తిరిగి వీధినాటకాల ప్రదర్శనలిచ్చి సీమ ప్రజలకు కంగుంది నాటకాలను రుచిచూపిస్తాడు. దీనితో సురభి కంపెనీ ప్రముఖుడు వనారస సంజీవరావు కోటేశ్వరరావును పిలిపించి నాటకాలు ఆడిస్తాడు. ఈయనను

తెల్లదొరలు కూడా మెచ్చుకుంటున్న సందర్భంలోనే "యిజలాపురం షావుకారు, జమీందారు ఆయప్ప గొప్పతనానికి మెచ్చి గురువులతోపును ఈనాముగా రాసిచ్చినారంటలే....!" అని గురువులతోవు సిద్ధప్ప వంశం వారికి ఎలా సంక్రమించిందో రచయిత తెలియజేసాడు.

మూడవ గురువు తుక్కోజి. సురభి నాటకాల సృష్టికర్త అయిన వనారస గోవిందరావు సహచర్యంతో గొప్ప కళాకారుడుగా పేరుపొందుతాడు. నాల్గవ గురువు అణ్ణావు వెంకోబరావు (వెంకోజీ). ఈయనే సిద్ధప్పకు తండ్రి, గురువు. 1857 ముందు నుంచి 1950 వరకూ కొనసాగిన కంగుంది వీధినాటకాల చరిత్రను ఐదవతరం వాడైన సిద్ధోజీ కొంతకాలం నడిపిస్తాడు. సిద్ధోజీ మరణంతో కంగుంది చరిత్ర అంతరించిపోతుంది. దీనికి కారణం "టిక్కెట్టు పెట్టి ప్రదర్శనలిచ్చే అద్భుతమైన ఒక ఆధునిక నాటక కంపెనీ కుప్పంలో దిగటమే''. ఈ టిక్కెట్టు నాటకాలకు "ఇష్టదేవతాస్తుతి, వినాయకస్తుతి, గురుప్రశంస... ఇవి ఏవీ లేకనే పాత్ర ప్రవేశం జరిగిపోతుంది".

అప్పుడప్పుడే అశ్లీలతతో రూపుదిద్దుకొంటున్న ఆధునిక నాటకాలకు ఆకర్షితులైన యువకుల అభిప్రాయాన్ని గుర్రప్ప పాత్ర ద్వారా వీధినాటకాలు ఆడే సిద్ధప్పలాంటి వాళ్ళకు తెలియజేసాడు రచయిత రాసాని. అల్లీఅర్జున నాటకం చూసి ఈసడించికొని వెళ్తున్న సిద్ధప్పతో గుర్రప్ప "ఏమి సిద్ధోజీ! పోతా వుండావా? బాగా లేదా? మనమేసే ఈది నాటకాలకు, ఈ డ్రామాలకు ఎంత తేడానో చూడు! డ్రామా అంటే యిట్టుండాల! సిల్మా జూసినట్టుండాల...! అప్పుడే జనాలు కనక వర్షం కురిపిస్తారు. మనమూ వేస్తాం.... మన తాతలు, ముత్తాతలు ఎట్టేసినారో అట్ట.....!" అంటాడు.

నవలలో రచయిత 'తరతరాల గురువుల చరిత్ర' అనే కళాకారుల డైరీని పరిచయం చేశాడు. "నీకెప్పుడన్నా తీరుబడి వున్నప్పుడు నీ చరిత్ర రాసుకో..... గురువులు రాసిండే బుక్కు సిరిగిపోతే అదంతా యింకో బుక్కులో రాసిపెట్టు" అంటూ వెంకోజీ సిద్ధప్పకు చెబుతాడు. నిజానికి ఇలాంటి డైరీలు వీధి నాటక కళాకారులు రాసిపెట్టుంటే ప్రస్తుతం తెలుగు నాటక సాహిత్యంలో వీధినాటకాల చరిత్ర కోకొల్లలుగా లభించేది. వీధినాటకాల పూర్వాపరాలు తెలిసేవి. నవలలో 'తరతరాల గురువుల చరిత్ర' రాయటం మానేయటంతో వీధినాటకాల ప్రదర్శనలు కూడా ముగుస్తాయి. దీని గమనమే నాటకాల ప్రయాణంగా రచయిత తెలియజేశారు. సిద్ధప్ప ఈ డైరీని కొనసాగిస్తాడు. నాగప్ప దీనిని కొనసాగించకపోవటంతో కంగుంది నాటక చరిత్ర కనుమరుగైపోతుంది. దీనితో వీధి కళాకారుల జీవితాలు నాటక జీవితానికి స్వస్తి చెప్పి సంఘ జీవితానికి నాంది పలికాయి. నాగప్ప కొడుకు రవణ ఉపాధ్యాయుడు కావటం, వాళ్ళ పిల్లలు చదువు, ఉద్యోగాలలో చేరటంలాంటివి వీధి కళాకారులు వీధి నాటకాలకు దూరమైన పరిస్థితిని తెలియజేస్తాయి.

వీధి నాటకాల ప్రదర్శన ఇదుగో ఇలా వుండేదంటే ఈ తరం పిల్లలకు ఆశ్చర్యం కలుగుతుంది. వీధి నాటకం గతించిన కళారూపం. వీధి నాటకాలను వీధులలోనే ప్రదర్శిస్తారు. ఊరి మధ్యలోనో, నాలుగు వీధులు కలిసే చోటనో, నలుగురు కూడే ప్రదేశంలోనో వీధినాటకానికి వేదికను తయారుచేసుకుంటారు. గడ్డపారలతో నాలుగువైపులా గుంజలు (కర్రలు) నాటి వందిరివేస్తారు. పైన తాటాకులతోగానీ, ఈతచాపలతోగానీ కప్పేస్తారు. ముందు కూర్చున్న ప్రేక్షకులకు నటులు కనిపించేలా పందిరిలో ఎత్తుగా దిబ్బ చేస్తారు. మామిడితోరణాలతో అలంకరిస్తారు. తెరలు, లైట్లు లేని కాలంలో తెరకు బదులు దుప్పట్లు, లైట్లకు బదులు దివిటీలు ఉపయోగించేవారు. కరెంటు, గ్యాస్‌లైట్లు వచ్చిన తర్వాత ఇవి మరుగునపడిపోయాయి. కళాకారులంతా ఒక్కొక్కరు ఒక్కొక్క ఇంటికి వెళ్ళి భోజనం ముగించుకుని వస్తారు. లేదంటే స్వయంపాకం తయారుచేసుకుంటారు. నాటకం ప్రదర్శించే స్థలం నుంచి దగ్గరగా వున్న ఇంట్లో వేషాలు వేసుకోవటానికి సిద్ధం చేసుకుంటారు. ప్రేక్షకులు రావటంకోసం ముందుగా గణపతి, లక్ష్మీదేవి, సరస్వతి లాంటి దేవతలను స్తుతిస్తూ మద్దెల, తాళాలతో కొలువు సంగీతం చేస్తుండగా మరోవైపు వేషాలు తయారౌతూ వుంటాయి.

గ్రామంలోని పెద్దమనుషులు వచ్చేవరకూ నాటకం మొదలుకాదు. వేషధారణకు తెలుపు, ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగులను వాడుతారు. నలుపురంగుకు బొగ్గులను వాడేవాళ్ళు. స్రుతి హార్మోనియం వాయించే వ్యక్తి, మద్దెల కొట్టేవ్యక్తి, ఒక జత తాళం చిప్పలతో వంత పాడేవాళ్ళు సిద్ధంగా వుంటారు. "రాజు వెడలె రవితేజములలరగ" అంటూ చోపుదారి చిందులు వేస్తూ ప్రవేశించటంతో నాటకం మొదలవుతుంది. చోపుదారి తర్వాత వేదిక మీదికి వచ్చిన ప్రతీపాత్రా మూడు పక్కలవైపు చూస్తూ తిరుగుతూ అభినయిస్తుంది. పాత్ర హెచ్చు కంఠస్వరంతో గట్టిగా పాడుతుంటే మద్దెలవాడు ఆ పాత్రను మరింత

ఉత్సాహపరిచేలా మద్దెల కొడుతుంటే, వంతపాడేవారు తాళం చిప్పలతో అంతే హుషారుగా తాళం కొడుతూ పాత్రతోపాటు ఆ చరణాన్ని ఒకటికి రెండుసార్లు గట్టిగా పాడేవాళ్ళు. పాటలోని భావం వింటున్న ప్రేక్షకులకు అర్థమయ్యేవిధంగా అరటిపండు వలచినట్లు విదూషకుడు వివరిస్తాడు.

వెంకోజీ కాలంలో భక్తప్రహ్లాద, భారతం కథల నాటకాలను, సిద్ధోజీ కాలంలో సారంగధర, సత్యహరిశ్చంద్ర, భారతం కథల నాటకాలను, అవి ప్రదర్శించే తీరును రాసాని బతుకాట నవలలో ఎంతో చక్కగా చిత్రీకరించారు.

సిద్ధప్ప ఉగాది రోజు విరాటపర్వం నాటకం వేయటానికి నటులను సిద్ధం చేస్తాడు. నాటకం ఆడటానికి కొద్దిరోజుల ముందు కళాకారులంతా గజ్జెపూజను చేయాలి. ఇది వీధి నాటకానికి ముందు జరిగే ఆచారం. ముందుగా నాటక విధానంలో గజ్జెపూజకు చాలా ప్రాధాన్యత వుంది. ఎందుకంటే వీధి నాటకంలో చిన్నపాత్రైనా, పెద్ద పాత్రైనా కాళ్ళకు గజ్జెకట్టి చిందేయాల్సిందే. వీధినాటకంలో ఒక్క పాత్ర కూడా గజ్జకట్టకుండా కనిపించదు. "రంగస్థలంపైన ఎలా పాడాలో, ఎలా ఆడాలో అభ్యాసం చేయటానికి అక్కడ నాంది పలకబోతున్నారు. అందులో భాగంగా 'ఆట' రోజు కాళ్ళకు కట్టుకోబోయే గజ్జెల్ని కూడా నటులు ఓం ప్రథమంగా ఆ రోజు ధరించబోతున్నారు. ఆ సందర్భంగా వాటికి పూజా పునస్కారాలు చేయబోతున్నారు. అదే గజ్జపూజ". ఈ పూజ జరిగినప్పటినుంచి నటులంతా సంధి సన్నివేశాలను పదేపదే నటిస్తూ నేర్చుకుంటారు. గజ్జపూజ రోజు నుంచి నాటకం రోజు వరకూ ఇదే తంతు కొనసాగుతుంది. నాటిక సంప్రదాయంలో గజ్జెపూజ ఎంత ప్రధానమో, నాటకాన్ని ప్రదర్శింపజేసే వేదిక అంతే ప్రధానం.

నటులంతా కలసి నాటకం రోజు వేదికను ఎలా తయారుచేసుకుంటారో రచయిత చిత్రీకరించాడు. "వేయబోయే నాటకం కోసం, భజన గుడి ముందర – పందిరి నిర్మాణం జరుగుతోంది. కొందరు గుంజలు నాటుతుంటే, మరికొందరు టెంకాయకేతులు చీల్చుతున్నారు. కొందరు నాటిన గుంజలకు పైన అడ్డకొయ్యలు సప్లయి తీసుకొని లైట్లు అరేంజ్ చేస్తున్నారు. అప్పటికే మైక్‌సెట్లు దిగిపోయి, లౌడ్‌స్పీకర్లో సినిమా పాటలు వినిపిస్తున్నాయి. సాయంత్రమైంది. నటులు ఎవరి వేషాలు వాళ్ళు సిద్ధం చేసుకోసాగారు...." ఇదంతా కరెంటు వచ్చిన తర్వాత వీధినాటకం ప్రదర్శించటానికి ముందు జేసుకునే పద్ధతి. కరెంటు లేని కాలంలో వీధినాటక ప్రదర్శన గురించి ముందుగానే చెప్పుకొన్నాం.


సినిమాలు రాకముందు బహిరంగ ప్రదేశాలలో ప్రజలను ఆనందపరచిన కళారూపాలు వీధినాటకాలే.

"బాణమెయ్య గలవా మృగముల బట్టిత్రుంచగలవా
నాణెము తోడుత జారుడబండల మీదికెక్కగలవా"

ఈ పాటనే కొంత మార్పుచేసి చెంచులక్ష్మి సినిమాలో చిత్రీకరించారు. ఈ విషయం ఆంధ్ర ప్రేక్షకలోకానికి తెలుసు. అయితే ఈ పాట యాదవరాజు రచించిన 'గరుడాచల' యక్షగానంలోనిదని తెలిసినవారు కొందరే. యక్షగానానికి చెందిన ఇలాంటి పాటలు వీధినాటకాలలో కోకొల్లలు. బళ్ళారి రాఘవ, పద్మశ్రీ చిత్తూరు నాగయ్య, పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావు లాంటి గొప్ప నటులంతా ముందుగా వీధినాటకాలలో వేషాలు వేసినవారే. ఈ రోజుకీ రాయలసీమ ప్రాంతాలైన కర్నూలు, అనంతపురం జిల్లాలో వీధినాటకాలు కనిపించకపోయినా చిత్తూరు, కడప జిల్లాలో అక్కడక్కడా వీటి ప్రదర్శనలు కనిపిస్తూనే వున్నాయి. ఈనాటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం దెబ్బకు ఈ ప్రాచీనకళ రోజురోజుకూ మనకు దూరమైపోతుంది. వీధినాటకాలు ఆడించే వాళ్ళు లేక, వీధి కళాకారులకు బతుకుతెరువు కనిపించక, కడుపు కూటికోసం చిన్న చిన్న వ్యాపారాలు, కూలి పనులు చేసుకుంటూ జీవితాన్ని వెళ్లబోస్తున్నారు. ఏ ప్రభుత్వం కూడా వీరి కళకు ప్రోత్సాహాన్ని కలిగించే చర్యలేవీ చేపట్టలేదు. తెలుగు సామాజిక పల్లె జీవనానికి పచ్చతోరణంలా వెలుగొందిన వీధినాటకాలు ఇప్పుడెక్కడా (చిత్తూరు, బద్వేలు తప్ప) కనిపించటం లేదు.

రాయలసీమ నవలా సాహిత్యంలో రాసాని బతుకాట నవల ఒక మంచి దృశ్యకావ్యం. మొదలైనప్పటి నుంచి చివరి వరకూ నవలా కథనం జక్కన శిల్పంలా వుంటుంది. ఈ కాలానికి వీధి నాటకం చూడటానికి నోచుకోని వారెవరైనా వుంటే వారు బతుకాట నవల చదివితే సరిపోతుంది. ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని విశ్వవిద్యాలయాలు డిగ్రీ స్థాయి విద్యార్థులకు 'బతుకాట' నవలను ఉపవాచకంగా పెట్టడం గర్వించదగ్గ విషయం. అదేవిధంగా తానావారు ఈ నవలకు బహుమతిని ఇవ్వడంతో వారి ఎన్నిక సరైనదేనని చెప్పుకోవాలి. ♦

విశ్లేషణ




డా॥ ఎన్. ఈశ్వర్‌రెడ్డి



# నిర్మలంగా ప్రవహించే మనిషి కోసం...

- డా॥ పి.సి.వెంకటేశ్వర్లు
9490164963

మనిషికోసం వెదుకులాడటం ఇరవై ఒకటవ శతాబ్దపు అభ్యుదయకవులు చేస్తున్న ప్రయత్నం. ఒక శతాబ్దం కిందట గురజాడ మట్టికంటే మనిషి గురించి ఆలోచించమని, మానవత్వాన్ని గురించి చర్చ మొదలుపెట్టాడు. అయితే నేటి ప్రపంచీకరణ నేపథ్యంలో మనిషికంటే మార్కెట్‌కీ, వస్తుసంస్కృతికీ విలువ ఎక్కువైన సందర్భం. సమాజంలో అడుగంటిపోతున్న మానవతత్వాన్ని బ్రతికించడం కోసం శక్తివంచన లేకుండా మేధావులు కృషిచేస్తున్నారు. పెట్టుబడిదారీ సమాజంలో మనిషి మరమనిషిగా మారి, కంప్యూటర్ ముందు కూర్చోవడం ప్రారంభమైన నాటినుండి అభ్యుదయకవులు ఈ విషయంపై మాట్లాడుతూనే ఉన్నారు. పాలిచ్చి పెంచే తల్లులు పలకబారిన యంత్రాలుగా మారుతున్నప్పుడు స్పందించారు. వృద్ధాశ్రమాలు రెట్టింపు సంఖ్యలో పెరుగుతున్నప్పుడు మాట్లాడారు. పల్లెలు శ్మశానవైరాగ్యంతో బక్కచిక్కి పోయినప్పుడూ మాట్లాడుతున్నారు. మనిషిని కవిత్వ రూపంలో, కథల రూపంలో, నాటకాల రూపంలో వెదుకులాడుతూనే ఉన్నారు. ఆ ప్రయత్నంలో భాగంగా ఇటీవల డా॥ ఎన్. ఈశ్వర్‌రెడ్డి రాసిన కవితా సంపుటి 'నాకొక మనిషికావాలి'. మట్టివాసన తెలిసిన వ్యక్తిగా, మనిషితత్వాన్ని అర్థం చేసుకున్న ఆచార్యుడిగా, మానవత్వాన్ని ఆకలింపు చేసుకున్న కవిగా అనేక ఖండికల్లో మాయమైపోతున్న మనిషికోసం తన కవిత్వపు లేజర్ కళ్ళతో వెదికాడు.

ప్రాంతీయ అస్తిత్వంపై రెండు కవితా సంపుటాలు వెలువరించిన ఈశ్వరరెడ్డి, ఈ కవితా సంపుటిలో మనిషిని కేంద్రబిందువుగా చేసుకున్నాడు. అందుకే కులమతాల ముళ్ళకంపలు ఏపుగా పెరుగుతున్న రోజుల్లో దళితులను చుట్టాలుగా చేసుకొన్న తనతల్లి లక్ష్మమ్మ మానవత్వపు గుబాళింపుకు ఈ సంపుటాన్ని అంకితం ఇచ్చాడు. ప్రశ్నించడం నేర్పినందుకు తన గ్రంథాన్ని తండ్రికి అంకితమిస్తున్నానని అంటాడు గోపీచంద్. అలాగే రచయిత కూడా తల్లి నేర్పిన సమసమాజదృష్టికి గుర్తుగా తన రచనను అంకితమిస్తున్నానని అంటాడు.

ఆర్వీయస్ సుందరం, రాచపాళెం, శిఖామణి, వినోదిని వంటి వారి ముందుమాటలు పుస్తకంలోని కవిత్వతత్వాన్ని కొంతవరకు వివరించారు. రచయిత వివిధ ఖండికల్లో వ్యవస్థపై సూటి ప్రశ్నలను సంధించాడు. కవిత్వం ఒక జీవరసం, రండి బాబూ రండి... మా భూములిచ్చేస్తాం, మా చెవులు ఖాళీగానే ఉన్నాయి, మతమౌఢ్యరేఖ, నాకొక మనిషికావాలి, పుష్కరపుణ్యం మాక్కూడా కావాలి, ప్రేమనౌక, పల్లె పండగ, ఓటు వేస్తేనే బతికున్నట్టు లెక్క, ద్వై విధ్యం, ఓటు వజ్రాయుధం, టమోటాలు కిలో రెండ్రూపాయలే, కడప ఉక్కు – రాయలసీమ హక్కు, ఖాళీ జేబు – నిండు జేబు, ది స్టేట్స్‌మేన్, 'జ్ఞాన'మద్ది, ఫ్లెమింగో! నువ్వు మాకొక ప్రేమపాఠం, ఓట్ల సంత, అది బుద్ధ భూమికాదు, అప్పుడే కొత్త సంవత్సరమా?,

అమానవీయశాస్త్రం, అవును! అది దేవతలు దిగబడ్డ బూమే, దినసరి బతుకు, నా ఎద్దులబండి ఏమైంది, మమ్మల్ని దేవుళ్ళు చేయకండి, కాస్టింగ్ కౌచ్, కాలని శవాలు, ఏ రాకాసి మింగిందో?, చీడపురుగులు, జలశ్మశానం, భోగి(గ)సౌభాగ్యం, మోసపు మబ్బులు, నిప్పులపొది, ఈ కార్పోరేట్ రాజధాని మాకొద్దు, కొనడం అమ్మడమే రాజకీయం, మనిషిగా మిగలవా?, ఈ సినిమా మాకొద్దు, ఎడారి దు:ఖం, తెగిపోతున్న మానవపోగు, మట్టింటికి అమ్మపక్షి, ప్రేమ జీవ ప్రవాహం అమ్మ, సాధిద్దాం, నిరాశ పడకు నేస్తమా... అనే 43 కవితా ఖండికల్లోని వస్తువు వర్తమాన సమాజంలోని పరిస్థితులను రూపుకట్టించింది. కవిత్వంలో కన్పించే భావచిత్రాలతో పాటు, అభ్యుదయం, మార్క్సిజం, అల్యూజం, మిథోపోయి వంటి అంశాలు చోటుచేసుకొని ఉన్నాయి.

***"కవిత్వం ఒక గొప్ప మహాత్యం/ నా జీవితాన్ని మార్చిన నవనీతం"*** అంటూ మొదటి ఖండికను పూర్తిచేయడంలోనే కవి అభ్యుదయ దృక్పథం స్పష్టమవుతుంది. మహత్తు అక్షరంలో ఉందని. మనిషిని మార్చే గొప్పదనం కవిత్వంలోనే ఉందని, రాళ్ళూరప్పల్లో, రంగురాళ్ళ ఉంగరాల్లో, నుదుటన రంగరించుకునే నామాల్లో, అంతామాయని అని చెప్పే స్వాముల మెట్ట వేదాంతాల్లో లేదని చెప్పడం కవి ఉద్దేశం. తన జీవితాన్ని భౌతికవాదంలో కలిపి కవితాఖండికలన్నిటిలో విస్తరింపజేశాడు రచయిత. ఈ కవితా సంపుటిలో వస్తువు ఎన్నికలు, రాజకీయం, సీమఅస్తిత్వం, వ్యవసాయం, వ్యక్తిత్వవికాసం, సంస్కృతి, మానవత్వం, మొదలైన అంశాలతో విస్తరించబడింది.

రచయిత అభ్యుదయవాది అయినప్పటికీ, ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకమున్న వ్యక్తిగా కనిపిస్తాడు. అందుకే ఓటువేసి మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని ఖండికల్లో చెప్పుకొచ్చాడు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జరుగుతున్న దారుణాలకు కారణం వ్యక్తులు తీసుకునే నిర్ణయాలేనంటాడు రచయిత. రాజ్యాంగం అందరికీ ప్రాథమిక హక్కులను ప్రసాదించిందని, ప్రభుత్వ విధానాల్ని ప్రశ్నించినంత మాత్రాన రచయితలను శత్రువులుగా చూడాల్సిన అవసరం లేదంటాడు. ప్రజాస్వామ్యవాదిగా 'ఓటు వేస్తేనే బ్రతుకున్నట్లు లెక్క' అంటాడు. అయితే పనికిమాలినవాళ్ళు, స్వార్థపరులు ప్రజాప్రతినిధులుగా నిలబడ్డప్పుడు వారికి ఓటు వేసేందుకు ఇష్టంలేకపోతే 'తిరస్కరణ' ఓటు వేసి ఆ నాయకులను పరోక్షంగా చెంప పగలగొట్టమంటాడు. ఓట్లద్వారా అందలమెక్కి తెల్లరాబందుల్లా ప్రజాధనాన్ని మింగుతున్న వారిని 'వజ్రాయుధం' వంటి ఓటుతో మట్టుబెట్టమంటాడు. సామాజిక రచయితగా ఈరోజు ఎన్నికలు ఎలా జరుగుతున్నాయో తెలియని వ్యక్తికాదు ఈశ్వర్‌రెడ్డి. భారతదేశంలో ఎన్నికలు 'ఓట్ల సంత' లా మారాయనడం వెనుక ఉద్దేశం అదే. ఇంతపెద్ద ప్రజాస్వామ్యదేశంలో ప్రజల అభీష్టాలకు తావులేకుండా పోవడానికి కారణం ఓట్లను అమ్ముకోవడమేనంటాడు రచయిత. అయితే కొన్ని ప్రాంతాల్లో ప్రజలను ఓట్లు వెయ్యనీయకుండా దౌర్జన్యం చేస్తూ ఓటర్ల మునివేళ్ళను, అవసరమైతే గొంతుకలను కత్తిరించి ఓట్లేసుకునే రాజకీయవేటగాళ్ళు కూడా ఈదేశంలో ఉన్నారని ధైర్యంగా విమర్శిస్తాడు. సంతలో పశువులను కొన్నట్లు బేరంచేసి ఓటర్లను కొంటున్నారని, బేరంతో ప్రజల్ని పడేసే వ్యవస్థ అడుగడుగునా ఉందని వివరిస్తాడు.

***"ఎంతటి వాణ్ణయినా ఏదో ఒక సున్నా దగ్గర***
***పడేయగలమనే వాడి ఆర్థికజ్ఞానం***
***అర్థాకలితో ఉన్న మా అజ్ఞానాన్ని సొమ్ముచేసుకోవాలని***
***నిత్యం తహతహలాడుతూ ఉంటుంది"*** అనడంలో ఉద్దేశం అదే. అంతేకాదు, సంతలో వ్యాపారం ఎలా జరుగుతుందో ఎన్నికలప్పుడు కూడా వ్యాపారం అలాగే జరుగుతుందని, రాయలసీమ ప్రాంతంలో ఇప్పటికీ ఉండే సంత సంప్రదాయాన్ని

***"పశువులు వేలానికొచ్చినట్లు***
***పదవులు వేలానికొస్తాయి***
***మా ఊరి చావిట్లో రాత్రిపూట వేసే***
***సోలాపూర్ దుప్పట్ల వేలం గుర్తుకొస్తుంది"*** అనే వాక్యాల్లో ప్రతిబింబింపజేశాడు. అంతేకాదు మత్తెక్కించే తీర్థాలు, మనసును ఊరించే ప్రసాదాలుపెట్టి ప్రజల్ని దేవుళ్ళను చేయడాన్ని ఖండించాడు. ఇక్కడ ఎన్నికలప్పుడు ప్రలోభపెట్టే మద్యం, బిర్యానీలను గురించి ప్రస్తావించినట్లు పైకి కనిపిస్తున్నా, మతం మత్తును, కులం ప్రసాదాన్ని ఎరగా వేసి ఓట్లను దండుకునే రాజకీయపార్టీల ఎత్తుగడల్లో పడొద్దని రచయిత నర్మగర్భంగా తెలియజేస్తాడు.

రచయిత సమాజంలో భాగమే కాబట్టి, నేటి రాజకీయ వ్యవస్థ గురించి కూడా కవితాపరమైన వ్యాఖ్యలు చేస్తాడు. గొంగడిలో కూర్చోని తింటూ వెంట్రుకలు భోజనంలో పడుతున్నాయని అనుకుంటే పొరబాటేకదా! అన్నది రచయిత అభిప్రాయం. రాజకీయం గురించి కవి మాట్లాడకుంటే

ఇంకెవరు మాట్లాడాలి అన్నది రచయిత వేసే సూటిప్రశ్న. అయితే వర్తమాన ప్రభుత్వాలపై, అవి సాగిస్తున్న పాలనపై రచయితకు స్పష్టమైన అవగాహన ఉంది. అలాంటి ఆలోచనలు లేకుంటే 'మానవత్వం' వంటి శీర్షికలు పెట్టేవాడు కాదేమో. ప్రభుత్వాలు లౌకిక రాజ్యాంగస్ఫూర్తిని వదిలేసి ఉన్మాదంతో మానవ కేంద్రకాన్ని వదిలి పరిభ్రమిస్తున్నాయని అంటాడు.

***"భూగోళం తిరుగుతోంది దారితప్పి***
***హింస కేంద్రకం చుట్టూ***
***భూమధ్యరేఖను తోసిరాజని***
***మతమౌఢ్యరేఖ పొడసూపుతోంది"*** అనడంలో రచయిత ధైర్యం, అభ్యుదయ భావన, సంకుచిత తత్వాన్ని నిలదీసే తత్వం అర్థమవుతాయి. అంతేకాదు రచయితలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారనే సాకుతో కల్బుర్గి, గౌరీలంకేష్ వంటి రచయితలను చంపించిన దృశ్యాలు మనకందరికీ తెలుసు. కంటిముందు ఇలాంటి విధ్వంసాలు చూసిన ఏ అభ్యుదయ రచయితా మౌనంగా ఉండలేడు. అందుకే ఈశ్వర్‌రెడ్డి

***"భావస్వేచ్ఛల గొంతులను నులిమే***
***కాషాయ అధికార చీకట్లు"*** అని ధైర్యంగానే ప్రశ్నిస్తాడు. ఉన్మాదం ఏ మతంలో ఉన్నా తప్పేనంటాడు రచయిత. సిరియాలో ఐ.యస్.లో పనిచేయొద్దని హితువు చెప్పిన తల్లి 'లీనా'ను నిర్దాక్షిణ్యంగా చంపిన 'అలిసకర్' క్రూరత్వాన్ని కూడా ప్రశ్నిస్తాడు. మతంతో రాజకీయం చేయవద్దని పిరికిపందల్లా అర్ధరాత్రి దొంగదెబ్బలు తీయొద్దని చీడపురుగుల్లాంటి ఉన్మాదులను హెచ్చరించాడు.

రాయలసీమ ప్రాంతీయ అస్తిత్వాన్ని సాహిత్యంలో చర్చించడం చాలా సంవత్సరాల ముందు నుండే ఆరంభమైంది. కరువు, ఫ్యాక్షనిజం, వర్షాభావం వంటి అంశాలపై రచయితలు సాహిత్య సృజన చేస్తున్నారు. అయితే మారుతున్న పరిస్థితుల దృష్ట్యా రాయలసీమ అస్తిత్వంలో భాగంగా కొత్త కొత్త సమస్యలు ప్రజల్ని ఇబ్బంది పెడుతున్నాయి. అందులో భాగంగా రాష్ట్రవిభజనలో, కర్మాగార స్థాపనలో, రాజధాని విషయంలో సీమకు జరిగిన అన్యాయాన్ని గురించి చెప్పడం రచయిత ఎంచుకున్న కొత్త వస్తువు. సినిమాలు, దూరదర్శన్‌లు సీమప్రాంత సంస్కృతిపై చేసే అసత్య ప్రచారాలను కూడా ఈశ్వర్‌రెడ్డి తిరస్కరించాడు. స్వాతంత్ర్యం వచ్చాక ఏడు దశాబ్దాలుగా నాయకుల మోసపు వాగ్దానాలతో సీమ నలిగిపోయిందని బాధపడ్డాడు. అలాంటి నాయకుల్లాగా మేఘాలుకూడా వర్షాన్నివ్వకుండా మోసం చేస్తున్నాయని 'మోసపు మబ్బుల్ని' నిలదీశాడు. కాళిదాసులాగా, పుట్టపర్తిలాగా ప్రేమ సందేశానికి మేఘాన్ని వాడుకోకుండా, మేఘం చేస్తున్న వంచనను గుర్తు చేసుకుంటూ పాలకులను

***"మా సీమ కూడా***
***ఈ దేశంలో భాగమే అయితే***
***ఈ దేశంలో పారేనదులు***
***మా ఊర్లను తాకవెందుకు"*** అని ప్రశ్నిస్తాడు. దేశమంతా ఒకే చట్టం, ఒకే న్యాయం అని ఊదరగొడుతున్న ప్రభుత్వాలు దేశంలోని అన్నిప్రాంతాలకు నీటిని సమానంగా పంచాలనే కనీస ధర్మాన్ని ఎందుకు పాటించడంలేదని నిలదీస్తాడు. అలాగే సీమకు రావాల్సిన ఉక్కుఫ్యాక్టరీలు వంటి వాటిని కూడా రానీకుండా చేయడం వెనుక జరిగే కుట్రను రచయిత 'కడప ఉక్కు–రాయలసీమ హక్కు' ఖండికలో తెలియజేశాడు. సీమప్రజల మనస్తత్వానికి క్రూరత్వపు ముద్రవేసి తెరపై చూపించడాన్ని రచయిత విమర్శించాడు. అయిదు రూపాయలకోసం, అరకట్ట బీడీలకోసం హత్యలు చేసేవారని నమ్మిస్తున్నారని ఆవేదన చెందాడు.

***"చిల్లర పైసల కోసం***
***సీమ ఆత్మను***
***సినిమా తెరపై వేలాడదీస్తున్న"*** వారిని తిరస్కరించాడు. అలాంటి సినిమాలు తీస్తే రీళ్ళను తగలబెడతానని హెచ్చరించాడు.

రాయలసీమ ప్రాంతంలో రైతు పడే నరకయాతనను అక్షరీకరించాడు రచయిత. రాయలసీమ ప్రాంతం నుండి ఎక్కువగా పండించే టమోటా పంట అతివృష్టి, అనావృష్టివల్ల రైతును కడగండ్లపాలు జేస్తుందనేది నగ్నసత్యం. రాయలసీమ రైతు టమోటాలు పండించడానికి పడుతున్న కష్టాన్ని చెప్తూ

***"ఇంటిల్లిపాది***
***పొలంలో రక్తాన్ని పిండేకుంటే***
***తోటంతా ఎర్రటి టమోటా"*** అంటాడు. అయితే ఇంత కష్టపడి పండించిన టమోటా తగిన ధరలేకపోతే, రైతు పడే బాధనూ వివరించాడు. ఎప్పుడు రైతు తన పంటకు ధర నిర్ణయించగలుగుతాడో అప్పుడే వ్యవసాయం బాగుపడుతుందని అంటాడు రచయిత. ఈ రోజు మంచినీళ్ళకు మాయలేబుళ్ళు తగిలించి పాలకన్నా ఎక్కువ ధరకు అమ్మే బహుళజాతి కంపెనీలు ఒకవైపు, గుండుసూదికి కూడా యం.ఆర్.పి. నిర్ణయించే సంస్థలు మరొకవైపు నడుస్తున్న వ్యవస్థలో, నెత్తురు–కన్నీరు కలిపి గింజల్ని తయారు చేసే

రైతు కష్టానికి ఖరీదుకట్టే వాడెవడని ప్రశ్నిస్తాడు రచయిత.

నేటి వ్యవస్థ మొత్తం ఈ విధంగా మారిపోవడానికి ప్రధానకారణం ప్రపంచీకరణగా ఈశ్వర్‌రెడ్డి నిర్ధారించాడు. వ్యవసాయం, గ్రామీణవృత్తులు వంటి వాటిని చావుదెబ్బ తీసిన ప్రపంచీకరణ, జనాభాతో కిటకిటలాడుతున్న భారతదేశంలో మనిషి ఒంటరితనంతో మిగిలిపోవడానికి, కుమిలిపోవడానికి కారణమైందంటాడు. మానవపోగు తెగిపోవడానికి కారణం ప్రపంచీకరణేనని తెగేసి చెప్పాడు. ఈ రోజు కోరిన ప్రపంచాన్ని కళ్ళముందుంచే టీవీలు, అరచేతిలో ఒయ్యారాలు పోతున్న సెల్‌ఫోనులు ప్రపంచీకరణ ప్రతిఫలంగా మనిషిచేతిలో చేరి, అతణ్ణి రూపాయల చుట్టూ అంగప్రదక్షిణ చేయిస్తున్నాయంటాడు.

*"ఇప్పుడు*

*బంధుత్వ నాడీ వ్యవస్థలో*

*రూపాయల సంస్కృతి ప్రవహిస్తుంది"* అనడం వెనుక రక్తసంబంధం రూపాయి సంబంధంగా రూపాంతరం చెందిందని సూటిగా చెప్పడమే.

సమాజంలో త్వరగా వ్యాపిస్తున్న ఇలాంటి ప్రపంచీకరణ విషసంస్కృతుల నుండి బయట పడాలంటే వ్యక్తి మానసికంగా ఎదగాలాంటాడు రచయిత. అధికారం, హోదా, డబ్బు అనే వాటిలో చిక్కుకున్న మనిషి సంకుచితుడైపోతున్న వాస్తవాన్ని 'కాలని శవాలు' ఖండికలో ఎండగట్టాడు. అనవసరమైన ఆడంబరాలతో వ్యక్తిత్వపు వెన్నుపూసను తానే విరుచుకుంటే, వానపాములా ముడుచుకుపోయి నడవాల్సి వస్తుందంటాడు. అందుకే మనిషిని నిగ్రహంగా, వినయంగా, స్వార్థరాహిత్యంగా నడవమని కోరుకున్నాడు. ఒక్కొక్కసారి నిరాశా నిస్పృహలు ఆవహించినా, దృఢ చిత్తసంస్కారంతో ముందుకు నడవమంటాడు.

*"చుక్కలు ఆసరాగా నిలుస్తాయి*

*చిమ్మచీకట్లు కమ్మినపుడు"* అనడం ఆశావాద దృక్పథంతో మనిషిని ముందుకు నడవమని చెప్పడమే.

రచయిత దృష్టిలో భారతీయ సంస్కృతి అంటే ఈరోజు కాషాయ పరివారం చెబుతున్న సంస్కృతి కాదు. మన సంస్కృతి గ్రామీణజీవనంలో అడుగడుగునా కనిపిస్తుంది. పండుగలు, పబ్బాలు, పనిముట్లు, ఆహారపు అలవాట్లు వంటివి మన సంస్కృతి. వాటిని పోగొట్టుకోవడం దురదృష్టకరమంటాడు రచయిత. కొత్తగా వస్తున్న తలిదండ్రుల దినోత్సవాలు, ప్రేమికుల దినోత్సవాలు వంటివి మన సంస్కృతి కాదని సున్నితంగా చెప్పాడు. ఈ రోజు సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న రకరకాల అంశాలు మన సంస్కృతిలో భాగం కాదని వివరించాడు.

*'ప్రేమంటే రాత్రింబవళ్ళు ఏమార్చుకునేందుకు పంపుకునే తియ్యటి మెసేజ్‌లు కాదు, రెండు మనసుల మధ్య పరిమళించే ఆత్మగంధం లాంటి అమ్మానాన్నల ప్రేమ'* ని నిర్వచించాడు. పల్లె జీవనానికి నాడి వంటి ఎద్దులబండి మాయమైపోయిందని, సంక్రాంతి పండుగ జవసత్వాలు కోల్పోయి కళతప్పి పోతుందని రచయిత మన సంస్కృతి తెరమరుగైపోతున్న సాంస్కృతిక విషయాలపై ఆవేదన చెందాడు.

కవితాసంపుటిలో ఎక్కువ ఖండికలు మానవత్వాన్ని తట్టిలేపుతాయి. మనిషి వాసనను గుబాళింపజేస్తాయి. ఆలూరి బైరాగి 'నాక్కొంచెం నమ్మకమివ్వు' అని అడిగినట్లే ఈశ్వర్‌రెడ్డి కూడా 'నాకొక మనిషికావాలి' అని అడుగుతున్నాడు. ఆ మనిషి ఎలాంటి వాడై ఉండాలో కూడా వివరంగా చెప్పాడు. నిర్మలంగా ప్రవహించే మనిషి కావాలని, మనిషిని అంగడి సరుకుగా చేస్తున్న ఆలోచనను తన్నే మనిషి కావాలని, సంక్షేమం పేరుతో దోచుకు తింటున్న వారి తలపగలగొట్టే మనిషి కావాలని, సమానత్వపదాన్ని వల్లెవేస్తూ ప్రజలను నిరుపేదలుగా మార్చేవారి నాలుకచీల్చే మనిషి కావాలని, చివరిగా

*"మనిషిని మనిషిగా బతకనివ్వని*

*ఈ యాంత్రిక కుతంత్ర సమాజాన్ని*

*మానవీకరించే మనిషి కావాలి"* అంటూ తన కావ్యంలోని కవిత్వ భూమికను వివరించాడు. అయితే ఈ ఖండికల్లో అంతర్లీనంగా రెండు ప్రపంచాలను చూపించాడు. రైలుపట్టాల్లా ఎప్పటికీ కలవని రెండు సమాజాల స్థానంలో సరికొత్త సమాజం రావాలని కవి ఆకాంక్షించాడు. 'స్వీయ జీవిత సంఘర్షణను సామాజిక జీవిత సంఘర్షణగా వర్తింపజేసుకున్న రచయితగా ఈ కావ్యం రాశాడు.' అని రాచపాళెంగారు కవికి కితాబిచ్చినా, ఈశ్వర్‌రెడ్డి మాత్రం మనిషి పరిపూర్ణ మానవత్వపు లక్షణాలను పునరుద్ధరించుకుని ముందుకు సాగాలని కోరుకున్నట్లు అర్థమౌతుంది. ఆ ఆకాంక్ష ప్రతి ఖండికలోను స్పష్టంగా కన్పిస్తుంది. ◆

కథ

# కొరియర్

- మీనాక్షి శ్రీనివాస్
9492837332



"ఏరా నాలుగు రోజులుగా అజా పజా లేదు, ఎక్కడికెళ్ళేవురా? "తండ్రి నీలకంఠం అడిగాడు అజయ్‌ని.

" అదీ అదీ .. అమ్మకు చెప్పాగా. మా స్నేహితులందరూ కలిసి అరకు పిక్నిక్ వెడుతున్నామని" తడబడుతూ చెప్పాడు అజయ్.

" ఆ హా .. పిక్నిక్ లో కొత్త బట్టలూ, సెల్ కూడా కొనిచ్చేరా? " తీక్షణంగా అన్నాడు తండ్రి.

" లేదు నాన్నా, సెలవల్లో సమయం వృధా చెయ్యకుండా ఉద్యోగం చేసి సంపాదించుకున్నాం" తల ఎగరేస్తూ చెప్పాడు.

" ఆ హా .. ఏం ఉద్యోగాలో? అయినా మీరు చదివిన చదువుకు ఏం ఉద్యోగం వచ్చిందేమిటీ?" ఆయన వదల లేదు.

" అబ్బా ఏదో ఒకటి చేసాడు లెండి, పిల్లాడిలా ఇంట్లో అడుగుపెట్టాడో లేదో సీ ఐ డీ లా ప్రశ్నల మీద ప్రశ్నలు .. నువ్వెళ్ళరా నానీ .. వెళ్ళి స్నానం చేసి రా .. అన్నం తిందుగానీ, ఎప్పుడనగా తిన్నావో ఏమో!" తల్లి వనజ అనడంతో ' బ్రతుకు జీవుడా' అనుకుంటూ లోపలికి తుర్రుమన్నాడు అజయ్. ఇంటర్ పరీక్షలూ, ఆపై ఎం సెట్ పరీక్షలూ రాసి సరదాగా స్నేహితులందరం వెడుతున్నాం అంటే సరే అని వెయ్యి రూపాయలిచ్చి పంపేడు నీలకంఠం.

" అది కాదే, వీళ్ళు ఏం చేసి సంపాదించారా అని ? నేనిచ్చిన డబ్బు ప్రయాణానికీ, తినడానికే సరిపోతాయి .. మరి వాడేసుకున్న బట్టలూ, వాడి చేతిలో సెల్, అవన్నీ ఎంతలేదన్నా పదివేలకు తక్కువుండవు? ఎలా వచ్చాయో తెలుసుకోకపోతే .. అది ఎలాంటి సంపాదనో .. మొదటిలోనే వంచకపోతే రేపటి రోజున ఎలా తయారవుతారో ఎవరికి ఎరుక, అసలే రోజులు బాగా లేవు."

"మీరూ, మీ అనుమానాలూ .. వాడు ఆవారా ఏం కాదు, మన పెంపకంలో పెరుగుతున్న, చదువుకుంటున్న పిల్లాడు . మంచేదో, చెడేదో వాడికి ఆ మాత్రం తెలియదా. ఇంక మీరు సతాయించక భోజనానికి రండి" అతని మాటని పూచికపుల్లలా తీసి పారేసింది వనజ.

" అది కాదే ..."

" అబ్బా .. రాను రాను మీకు ఛాదస్తం బాగా పెరిగిపోతోంది .. ఇప్పుడేవంటారు వాడు ఏ దొంగతనమో చేసాడనా మీ అనుమానం?" కొట్టినట్లే అడిగింది.

" నాన్నా .. నాన్నా అన్నయ్య నాకీ బొమ్మ తెచ్చాడు" పన్నెండేళ్ళ విజయ్ ఓ ఖరీదైన విమానం బొమ్మ పట్టుకుని పరిగెట్టుకుంటూ వచ్చాడు.

" మా నాయనే, తమ్ముడంటే ఎంత ప్రేమండీ వాడికి, ఎప్పటినుంచో చిన్నాడు ఇలాంటి బొమ్మ అడుగుతున్నాడని జ్ఞాపకం పెట్టుకు మరీ తెచ్చాడు." మురిసిపోయిందా తల్లి చిన్నాడి చేతిలో బొమ్మ అందుకుని చూస్తూ.

నీలకంఠం ఏం మాట్లాడలేదు. అతనికి చాలా భయంగా ఉంది, కొడుకు ఏ దారిలో ఆ డబ్బు సంపాదించాడో అని.

వనజ ఎదురుగా మాట్లాడడం అనవసరం అన్న ఉద్దేశ్యంతో అప్పటికి మౌనంగా ఉండిపోయాడు.

ఆయనో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు. ప్రస్థుత సమాజంలో రకరకాల పిల్లల పోకడ తెలిసిన వాడు.

ఆ రోజంతా ఇంట్లోనే ఉండిపోయిన కొడుకుని నిశ్శబ్దంగా వాచ్ చేసాడాయన. మర్నాడు కొడుకు బయటకు బయలుదేరగానే వాడికి తెలియకుండా చాటుగా అనుసరించాడు.

ఆ కాలనీలోనే ఉన్న ఓ పార్క్ దగ్గరకు చేరాడు, అప్పటికే అక్కడ ఇంకో అరడజను మంది పిల్లలున్నారు. ఓ చెట్టుకింద ఉన్న సిమెంట్ బెంచ్ మీద కూర్చున్నారంతా.

"ఒరే, మీ ఇంట్లో వాళ్ళు మిమ్మల్ని ఏం అన్నారు? ఎలా ఫీల్ అయ్యారో దాచకుండా ఉన్నది ఉన్నట్లు చెప్పండ్రా" అందరిలోకీ కొంచెం పెద్దగా ఉన్న కుర్రాడడిగాడు. వాడే వాళ్ళ నాయకుడిలా ఉన్నాడు.

ఎవరూ ఏం మాట్లాడలేదు.

"ఒరే సునీల్ నువ్వు చెప్పరా ముందు?" అడిగాడో పిల్లాడిని వాడు కొంచెం లావుగా, దుబ్బుగా ఉన్న జుట్టూ .. కొంచెం నిర్లక్ష్యంగా ఉన్న మాటతీరుతో ఉన్నాడు.

" ఆ .. మా నాన మస్తు ఖుషీ అయ్యిండు, కాకుంటే అంతా కర్చు పెట్టేసినని జర కోపడ్డడు." హుషారుగా అన్నాడు.

" అంతేనా ఏడకెల్లి వచ్చినయి, ఏం పని జేసినవు, ఏడకి పోయినవనైతే అడగలేదా?" మళ్ళీ ప్రశించేడు సునీల్‌ని. సునీల్ అదేం లే అన్నట్లు తలెగరేసాడు, చేతులు తిప్పుతూ.

"ఒరే అజయ్ .. నువ్వు చెప్పరా"

" మా నాయినా పెద్దగ ఏం అనలా, కాకుంటే ఏం ఉద్యోగం, ఏం కత? అని అడిగిండు" తండ్రి గట్టిగా అడిగాడనీ, తిట్టాడని చెపితే నవ్వుతారన్నట్లు బొంకాడు అజయ్.

"ఏం జెప్పినవ్! ఏమైన జెప్పినవ్వా?" కొంచెం ఆదుర్దాగా అడిగాడు వాడు.

"లే .. అన్నా .. ఏం చెప్పలా." భయం భయంగా అన్నాడు అజయ్.

"చూడుండ్రి మీకిష్టమైతేనే చెయ్యుండ్రి, కానైతే ఏం సేస్తున్నం, ఏడకెడుతున్నం, అదంత ఎవ్వరికీ తెలియనీకుండ్రి .. అందరికీ జెబుతుండ .. తేడా వస్తే .. ఇగంతే .. సమజయిందా?"

"ఆ .. అన్నా .. అయిన ఇందుల చెప్పనీకేముందే, రెండుమూడు నెలలకోసారి ఆడకి పోవుడు మస్తు ఖుషీ చేసి .. ఆళ్ళిచ్చిన లగేజ్ ఈడ అందించుడు .. అందుల తప్పేమున్నది?" రవి అన్నాడు.

" గంతే! గంతే! .. మధ్యలో ఎపుడన్న, ఎవరన్న చెకింగ్ కు వచ్చిరా .. సమ్మగ సైడవ్వాలె, అంతే కానీ యాడనుండి తెస్తున్నం, యాడ ఇస్తున్నం అందంత సెప్పరాదె, ఏంది ఎరుకైతదా" మళ్ళీ అడిగాడు.

" ఆ అన్నా .. ఇంతకూ అందులే ఏమున్నదే" అడిగాడు ఇంకో కుర్రాడు.

"అయన్నీ నీ కనవసరం, మాల్ తెస్తివా .. డబ్బు పుచ్చుకుంటివా .. ఖతం" హెచ్చరికగా అన్నాడు.

"ఏం అజయ్ .. గమ్మునుండావ్ .. మీ అయ్య తిడతడంటే నువ్వు రామాకు .." క్రీగంట అజయ్ ని చూస్తూ, వాడి ఫీలింగ్స్ కనిపెడుతూ అన్నాడు.

" లేదన్న, మా నాన్న ఏం అనడు, నే కూడ వస్తా .. మళ్ళీ ఎప్పుడు పోవాలో నాకు కూడ జెప్పన్నా" ఎక్కడ వాడిని వద్దంటాడో అన్న ఆతృత వాడి మాటల్లో.

"ఇప్పుడేం కాదులే, నే చెప్తా మళ్ళా .. మీ అందరి ఫోన్ లలో నా నంబర్ ఉందిగా."

"ఉందన్నా" అందరూ మూకుమ్మడిగా అన్నారు.

" సరే .. సరే .. నె బోతున్నా .. మీరు ఇండ్లకు పొండ్రి.."

నీలకంఠం గుండె గొంతుకలోకొచ్చినట్టైంది. కచ్చితంగా వీళ్ళ చేత చేయకూడని పనే చేయిస్తున్నారు. నాలుగు తన్ని అప్పటికప్పుడు నిజం చెప్పించాలన్నంత కోపం వచ్చింది. కానీ నిభాయించుకున్నాడు. చాటుగా వాళ్ళు మాట్లాడుతుండగా ఫోటో తీసాడు సెల్ తో.

♦♦♦

రెండు నెలలు గడిచిపోయాయి, అజయ్‌కు మంచి కాలేజ్ లోనే ఇంజనీరింగ్ సీట్ వచ్చింది. ఇంటినుంచే వెళ్ళి రావచ్చుననే సరికి సగం బెంగ తీరిందా తండ్రికి. అయినా కొడుకును జాగ్రత్తగా ఓ కంట కనిపెడుతూనే ఉన్నాడు దసరాలొచ్చాయి ... 'మళ్ళీ స్నేహితులంతా కలిసి ఊరెడుతున్నాం' అంటూ బయలుదేరాడు అజయ్. ఎక్కడికీ

అంటే నాగార్జున సాగర్ అన్నాడు. కొడుకు నీడలా తిరిగిన ఆయనకు వాళ్ళు వెళ్ళేది అరకు అని తెలిసింది. ఎలా ఆపడం? తెలిసీ తెలియని వయసు .. అర్థం చేసుకోవడం మాట అటుంచి ఎదురు తిరుగుతారు, ముళ్ళకంచె మీద పడ్డ బట్ట చందంగా, జాగ్రత్తగా హేండిల్ చేయాలి .. తెల్లవారితే ప్రయాణం అనగా నీలకంఠానికి గుండె నెప్పి వచ్చింది, ఆసుపత్రిలో చేర్చారు .. అజయ్ ప్రయాణం ఆగిపోయింది. మిగతా వాళ్ళు వెళ్ళిపోయారు. కొంచెం బాధగా ఉన్నా ఇవతల తండ్రి ప్రాణాపాయంలో ఉంటే ఎలా? దగ్గరే ఉండి జాగ్రత్తగా చూసుకుంటున్న కొడుకుని ఆప్యాయంగా చూసుకున్నాడు. కానీ ఇది పరిష్కారం కాదు, వాడు వెళ్ళే దారి ఎటువంటిదో వాడే తెలుసుకోవాలి.

నాలుగు రోజుల తరువాత వార్తా పత్రికలో పెద్ద పెద్ద అక్షరాలతో 'అరకు ఏజన్సీ నుండి కిలోలకొద్దీ గంజాయితో పట్టుబడ్డ ఇంజనీరింగ్ యువకులు' వారి వెనక ఎవరున్నారో వాళ్ళకి మాత్రం ఏం తెలుసు? పట్టుబడ్డది మత్తు పదార్థాలతో .. వాళ్ళకి ఏళ్ళ తరబడి జైలు శిక్ష, ఆ ముఠా గురించి ఆరా తియ్యమని పోలీసులకో ఆదేశం మాత్రం .. అంతే. వాళ్ళ వెనుక కొమ్ముకాసే వాళ్ళెవ్వరూ లేని అమాయక విద్యార్థులు ... అక్కడితో వాళ్ళ జీవితం సమాప్తం. దొంగ రవాణా చేసే ముఠాకి ఇంకో నలుగురు దొరుకుతారు.

ఉదయాన్నే పేపర్ చదువుతున్న తండ్రి దగ్గరకు వచ్చిన అజయ్ కళ్ళవెంట ధారాపాతంగా కారే కన్నీటితో ఆయన కాళ్ళ దగ్గర కూలబడిపోయాడు .. అప్పటికే అతనికి మిగతా స్నేహితుల ద్వారా సంగతి తెలిసింది.

♦♦♦

"సూర్య! ఎందుకు అర్జంట్ గా రమ్మని ఫోన్చేసావు ? " గబగబా వస్తూ కంగారుగా అడిగింది హిమజ.

"నీకు సారీ, థాంక్స్ చెబుదామనీ" ఆప్యాయంగా ఆమెను చూస్తూ అన్నాడు సూర్య.

"అవునా ఇదెందుకూ .. అదెందుకూ .. అతనినే చూస్తూ అల్లరిగా అంది హిమజ.

"నీకు తెలియకుండా, నీతో చెప్పకుండా నిన్నో ఆపరేషన్ లో భాగస్వామిని చేసినందుకు మొదటిదీ, ఆ ఆపరేషన్ జయప్రదం అయినందుకు రెండోదీ" తనూ ఏమాత్రం తగ్గకుండా బదులిచ్చాడు.

"అనుకున్నా! అలాంటిదేదో లేకుండా ఈ బుద్ధావతారానికి నాతో గడపాలనే ఆలోచన ఎందుకొస్తుందీ, ఇంతకూ ఏమిటా ఆపరేషన్? కాస్త వివరాలు చెబుతావా? అయినా విజయం వరించిందంటున్నావుగా ఇప్పుడా వివరాలెందుకులే, ఇప్పుడేం జరుగుతుందో అది చెప్పు" కొంచెం కినుకగా అంది.

"మనం వల వెయ్యడం, చేప పడక పోవడమూనా? ఒక్క గంట ఆగి చూడు రెడ్ హేండెడ్ గా దొరికిపోతారు.. . రెండు రాత్రులుగా ఇక్కడ మాటువేసి ఈ కేసులో అతి ముఖ్యమైన, కీలకమైన వ్యక్తిని కనిపెట్టేసా. ఎవరికీ అనుమానం రాని విధంగా చిన్నచిన్న మర పడవల్లో స్మగ్లింగ్ కార్య కలాపాలు నడిపేస్తున్నాడు.

ఇటు నుంచి వెళ్ళేవి ఆ దీవిలోని వారికి ఆహార పదార్థాలు. కానీ అటునుండి వచ్చేవీ చాలా ప్రమాదకరమైన మాదక ద్రవ్యాలు. అక్కడ ఆ దీవిలో పైకి కనిపించేది ఒక సాగు. అంతర్గతంగా పండించేది అత్యంత శక్తివంతమైన మత్తుపదార్థాలు. అక్కడే వాటిని ప్రోసెస్ చేసి పప్పుదినుసులూ, కూరగాయల మాటున రహస్యంగా మరపడవల ద్వారా ఊళ్ళోకి చేర్చే ముఠా, దానికి నాయకుడు లింగప్ప.

సముద్రపుటొడ్డున నివసించే ఆ పల్లెవాళ్ళ ఇళ్ళల్లోకి వాటిని ఆహార సామాగ్రితో బాటు గుట్టుగా చేర్చి, వాళ్ళల్లో ఒకడైన గంగన్న ద్వారా లింగప్ప ఇంటికి చేరవేసి అత్యంత గోప్యంగా, లింగప్ప ఇంట్లోఉంచుకుని చదివించే మురారి ద్వారా అతని స్నేహితులనబడే కొందరు యువకుల ద్వారా మొత్తం రాష్ట్రంలో ఉన్న అన్ని పాఠశాలలకీ, కాలేజీలకీ నిశ్శబ్దంగా చేరుతున్నాయి. ఇప్పటికే చాలా మంది యువత, యుక్తవయసు కూడా దాటని పసివాళ్ళూ దానికి బాగా అలవాటు పడిపోయారు.

పట్నాల్లో, నగరాల్లో అయితే కనీసం తల్లితండ్రులకు కాస్త వినికిడి జ్ఞానం అయినా ఉంటుంది వీటిగురించి, కానీ పల్లెల్లో .. తమ పిల్లలకు ఏం జరుగుతోందో వాళ్ళూ ఎందుకు అలా నిర్వీర్యంగా, నిస్సత్తువగా తయారవుతున్నారో కూడా తెలియని తల్లితండ్రులు ఎవరో చేతబడి చేస్తున్నారనీ, మందుపెడుతున్నారనీ గుడులూ, గోపురాల వెంటా, దొంగస్వామీజీల వెంటా తిరుగుతూ, తమ పిల్లలు తమ ఇంట్లోనే దొంగలుగా మారి తగలేయగా మిగిలిన సొమ్ములు ఆ రకంగా

పూజలనీ, తాయెత్తులనీ ఆ స్వామీజీల పరం చేస్తున్నారే కానీ ఒక్కళ్ళంటే ఒక్కళ్ళు కూడా వాళ్ళని డాక్టర్‌కు చూపించి అసలు ఏం జరుగుతోంది అన్నది తెలుసుకోకుండా ఉన్నారు." బాధా, ఆవేశంతో అన్నాడు.

'మరి ఇప్పుడు ఇదంతా నీకెలా తెలిసింది? అంటే ఎలా బయటకొచ్చిందీ? " కుతూహలంగా అడిగింది హిమజ.

"మా అన్నయ్య ఈ ఊళ్ళోనే ఉన్నాడు .. వాడికో కొడుకు, నేనంటే వాడికి చాలా ఇష్టం .. నాకూ వాడంటే పంచప్రాణాలు, ఎంత బిజీగా ఉన్నా రోజూ ఒక్కసారైనా వాడితో మాట్లాడకుండా ఉండలేను అలాంటిది ఈ మధ్య గత కొన్నాళ్ళుగా వాడి మాటూ.. తీరూ మారింది .. నాతో కూడా రెగ్యులర్‌గా, సరిగా మాట్లాడడం లేదు, ఏం జరిగింది అని అన్నయ్యనడిగితే ఏదో చెబుతున్నాడే కానీ వాడికీ విషయం అర్థం కాలేదు. ఈ లోగా మా ఫ్లాట్స్ లోనే ఉంటున్న ఓ మాష్టారి ద్వారా నాకో సంగతి సాక్షాధారాలతో సహా తెలిసింది. ఎక్కడో చిన్న అనుమానం. నెల్లాళ్ళు గడిచేసరికి ఇంక నేనుండలేక సెలవు పెట్టి ఇక్కడికి వచ్చాను. రాగానే వాడి వాలకం చూడగానే నాకు అర్థం అయిపోయింది. వాడు మాదక ద్రవ్యాలకు అలవాటు పడిపోయాడని ..నాలుగు రోజులుగా వాడికి తెలియకుండా వాడి నీడలా తిరిగి, మిగతా పిల్లలందరినీ చూస్తే అర్థం అయింది సమస్య ఇక్కడే ఉందనీ.

నేను ఒక్కడినే తిరిగితే వాళ్ళకు అనుమానం వస్తుంది. తాత్కాలికంగా ఇదంతా ఆపేస్తారు. దొరకకుండా జాగ్రత్త పడతారు. అప్పుడే నాకో ఆలోచన వచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ ఉద్యోగస్తులూ కూడా సెలవు పెట్టి వట్టి పుణ్యాన ఇలా కూర్చోరు అందుకే నిన్ను రమ్మని, మన పెళ్ళి విషయం ఇంట్లో చెప్పే మిషతో వారం రోజులుగా ఇక్కడే ఉన్నా. అందుకే నిన్ను వెంటనే రమ్మన్నా ..మా వాళ్ళకు నిన్ను చూపించి మన పెళ్ళి విషయం మాట్లాడడానికే నేను ఈ ఊరు వచ్చినట్లు అందరికీ చెప్పాను. మనిద్దరం కాబోయే భార్యాభర్తలుగా సరదాగా గడపడానికి వచ్చినట్లు తిరుగుతూ అసలు విషయం కనిపెట్టాను.

పెళ్ళికి ముందు ఈ తిరుగుళ్ళేమిటీ ! అంటూ అన్నయ్యా, వదినా గొణుక్కుంటున్నా నిన్ను ఆ దీవి చూపించడానికి తీసికెళ్ళింది కూడా అవన్నీ చూసి నిర్ధారించుకోడానికే ... పైకి మనిద్దరం ప్రేమికుల్లా పోజులిచ్చి ఫోటోలు దిగింది .. వెనకాల ఆ తోటలూ, వాటి మాటున సాగే ఆ గంజాయి సాగూ .. అంతా క్లియర్ గా వచ్చేలా ఫోటోలూ, వీడియోలూ అదంతా కవర్చెయ్యడానికే , అలాగే వీడియో కూడా .. అలా కవర్ అయ్యేలా రికార్డ్ చెయ్యడానికే సెల్ఫీలూ.

ఆటోమేటిక్ కేమరా విత్ వీడియో సౌకర్యం ఉన్న అత్యాధునిక హేండీ ఇది .. ఇది రికార్డ్ అవడమే కాదు వెంటనే ఆ దృశ్యాలు గూగుల్ క్రోం ద్వారా పోలీస్ ఏ.సీ.పీ కు, మీడియా వాళ్ళకూ కూడా అందే ఏర్పాటు కూడా చేసాను.

ఇక్కడ ఎవరికీ అనుమానం రాకుండా ఉండడానికే నీతో కొంచెం అతిగా ప్రవర్తించాను, దానికినన్నుక్షమించు.

"అదే అర్థం కాలేదు .. ఉన్నట్లుండి ఈ బుద్ధుడికి ఇంత సరసం ఎందుకొచ్చిందా అని అనిపించినా .. పోనీలే ఇప్పడికైనా చలనం వచ్చిందిలే అనుకున్నా" చిన్నగా గొణిగింది హిమజ.

"ఏమిటీ అంటున్నావు? "

"ఏం లేదు .. అందుకేనా నా మీద అంత ప్రేమ చూపిస్త అంటున్నాను .." కినుకగా అంది.

" ఛా .. అదేం కాదు అయినా ప్రేమ అనేది మనసులో ఉంటుంది కానీ అదేమైనా వస్తువా చూపడానికి! ..నాకూ బాధగానే ఉంది. నిన్ను ఈ ఆపరేషన్ కోసం ఇలా తిప్పడానికి కానీ నాకు ఇంకో మార్గం కనిపించలేదు. ఎక్కువగా ఆలోచించడానికంత సమయమూ లేదు..." అర్థింపుగా అన్నాడు.

" సరేలే .. నీ కాబోయే అర్థాంగిగా నువ్వు చేసే మంచి పనుల్లో నన్ను పాలు పంచుకోనీ ..కాకపోతే ఇదంతా ముందే తెలిస్తే నేనూ ఆ కోణంలో చూసేదాన్నీ, ఆలోచించేదాన్నీ ..."

" లేదు లేదు, నీకిదేమీ తెలియదు కనకే అంత సహజంగా, ఎవరికీ మన మీద అణువంతైనా అనుమానం కలగకుండా మన ఆపరేషన్ జరిగిపోయింది. లేకపోతే వాళ్ళకు మనమీద ఏ మాత్రం అనుమానం కలిగినా ఆ దీవిలోనే మన పని అయిపోయేది. నేను సంపాదించిన సాక్షాలన్నీ ఎప్పటికప్పుడు నా ప్రాణ స్నేహితుడూ, అడిషనల్ సూపరెంటెండెంట్ ఆఫ్ పోలీస్ అయిన ప్రణవ్‌కు అందజేసాను. అతను నా బాల్య మిత్రుడు కూడా! అందుకే అడగగానే ఈ సీక్రెట్ ఆపరేషన్‌కు అండగా నిలబడ్డాడు. అలాగే ఇక్కడ వీటి బారిన పడిన పిల్లల నుంచి రక్త పరీక్షలు జరిపి

మెడికల్ రిపోర్ట్ తీసుకున్నాను. వాళ్ళనుంచీ, వాళ్ళ తల్లితండ్రుల నుంచీ రాతపూర్వక ఫిర్యాదు తీసుకున్నాను. నిన్న ఉదయం పిల్లలందరినీ పిక్నిక్ పేరుతో టౌన్ తీసికెళ్ళింది ఈ పని మీదే"

" వెల్ .. నిజంగా నువ్వు చేసిన ఈ పని చాలా చాలా గొప్పది జయ్ .. మన పక్కనే రోడ్డు మీద ప్రమాదం జరిగి మనిషి చావు బతుకుల్లో ఉంటే కేస్ అవుతుందీ, మళ్ళీ పోలీస్ స్టేషన్ చుట్టూ, కోర్ట్ చుట్టూ తిరగాలి మన కెందుకొచ్చిన గోల అనుకుని చూసీ .. చూడనట్లే వెళ్ళిపోయే వాళ్ళెందరో ఉన్న ఈ సమాజంలో ఇంత రిస్క్ తీసుకుని, ఇంత తక్కువ సమయంలో, ఇంత సమర్ధవంతంగా అది కూడా ఎటువంటీ సంబంధం, బాధ్యతా లేకపోయినా చెయ్యడం ...నిజంగా నీ వంటి మంచి మనిషికి, మననున్నమనిషికీ ఇల్లాలి నవబోతున్నందుకు నాకు చాలా చాలా ఆనందంగా ఉంది" మనస్పూర్తిగా అంటున్న హిమజ గొంతులో దాచుకున్నా దాగని ఆనందం.

"ఇప్పుడిప్పుడే రాష్ట్ర వ్యాప్తంగా కూడా చాప క్రింద నీరులా పాకుతోంది ..ఇప్పటికే చాలా ఆలశ్యం అయింది కనీసం ఇప్పటికైనా దీనిని సమూలంగా నాశనం చెయ్యకపోతే జరిగే విధ్వంసం బాంబు పేలుళ్ళ కన్నా, ఉగ్రవాదం కన్నాదారుణమైనది ..ఛా ..మనిషి ఇంత భయంకరంగా, రాక్షసంగా ఎందుకు తయారవుతున్నాడో ... డబ్బు కోసం ఎంతటి దారుణాలకైనా ఎంతలా దిగజారిపోతున్నాడో, ఒక్కసారి తను చేసే అన్యాయాలకి బలైపోతున్న వాళ్ళ స్థానంలో తనవాళ్ళని ఊహించుకుంటే అసలు మనిషనే వాడెవడైనా ఇలాంటి పనులు చేయగలడా?" ఆవేశంతో, ఆవేదనతో రగిలిపోయాడు.

అతని మననునీ, అదివడే వేదననీ అర్ధం చేసుకున్నదానిలా భుజం మీద ఓదార్పుగా చెయ్యివేసి ఒత్తింది హిమజ.

"సారీ హిమా నిన్నూ, నీ ప్రేమనీ ఇలా ఈ ఆపరేషన్ కోసం వాడుకున్నందుకు" సంజాయిషీ గా అన్నాడు.


" పోనీలే .. ఇలాగైనా ఇంట్లో వాళ్ళకి మన ప్రేమ విషయం చెప్పి పెళ్ళికి దారి చేసావు .. గత ఐదేళ్ళుగా చెబుతూనే ఉన్నావు అప్పుడు చెబుతా, ఇప్పుడు చెబుతా అంటూ! మొత్తానికి ఈ ఆపరేషన్ మనకిలా కోపరేషన్ అయ్యింది ..' అల్లరిగా అతని జుట్టు చెరిపేసింది.

" ఆ! హిమా ఇంక నువ్వు ఇక్కడుండడం అంత మంచిది కాదు .. అవిగో దూరంగా పడవలు కనబడుతున్నాయి. ఈ ఏరియా అంతా స్పెషల్ పోలీస్ బెటాలియన్ అధీనంలో ఉంటుంది. నువ్వు ఇంటికి వెళ్ళిపో. నేను కాసేపు ఆగి అంతా సవ్యంగా జరిగింది అని నిర్ధారించుకున్నాకా వస్తా."

" చూడు! నువ్వు చేసేది సాఫ్ట్ వేర్ ఉద్యోగం, అయినా ఓ బాధ్యత కల పౌరుడిగా ఇదంతా చేసావు. చాలు, పోలీస్ వాళ్ళకు చెప్పేసావుగా ఇంకా నీకెందుకు .. ఇక్కడ ఏదైనా గొడవా, కాల్పులూ జరిగితే ... మనకెందుకూ ..రా నువ్వుకూడా, వెళ్ళిపోదాం" భయంభయంగా అంది హిమజ.

"అరే ! .. ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా మన బాధ్యత మనం సరిగా నిర్వర్తించాలి .. ఇలా ఎవరికివారే మనకెందుకూ! అనుకుంటే ఈ వ్యవస్థా, సమాజం ఇంకాఇంకా నాశనమైపోతాయి. భయంలేదు నేను ఈ (డీల్లో) విషయంలో ప్రత్యక్ష్యంగా లేనుగా, కాకపోతే వీళ్ళని అరెస్ట్ చెయ్యడంతోనే సమస్య తీరిపోదు ..ఆ దీవికి వెళ్ళి అక్కడ రహస్యంగా జరుగుతున్న ఆ ప్రాసెస్ అంతా సమూలంగా నాశనం చెయ్యాలి. అప్పుడే దీనికో శాశ్వత పరిష్కారం దొరుకుతుంది..అలాగే ఇక్కడున్న ఈ పిల్లలందరికీ మంచి వైద్యం, ఆ మహమ్మారి నుండి బయటపడే విధంగా మంచి కౌన్సిలింగ్ ఇప్పించి వాళ్ళను మామూలుగా అయ్యేటట్లు చూడాలి. .. సరే అవన్నీ తరవాత విషయాలు కానీ, లే ముందు నువ్వు ఇక్కడ నుండి వెళ్ళు ... నేను కూడా ఇక్కడే ఉండనులే, అలా తీరం వెంబడి నడుస్తూ .. చూస్తా ఏం జరుగుతుందో .. పదపద .." తను లేచి ఆమెకు చెయ్యి అందించాడు విజయ్.

కాసేపటికే అక్కడకి మఫ్టీలో వచ్చిన పోలీస్ యంత్రాంగం ఒడ్డుకు వచ్చిన మర పడవలని సీజ్ చేసి అందులో ఉన్న మత్తు పదార్ధాలనీ, వాటితో బాటుగా ఆ మనుషులనీ తమ అధీనంలోకి తీసుకుని కేస్ నమోదు చెయ్యడం ... తరువాత ఆ దీవిని చుట్టుముట్టి అక్కడ జరుగుతున్న ఈ అరాచకాన్ని సమూలంగా నాశనం చేసి అవసరమైన చోట్ల మాదకద్రవ్యాల నివారణ కేంప్, దాని బారిన పడి నలుగుతున్న అందరికీ కౌన్సిలింగ్స్ ఇచ్చి మామూలు మనుషులుగా చెయ్యడం చకచకా జరిగిపోయాయి. ♦




# అనుబంధాల సుగంధం - సమాజ హితం

సురేంద్ర రొడ్డ



**పుట్టపర్తి మల్లికార్జున**
9490439029

***"నా లో ప్రాణం ఉన్నంత వరకు అది నన్ను వీడి పోయేంతవరకూ శ్వాసిస్తుంటాను సాహిత్యాన్ని"*** అని వినమ్రంగా అందరి ఆశీస్సులను, ఆదరాభిమానాలను కోరుతున్నానని ప్రకటించిన వినయశీలి సురేంద్ర రొడ్డ. ఉపాధ్యాయునిగా సమాజాన్ని భిన్న కోణాల్లో పరిశీలించి అనుభవాలన్నిటినీ రంగరించి మనకందించిన కావ్యమే "నాన్న పచ్చి అబద్దాల కోరు". అనురాగాల వెల్లువలా, పరిమళాల ప్రవాహంలా మమతల్ని మూటగట్టుకున్న బంధాలను పాఠకుల హృదయాలలోనికి ఒంపుతూ ఎన్నో జ్ఞాపకాలను నెమరువేసుకునేలా కవిత్వ నిర్మాణం సాగింది. ప్రతి పఠితుని మదిని కదిలించే కవనాల సమాహారం. సురేంద్ర రొడ్డ ప్రేమానుభూతులను సంధానం చేసుకుని అంతరంగ రసాలను మధురంగా అక్షర రూపంలో అందించారు. ఆర్ద్రత, ఆత్మీయతల కలబోతగా నూతన అభివ్యక్తీకరణతో సరళమైన పదాల బంధంలో బంధిస్తారు. నిగూఢత లేకుండా ప్రశాంతమైన హృదయం నుండి జాలువారిన స్వచ్ఛమైన భావాల ప్రవాహమే తన కవిత్వం.

***"గుండెల్లో కుంపటి దించుకోవాలని మొదలో వలువుతాడు"*** అంటూ అమ్మాయిలను అనాదిగా ఆటబొమ్మలుగా భావిస్తున్న వారు నేటికీ ఉన్నారని, ఇది సామాజిక ఓటమని బాధను వ్యక్తం చేస్తారు కవి. ***"ఎన్ని సార్లు నీ మనసును గాయపరిచి ఉంటాను. ఒక్కసారైనా క్షమాపణలు చెప్పానా?"*** అంటూ అర్ధాంగి కవితలో పురుషుల అహంకారాన్ని దెప్పి పొడుస్తూనే అమ్మలా ఆదరిస్తున్న అర్ధాంగిని ఒక్కసారైనా కూతురిలా లాలించాలని స్త్రీల పట్ల తనకున్న గౌరవాన్ని చాటారు. పుట్టినింటిని వదిలి మెట్టినింట అడుగుపెట్టిన నాటి నుండి తను చేసిన సేవల్ని స్మరిస్తూనే చేసిన నిర్లక్ష్యానికి మన్నింపు కోరాలనడం అభినందనీయం. బతుకుదెరువు కోసం పట్నం బాట పట్టిన కుల వృత్తి దారుల దీనావస్థను, ప్రాణజ్యోతిని వెలిగించుకోవడానికి పట్నం వైపు దృష్టి సారించిన కమ్మరి కన్నీటి వ్యధను, కరువొచ్చి మంద తరిగి గొల్లుమంటూ వయనమైన గొల్లన్న గోడును, శిథిలమవుతున్న గ్రామీణ బతుకు చిత్రానికి ఆర్తిగా అక్షర రూపం ఇచ్చారు "వలసపక్షులు" కవితలో.

స్వపరిపాలన లోని రక్త కన్నీటిని తుడవాలన్నా, అన్నపూర్ణ రాష్ట్రంలో కాలే కడుపుల్ని నింపాలన్నా, రగులుతున్న కులాల కుంపటిని ఆర్పాలన్నా కవి అక్షరాలే సూర్య కిరణాలై నిద్రాణమై ఉన్న యువతలోని వివేకానందులను, నేతాజీలను జాగృత పరుస్తాయని "ఏడవకమ్మా.. ఏడవకు" కవితలో అభివ్యక్తం చేసిన తీరు సమాజం పట్ల కవి బాధ్యతను గుర్తుచేస్తుంది. "స్వర్గమే కనిపిస్తోంది చూడు" కవితలో తడిమట్టి లోని గంధపు పరిమళాన్ని, ఎండుగడ్డి లోని వెచ్చదనాన్ని, చెరువులో మెరిసే అలల్ని, సెలయేటి లోని సవ్వడుల సరిగమల్ని కళ్ళ ముందు ఆవిష్కరిస్తూ కవి తనలోని ప్రకృతి ప్రేమికుడిని పరిచయం

## కవిత

# మా ఊరు

... ఈ.రాఘవేంద్ర
9494074022

*ఊరికి దూరంగా జరిగాక*
*ఊర్లోని ప్రతీది అపురూపమైన జ్ఞాపకంగా*
*గుచ్చుకుంటున్నది*

*ఏరు, చెరువు, బడి, పీర్లగుడి*
*కట్టకింది బావి, దద్రం, చింతోపు*
*పులగారిదిన్నె*
*గాజులరామన్న తోట*
*కలివికాయల చేను*
*క్రికెట్ మైదానమైన మడికట్లు*
*ఊరిచెట్టుకు విచ్చుకున్న కొమ్మలు*
*ఆ రెమ్మరెమ్మల్లో రెక్కలల్లార్చుకుంటూ*
*పిట్టలుగా*
*గూళ్ళుకట్టుకున్న*
*తియ్యని అనుభూతులు ఎన్నో*

*ఊరికి*
*కాలానికి*
*కొంచెం దూరం నడిసొచ్చాక*
*బాల్యం*
*జ్ఞాపకాలదొంతరల్లో*
*బిందువులు బొట్టుబొట్టుగా*
*మదిలోకి రాలుతుంటాయి*

*ఆనేల*
*గాలి*
*నీరు*
*జ్ఞాపకాల్లాగే మనతో*
*మెలకువగా నడుస్తుంటాయి*

*చెట్టుని నీడను చేసుకున్నవాడికి*
*ఇల్లు విలువ తెలుస్తుంది*
*మట్టిని తల్లిగా కొలిచేవాడికి*
*ఊరివిలువ కనపడుతుంది*



*ఊరంటే నాలుగిండ్లు నాల్గురోడ్లు కాదు*
*మనతో అందరినీ*
*అందరితో మనల్ని*
*మనతో మనల్ని పెనవేసుకున్న*
*ఆత్మీయతానుబంధాల గుడి* ♦

---

చేస్తారు.

"ఉమ్మడి కుటుంబాలు" కవితలో తాత బోసి నవ్వులతో, అమ్మ లాలి పాటలతో, నానమ్మ నీతి కథలతో, ప్రేమ తోరణాలతో నిత్య సంతోషాలకు స్వాగతం పలుకుతూ పండుగలకు నెలవైన ప్రేమాలయాలే ఉమ్మడి కుటుంబాలని వాటి అవసరాన్ని కనుమరుగవుతున్న బంధాల విలువని గుర్తుచేస్తూ పాఠకుల మనసులను ఆలోచింపజేస్తారు కవి. భ్రూణహత్యలను నిరసిస్తూ ఆడపిల్లలను అమ్మలా కొలవాలంటూ అమ్మాయిల విలువను, ఇంటింటికీ ఇంకుడు గుంత భావితరాలకు అదే అమృతం ముంతని నీటి విలువను తెలియజేస్తారు.

మనసు పెట్టి హృదయ వైశాల్యంను వృద్ధి చేసుకుని తన పరిసరాల్లోని ప్రతి అంశాన్ని పరికించగా చిగురించిన సున్నితమైన భావాల్ని కవనాలుగా మలచి పాఠకులను భావామృత వర్షంలో తడిసేలా చేస్తారు. అంతేకాకుండా ప్రతి అంతరంగాన్ని తన కవితాక్షరాలతో శుద్ధిచేసి నవ బంధాలను దర్శించాలనే ఆరాటపడే తత్వం దర్శనమిస్తుంది కవిలో.

ఈ కవితా సంపుటిలో అతిశయోక్తులు లేవు. అనుబంధాల రెమ్మలకు పూచే పూవులలోని మాధుర్యాన్ని, అమ్మానాన్నలకు బిడ్డలపై ఉన్న ప్రేమ, వారి భవిత కోసం పడే తపనను , గౌరవాన్ని నిలపాలనే తాపత్రయంలో చెలరేగే ఆవేదనను సరళమైన పదాలతో బహు రమ్యంగా ఆవిష్కరించారు. తన కవిత్వమంతా స్వర్గసీమ అయిన గృహం చుట్టూ, సమాజం చుట్టూనే ప్రవహిస్తూ మనలో గతించిన, నిద్రాణమై ఉన్న జ్ఞాపకాల దొంతరను ఎటువంటి అలజడి లేకుండా కదిలిస్తుంది. తన ప్రియ నేస్తమైన కాగితాన్ని అక్షరాలతో అభిషేకిస్తూ బాధలను, భావాలను, ఆనందాలను, ఆవేశాలను పుటలపై పరుస్తూ పరవశించిపోయే అరుదైన కవి సురేంద్ర రొడ్డ.

అక్షరాల్ని అమితంగా ప్రేమిస్తూ పుస్తక పఠనాన్ని వ్యసనంగా మలచుకుని సమాజంలోని స్థితిగతులను, అనుబంధాల ఆవశ్యకతను అలతి అలతి పదాలతో ఒక మంచి కావ్యాన్ని అందించిన సురేంద్ర రొడ్డ గారి సహృది నుండి మరెన్నో కవితా సంపుటాలు జాలువారాలని అభిలషిస్తూ అభినందిస్తున్నాను. పుస్తకం కొరకు సురేంద్ర రొడ్డను 9491523579 సంప్రదించవచ్చు. ♦

కథ

# సర్పయాగం



- ఉదయమిత్ర
9985203376

"హలో"

"హలో...పావనమ్మనా..?"

"ఔను..ఎవరు మాట్లాడేది?"

"అమ్మ...నేను పూసల రాజవ్వను..శ్యాంరావు బస్తి నుండి మాట్లాడ్తున్న."

"హా..చెప్పు..రాజవ్వ"

''అమ్మ...మా ఇంట్లకి పామొచ్చింది..నువ్వు రావాలి..మాకందరికీ భయం ఐతున్నది. పొద్దుటినుంచి ఎవరం పచ్చి మంచినీళ్ళు ముట్టలే"

"అయ్యో అట్లనా...మీరు జాగ్రత్తగా ఉండండి. పాము దగ్గరికి మాత్రం ఎవరు పోకండి.నేను బయలుదేరుతున్నా."

♦♦♦

శ్యాంరావు బస్తి.....

అది సుమారుగా యాభై సంవత్సరాల కింద ఏర్పడింది. వెయ్యికి పైగా జనాభా ఉంటారు. ఇరుకు ఇరుకు ఇండ్లు ఉపిరి ఆడని బతుకులు. కుసుంటే లేవనికే ఉండదు, లేస్తే కుసోనికే ఉండదు. ఆ ఇండ్లలలో ఒక మంచం ఉండడం, ఒక టీవీ ఉండడం ఒక లగ్సరి. ఒక చుట్టం వొచ్చిన చిన్న పండుగైన ఆ రోజు చెప్పుదీరనంత గందరగోళం ఉంటుంది.

కొందరికి 30-45 గజాలు ఉంటె కొందరికి 20-25 గజాలు, మరీ బీద కుటుంబాలు ఐతే 10-15గజాలల్లో గుడిసెలు వేసుకొని బతుకునీడుస్తుంటారు. పేరుకు అవి ఇండ్లు గాని ఒక్క వసతి సరిగ్గా ఉండదు. నీళ్ళు కరెంటు అంతంత మాత్రమే. మోరి వాసన గుప్పుమంటది. దోమలు ఈగలు సరేసరి. ఒక చిన్న ఆటో గూడ లోపలి రావడం కష్టం.

వీల్లంత మహబూబ్ నగర్, సంగారెడ్డి, వరంగల్ ల నుండి వొచ్చిన వారు. ఊర్లలో బతుకుదెరువు లేక సిటీకి ఒచ్చి ఇక్కడే స్థిర పడ్డారు.

అనేక వృత్తుల వాళ్ళు ఉంటారిక్కడ. లేబర్ పనులు చేస్తారు. ఇండ్లలో పనికి పోతారు. హొటల్స్‌లో పని చేస్తారు. పూసలు అమ్ముతారు. ఇలా ఒకటేమిటి "బతుకుదెరువు కోసం జెరిపోతులనాడించినట్లు" అన్ని పనులు చేస్తారు.

చిన్నదో పెద్దదో, గుడిసెనో ఇల్లో బస్తి వాసులకి అదే పెద్ద బిల్డింగులాంటిది. దాన్ని ఒదులుకోవడానికి ఎన్నడు సిద్దంగా ఉండరు. రైతులకి "భూమి"ఎంత ముఖ్యమో బస్తి వాసులకి "జాగ" అంతే ముఖ్యం. తమ తమ జాగాలను కాపాడుకోడానికి వాళ్ళు ఎంతకైనా తెగిస్తారు.

♦♦♦

సుమారుగా ఇరవై ఐదు సంవత్సరాల కింద పావని కూడా తమ బతుకుదెరువు కోసం నల్గొండ జిల్లా నకిరేకల్ నుండి హైదరాబాద్‌కి ఒచ్చింది. ఇప్పుడామె ఓ ప్రైవేటు కాలేజిలో లెక్చరర్‌గ పని చేస్తుంది.

ఓ పది సంవత్సరాల కింద బతుకమ్మ కుంట కాడ గుడిసేవాసులని చూసాక ఆమెకు గుడిసె వాసుల మీద

అధ్యయనం చేసి ఏదైన పుస్తకం రాయాలి అని నిర్ణయించుకుంది. ఆ అధ్యయనంలో భాగంగానే ఆమె శ్యామ్ రావు బస్తికి వొచ్చింది. అక్కడి ప్రజలతో మమేకమై వాళ్ళ తలలో నాలుకగా మారింది.

ఎక్కడో పుట్టిన మనిషి, బాగా చదువుకున్న మనిషి. తమ బస్తీకి ఒచ్చి తమ జీవితాల మీద ఒక పుస్తకం రాస్తున్నదని తెలిసి బస్తివాసులంత తెగ సంబరపడిపోయారు. ఎన్నడు వెలుగు చూడని తమ బీద బతుకులు ఇట్లాగైన పదిమందికి తెలుస్తాయని వాళ్ళ ఆశ.

కొత్తలో ఆమె ప్రశ్నలకి క్లుప్తంగా జవాబు చెప్పినా, మెల్లమెల్లగా చనువు పెరిగిన కొద్ది అన్ని విషయాలు మాట్లాడడం మొదలు పెట్టారు. ఆఖరికి సొంత విషయాలు సైతం చెప్పుకోవడం మొదలు పెట్టారు. ఒక్కొక్కరి బాధలు వింటుంటే ఆమె గుండె తరుక్కుపోయేది. చాల సందర్భాలలో వాళ్ళతో పాటు తనూ ఏడ్చేది.

ఆమె వాళ్ళలో ఎంతగా కలగలసిపోయిందంటే, చిన్నవాళ్లైతే ఆమెను "పావనక్క" అంటే,పెద్దోళ్లైతే "పావనమ్మా" అని పిలుస్తారు. బస్తి వాళ్ళు పెదోళ్లైనా మానవ సంబంధాల విషయంలో మాత్రం పేదోల్లు కారు.

♦♦♦

పావని తన కిట్‌ను తీసుకోని శ్యాం రావ్ బస్తి చేరే సరికి అక్కడంతా గోల గోలగా ఉంది. పిల్లలు అల్లరి చేస్తున్నారు. పెద్దలు గదమాయిస్తున్నారు. 80 ఏళ్ళ పూసల రాజవ్వ అర్జెంటుగ అటుఇటు తిరుగుతోంది.

"పామెక్కడ?"అడిగింది పావని. కిట్‌ను కింద పెడుతూ.

అదో పాడువడ్డ మట్టి గోడ. కొంత భాగం కూలిపోయి ఉంది. ఆ గోడలో ఏర్పడ్డ సన్నటి సందులో పాము తిష్ట వేసింది. గోధుమ వర్ణంలో ఉండడంతో అది నాగు పామేనని పసిగట్టగలిగింది.

ఏదో కప్ప కోసం వచ్చినట్టుంది. తెల్లవారుజామున మనుషుల అలికిడి చూసి అది గోడ సందులో దూరి కదలకుండా ఉండిపోయింది.

♦♦♦

అందర్నీ దూరంగా ఉండాలని చెప్పి, పాముకు దగ్గరగా వెళ్ళింది పావని. తన దగ్గర ఉన్న వొంక సీకుతో మెల్లిగా పామును కదిలించి చూసింది. లోపల ఉన్న పాములో కదలికలు మొదలయ్యాయి. అది తలను బయట పెట్టి నాలిక బయటికి చాచి అందర్నీ బయపెట్టినట్టు చూసి లోపలికి వెళ్ళిపోయింది.

అందరు భయంతోను ఆశ్చర్యంతోను నోరెల్లబెట్టారు. కొంత మంది యువకులు తమ సెల్‌లో ద ృశ్యాలని బంధిస్తున్నారు.

మెల్లిగా తోకను దొరికపుచ్చుకొని గట్టిగ పామును బయటికి గుంజాలని చూసింది పావని. కాని కుదరలేదు.. మెల్లిగా గోడ పెచ్చులు ఊడదిసింది. అప్పుడు...పాము అందరికి స్పష్టంగా కనపడింది. తనకున్న దాపును తీసేసే సరికి అది "స(ర)"మని పడగలేపి నలుదిక్కుల చూసింది. అందరు, "వామ్మో...నాగువాము" అంటూ గట్టిగానే అరిచారు. కొందరు నాగరాజని దండం పెట్టుకున్నారు.

పావని పాము వైపు తీక్షణంగా చూస్తూ వొంగింది. తన చేతిలో ఉన్న నీలం రంగు గుడ్డను దానికేసి చుయిస్తూ దాని ద ృష్టిని మరల్చింది. పాము ద ృష్టి అంతా ఆమె వైపు, నీలం రంగు గుడ్డవైపు ఉంది. ఈ లోపున ఎవరో పెద్ద ప్లాస్టిక్ డబ్బా తెచ్చారు. ఆమె చాల టెక్నిక్‌గ ఆ డబ్బాను దాని పడగ మీదుగా బోర్లించేసి మూత పెట్టింది. ఆ డబ్బాను మరో సంచిలో పెట్టేసి బస్తి వాసులకి ఇచ్చి దూరంగా విడిచిపెట్టి రమ్మంది.

"హమ్మయ్య..."అందరు ఊపిరి పీల్చుకున్నారు.

♦♦♦

పావని చుట్టూ గుంపు పోగైంది. ఒక్కొక్కరు ఆమెను అభినందించడం మొదలు పెట్టారు. పూసల రాజవ్వ పావని తలని ప్రేమగా చేతుల్లోకి తీసుకోని బోసినోటితో ముద్దు పెట్టుకుంది. రాజవ్వకి పిల్లలు లేకపోవడంతో పావనిని చూస్తే తన బిడ్డలాగా అనిపిస్తుంది.

"నువ్వు రాకపోతే ఎన్ని అవస్థలు పడాల్సి వొచ్చేదో" అన్నది ఫాతిమాబీ

"అది సరే..నీవేమో బాగా చదువకున్న దానివి. నీకు ఈ పాములు పట్టే విద్దె ఎట్లా అబ్బింది బిడ్డ." అని అడిగింది రాజవ్వ కుతూహలంతో

"హా..అదా..మా కాలేజీల సదాశివ సర్ అని ఒక లెక్చరర్ ఉంటాడు. ఆయన తనకి తెలిసినోళ్ళ దగ్గర ఈ విద్య నేర్చుకున్నడు. ఇగ అప్పటి నుంచి పాములు ఎక్కడ కనపడితే అక్కడ సదాశివ సర్ పోయ్యేటోడు. మీరు నమ్ముతరో నమ్మరో గాని ఇప్పటికి ఆయన ఓ మూడు వేల పాముల్ని పట్టి ఉంటాడు. అందుకే ఆయన్ను "పాముల సదాశివ"అంటుంటారు. ఆయన నేర్పిందే ఈ విద్య.లేకుంటే నాకేం తెలుసు. పాములంటేనే తెగ భయపడేదాన్ని."అంది పావని నవ్వుతూ..

"అక్కా..నాకిది నేర్పుతవా.."అంటూ కళ్ళు గుండ్రంగా తిప్పుతూ అడిగింది పదేండ్ల పార్వతి.

"ఓ..ఎందుకు నేర్పనూ"అంటూ నవ్వి ఆ పిల్లని చేతులతో గుంజి తన ఒడిలో కూచోపెట్టుకుంది. "ముందు నువ్వు చదువుకో..తర్వాత పాములు పడుదువుకని"అంది

"దాని బొంద" అంది పార్వతి తల్లి. "పాము పేరు చెపితేనే ఆమడ దూరం పారిపోతది. ఇది పాముల పడతదా" అనే సరికి అందరు గొల్లున నవ్వారు.

"అది సరే...నాకో డౌట్..." అని అందరి వైపు ప్రశ్నార్థకంగా చూసింది. నేను ఈ రెండు నెలల కాలంల ఒక మూడు నాలుగు పాములన్న పట్టిఉంటా..అంతకు ముందు రెండుమూడు పాములు కరిసినయంటా..ఒకరిద్దరు చనిపోయిన్రట. అసలు ఇన్ని పాములు ఎక్కడినుంచి వొస్తున్నాయి. నేను ఇప్పటిదాంక చాల బస్తీలు తిరిగిన ఇన్ని పాములు నేనెక్కడా చూడలేదు..ఏం సంగతి" అందామె.

అందరు మౌనం అయిపోయారు. ఒకరి మొఖాలు ఒకరు చూసుకున్నారు. ఏదో చెప్పడానికి భయపడుతున్నట్టున్నారు. గలగల మాట్లాడే రాజవ్వ సైతం మౌనం వహించింది.

పావనికి అనుమానం ఒచ్చి చుట్టు పక్కల చూసింది. అక్కడ ఎవరో కొందరు యువకులు అనుమానాస్పదంగా నిలబడి తమ వైపే చూస్తున్నారు. ఏదో మతలబు ఉంది అనుకుందామె.

"అది సరేగాని..రాజవ్వ,...నేనింత కష్టపడ్డ కదా...నాకింత చాయ కూడా పోయవా ఏందీ.." అని నవ్వుతూ అడిగింది పావని.

"అయ్యో దానిదేమి భాగ్యం బిడ్డ...దా..ఇంటికి పోదాం.." అంటూ చొరవగా పావని చేయి పట్టుకొని బయలుదేరింది రాజవ్వ

♦♦♦

వాళ్ళు నడుచుకుంటూ ఇల్లు చేరే సరికి అప్పటికే ముగ్గురు నలుగురు బస్తి యువకులు అక్కడ కూర్చొని ఉన్నారు. పావని ప్రశ్నార్థకంగా చూసింది."మన పిల్లలే" అంది రాజవ్వ భరోసాగా..

అందరు చాప మీద కూర్చున్నారు. చిన్నఇల్లు.. పొందికగా సామాను పేర్చిఉంది. పక్కింటి ఫాతిమాభీ అందరకి ఛాయలు తీసుకొచ్చి ఇచ్చింది.

పావనికి విషయం అర్థమైనట్టు ఉంది.

"ఆ...ఇప్పుడు చెప్పవ్వ..ఈ పాముల సంగతి" అంది చాయ గ్లాస్ కింద పెడుతూ..

"గీ పాములసంగతి ఏమో గాని..మాకు అసలు కొండచిలువ తోటి పానం మీదికొచ్చింది బిడ్డ.."అంది రాజవ్వ

"కొండచిలువ ఏందీ" ఆశ్చర్యంగా అడిగింది పావని

"కొండచిలువ అంటే ఎం లేదక్కా...మా MLA నె..ఆయనకు శాన రోజుల నుంచి మా బస్తి మీద కన్ను బడ్డది. ఎట్లైన మమ్ముల మొత్తం ఎల్లగొట్టి ఆ జాగల పెద్ద కాంప్లెక్స్ కట్టాలని చూస్తున్నాడు...మా బస్తి మెయిన్ రోడ్‌కు దగ్గరగా ఉండుడే మాకు శాపమైంది" అన్నాడు బైండ్ల ప్రకాశ్.

"ఇంతకు ముందే ఈయన ఓ పెద్ద కాంట్రాక్టర్..ఓ ఆరు సంవత్సరాల కింద మా బస్తిని ఎవరో తగలబెట్టిన్రు. అది ఈయన మనుషులే అని మా అనుమానం. ఆ తర్వాత నానా తంటాలు పడి మల్ల ఇండ్లు గట్టుకున్నాం. ఇప్పుడేమో మున్సిపాలిటోల్లని మల్ల ఎగ దోస్తుండు. వాళ్ళొచ్చి ఆ బిల్ అంటరు..ఈ బిల్ అంటరు..ఎక్కడి నుంచి తేవాలి..అన్ని కాలిపోయినయి అంటే వినరు. మాటిమాటికి ఇండ్లు ఖాళీ చేయమంటరు. మేం మనుషులం కామా?యాభై ఏండ్ల నుంచి ఉంటున్నాం ఖాళీ చేయమంటే ఎక్కడికి పోవాలే." మెకానిక్ పాషా ఆవేశంగా అన్నాడు..

"గప్పుడే మా దగ్గర అంబేద్కర్ యువజన సంఘం పుట్టుకొచ్చింది. మేం కష్టపడి చాల మటుకు రేషన్ కార్డ్ లు , వొటర్ కార్డ్లు, ఆధార్‌కార్డ్లు ఇప్పించగలిగాం." అన్నాడు గద్వాల రాజన్న..

"ఏమి కుదరక పోయే సరికి గిప్పుడు ఈ కొత్త ఎత్తు ఎత్తుకున్నాడు బద్మాష్ కొడుకు" అంది రాజవ్వ నిట్టూరుస్తూ..

"కొత్త ఎత్తు ఏందవ్వా.."అడిగింది పావని మరింత కుతూహలంగా

"గదే బిడ్డ...మా మీదకి గీ పాములనొదిలిండు.."

"ఎట్లా..కొంచం వివరంగా చెప్పరాదు(ని"

"అవును బిడ్డ...ఆరు నెలల కింద మా బస్తి మధ్యన ఖాళీ జాగల పాత టైర్లది ఓ షెడ్ ఏర్పాటు ఐంది..ఆ షెడ్ ఏర్పాటు చేయనికి కూడా వాళ్ళు కొంత మందిని బలవంతంగా ఎల్లగొట్టిన్రు.."

"టైర్ల షెడ్ ఏర్పాటు చేస్తే మీకేం నష్టం"

"అసలు మతలబు అంత అక్కడే ఉందక్కా...గా షెడ్ లనే ఎక్కడెక్కడినుంచో పాములు తెచ్చి వొదులుతున్నారు అనేది మా బస్తి వాసుల అనుమానం. అవి టైర్ల మధ్యన, టైర్ల లోపల పాత సామాను మధ్యన ఉండుకుంట రాత్రి పూట

బయటికి వొస్తున్నాయి. కప్పల కోసం, ఎలుకల కోసం మా ఇండ్లల్లకి దూరుతున్నాయి. ఇంతకు ముందు పాములు రాత్రి పూటనే బయటికి ఎల్తుండే. ఇప్పుడు జమానా మారింది కదా అవి కూడా దర్జాగా పగలే బయటికి వొస్తున్నాయి."అన్నాడు పెద్ద రాములు

''ఎవనికి చెప్పుకోవాలి బిడ్డ..రక్షించేటోడే రాచ్చాసుడైపాయే"అంది రాజవ్వ నిట్టూర్పుగా..

"షెడ్ పీకేస్తే సరి.."నవ్వుతూ మెల్లిగా అంది పావని.

"వామ్మో...యాడైతది బిడ్డ...మెల్లగా మాట్లాడు... ఎవరన్న వింటరు..దాని చుట్టూ బయట లోపట దుడ్డే గాళ్ళు కావలి తిరుగుతుంటరు. గట్టిగ అడిగితె భయం..అసలే మాకు నీళ్ళు సరిగ్గా రావు. కరెంటు సప్లై సరిగ్గా ఉండదు.." అంది రాజవ్వ ముగింపుగా..

"ఇదంతా కుదరదు గాని "చంబల్ కె రాజా కొ చెప్పల్ కె పూజా" అన్నట్టు ఎన్నడో ఓనాడు షెడ్‌ని తగలబెడితే సరిపోతది"అంటూ లేచారు యువకులు. వాళ్ళ మొఖాలలో ఒక స్పష్టమైన నిర్ణయం ఏదో చదవగలిగింది పావని.

♦♦♦

ఊరి నడుమ దొరల గడి ఉన్నట్టు బస్తి నడుమ టైర్ల షెడ్ బస్తి వాసులకొక సవాలుగా మారింది. దానిని దాటాలన్నా భయమే.. లోపలికి పోవాలన్నా భయమే.

రాత్రికి రాత్రి ఏర్పాటు చేసిన షెడ్ అంతకంతకు హనుమంతుని తోకలాగ పెరిగిపోయింది. దానికి తోడు పాత సామాను కూడా డంప్ చేయడం మొదలు పెట్టారు. ఎక్కడెక్కడివో పాత టైర్లు వచ్చి పడుతుంటాయి. ఎప్పుడూ దాన్ని కొద్దిమంది యువకులు కాపలా కాస్తుంటారు.

ఈ షెడ్ లోనే పాములని విడుస్తారని, అవి ఆహారం కోసం తమ ఇండ్ల మీదకి ఒస్తున్నాయని తమకి ప్రమాదకరంగా మారాయని బస్తి వాసుల నమ్మకం.

ఆ షెడ్ MLA మనుషులదని వినడంతో ప్రజలు భయంతో మిన్నకుండిపోయారు. బస్తి యువకులు మాత్రం లోలోపల కుతకుతమంటున్నారు. ఇది తమ ఉనికికె ప్రమాదం అని ఎప్పుడో ఒకప్పుడు తగలబెట్టాలనే కసి మాత్రం వాళ్ళలో రోజు రోజుకి పెరిగిపోతోంది.

♦♦♦

గత కొంత కాలంగా తననెవరో నీడలా వెంబడిస్తున్నట్టు పావని అనుమానిస్తోంది. ఎవరో ఏమిటో ఎందుకో తెలవదు.

ఓ రోజు ఓ చోట అంగన్ వాడిలో గర్భిణి స్త్రీలతో మాట్లాడుతుంటే, ఇద్దరు ముగ్గురు పిల్లలు వొచ్చారు. ఆ పిల్లలు కొందరు యువకుల వైపు చూపిస్తూ తన పేరు అడగమంటున్నారని, తన సెల్ కెమెరాలు అడుగమంటున్నారని, ఇక్కడ తిరగడం మంచిది కాదని వెళ్ళిపోవాలని చెబుతున్నారని ఆ పిల్లలు చెప్పుకొచ్చారు.

పావని తలెత్తి చూసింది. చౌరస్తాలో ఓ పది మంది యువకులు నిలబడి ఉన్నారు. అందులో ఒకడు సగం తాగిన బీర్ బాటిల్ ఎత్తి చూపుతూ "తాగుతావా" అనే అర్థంలో ఆమె వైపు చుయిస్తున్నాడు. అందరు ఫక్కున నవ్వారు.

వాళ్ళందరూ MLA మనుషులని అక్కడి వాళ్ళు చెప్పారు. ఈమె బస్తి మీద పుస్తకం రాస్తే పరిస్తితులు బయట పడి తనకు చెడ్డ పేరు వొస్తుందని అందుకే ఆమెను దబాయించి పంపిస్తే అడిగేవారు ఉండరు అని MLA పథకం.

ఈ సమస్య ఉన్నందు వల్లే తన వెంట రావడానికి తన స్నేహితురాళ్ళు ఎప్పుడు సంకోచిస్తుంటారు.

♦♦♦

అగ్నికి ఆజ్యం తోడైనట్లు పావనికి ఇంట్లో కూడా పోరు మొదలైంది. మొదటి నుంచి ఆమె భర్తకి ఆమె చేస్తున్న పని అసలు నచ్చలేదు. ఉండీఉండీ ఈ మురికి వాడల మీదనే పుస్తకం రాయడం ఏంటి? ఇంకా ఏ సబ్జెక్టు దొరకలేదా..పైగా అక్కడంత అలగా జనం. రౌడీలు, వ్యభిచారులు తిరుగుతుంటారు. ఎవరితో ఏ తంటా ఒస్తుందో. ముఖ్యంగా MLA మనుషుల గురించి తెలిసాక అతని పోరు మరింత ఎక్కువైంది.

"నువ్విట్లే తిరుగుతూ ఉంటె నేనూ, బాబు వేరే ఉంటాము" అని బెదిరించాడు కూడా..

దీనికి తోడు స్నేహితుల వెక్కిరింతలు కొక్కిరింతలు ఎక్కువైయ్యాయి. ఎవరైనా "పావని ఎక్కడ?"అని వాకబు చేస్తే "ఇంకెక్కడ ఉంటది..ఎదో "స్లం"లో తిరుగుతుంటది" అని కుళ్ళు జోకులు వేస్తుంటారు.

పావనికి మొదట్లో ఇదంతా బాధ అనిపించింది. కొన్ని సార్లు ఒంటరిగా ఏడ్చేది. తర్వాత మెల్లిమెల్లిగా కుదుట పడ్డది."ఒకపని చేయాలనుకున్నపుడు అనేక అవాంతరాలు ఒస్తాయి.వాటిని ఎదురుకొని సాధించడం లోనే మనిషి గొప్పతనం బయట పడుతుంటది" అనేది తండ్రి ఆనందరావు.

♦♦♦

ఆ రోజు ఏరియా హాస్పిటల్ శ్యాం రావు బస్తి వాళ్ళతో నిండి పోయింది. అందరి మొఖాల్లోను విపరీతమైన ఆందోళన.

కొందరైతే బిగ్గరగా ఏడుస్తున్నారు. బస్తి యువకులు హడావిడిగా అటుఇటు తిరుగుతున్నారు. రాజవ్వ ఎదో పోగొట్టుకున్నట్టుగా వరండాలో కూలబడి శూన్యంలోకి చూస్తోంది.

"ఎంత మంచిదో బిడ్డ, మా మేలు కోరి వొచ్చి తన పానం మీదకి తెచ్చుకున్నది" తనలో తానె గొణుక్కున్నది రాజవ్వ

''ఇదంతా ఎట్లా జరిగింది అవ్వా..'' అడిగింది కూరగాయల సుశీల

"ఏం చెప్పాలే బిడ్డ..పొద్దున్నే బస్తి మనుషులని కల్వనికే ఒచ్చింది పావనమ్మ. వాళ్ళు చెప్పింది రాసుకున్నది. పగటాల ఇంత తిని..తలనొప్పి వొస్తున్నది. జరసేపు పడుకుంట అని మా ఇంట్ల జరసేపు నడుం వాల్చింది. గా పాము మీద మన్ను వొయ్య. యా రాళ్ళల ఉన్నదో, జారట్ల ఉన్నదో, నల్ల నాగు…ఎప్పుడొచ్చిందో ఎప్పుడు కరిసిందో తెలవదు."

"అయ్యో ఇప్పుడెట్లుంది?"

"తెల్వదమ్మ…సగం సగం అంటున్నరు. మా బస్తీకి బిడ్డ లాంటిది. అందరి తలల నాలికలాగుండె. మా కోసం ఒచ్చి తన పానం మీదకి తెచ్చుకుంది."

"గీ టైర్ల షెడ్ వొచ్చినాంకనే కంటికి కునుకు లేకుండ వోయింది అవ్వా..ఏ పాము ఎక్కడినుంచి వొస్తుందో ఎప్పుడు కరుస్తదో అనే భయం. పిల్లలు రాత్రి పూట భయం తోటి ఒంటేలుకు పోసుకుంటున్నరు. పెద్దలకి నిద్ర పడ్తలేదు"

"ఈ పాములు మనల్ని వొదలవు గాని మనమే వాటిని ఒదిలించుకోవాలి…దీనెమ్మ" అటుగా వొచ్చిన కావలి భీముడు కోపంగా అరుస్తూ పోయాడు.

◆◆◆

ఆ రోజు బస్తీకి బస్తి దండులాగా కదిలింది. ఏదో యుద్దానికి బయలుదేరినట్టుగా ఉంది పరిస్థితి. అంత గొడవగొడవగా ఉంది. కొందరి చేతుల్లో కిరోసిన్ డబ్బాలు బాటిళ్ళు ఉన్నాయి. అందరి కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నాయి. అందరు షెడ్ ను చుట్టుముట్టారు.

ముందు జాగ్రత్తగా కొంతమంది బస్తి యువకులు వెళ్లి అక్కడ కావలికాసే వాళ్ళని చుట్టుముట్టి సెల్‌లు గుంజుకొని తన్నితరిమేసారు.

గేటును ఇరగదన్ని యువకులు షెడ్ లోకి ప్రవేశించారు. అంతటా కోలాహలం… గుమిగూడిన జనం అరుస్తున్నారు. కొందరు గట్టిగ మాట్లాడుకుంటున్నారు. కొందరు ఏం జరగనుందోనని కుతూహలంగా చూస్తున్నారు.

"ఇంకా చుస్తరెందిరా తగలబెట్టండి…" రాజవ్వ గట్టిగ అరిచింది. ఆ రోజు రాజవ్వ శిగమొచ్చినదానిలా ఉంది.

"మొత్తానికి మొత్తం మాడి మసైపోవాలి."ఫాతిమాభి తోడందుకుంది.

యువకులు తమ వెంట తెచ్చిన కిరోసిన్‌ను గుట్టలుగా పడి ఉన్న టైర్ల మీద పాత సామాన్ల మీద చుట్టూ చల్లారు.

''నేనంటి పెడతా'' అంటూ ముందుకొచ్చింది రాజవ్వ..ముసలమ్మ ధైర్యం చూసి అందరు ముక్కున వేలేసుకున్నారు.

ఓ యువకునిదగ్గరి నుండి అగ్గిపెట్టె గుంజుకొని పుల్ల గీసి టైర్ల మీద పడేసింది. ఒక క్షణం నిశబ్దం. మంటలు చిటపట రేగాయి. మంటలతో పాటు పొగ లేచి టైర్ల వాసన గాలంత కమ్ముకున్నది. అందరు నిశబ్దంగా చూస్తుండి పోయారు.

ఊహించినట్టుగానే మండుతున్న టైర్లు పాత సామాను నుండి మంట దెబ్బకి ఉక్కిరిబిక్కిరైన పాములు ఒకటొకటిగా బయటికి రాసాగాయి. ఎన్ని రకాల పాములో…చిన్నవి, పెద్దవి కట్ల పాములు,నాగుపాములు, జెర్రిపోతులు. ఒఖ్…జనం నోరెళ్ళబెట్టి చూసారు. అవి విపరీతమైన భయంలో ఉన్నట్టున్నాయి. ఏం చేసైన అక్కడినుంచి తప్పించుకోవాలనే తత్తరపాటులో ఉన్నాయి.

జనం వాటిని చుసిన వెంబడే వెర్రికేకలు వేసారు. ఒచ్చిన పామును ఒచ్చినట్టుగా కట్టెలతో కొట్టి చంపడం మొదలుపెట్టారు. కొంత మంది అదే కట్టెలతో పాములను మంటల్లోకి తోస్తున్నారు. పాములకి దిక్కుతోచక ప్రాణ భయంతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. అన్ని దార్ల దగ్గర యువతి యువకులు కట్టెలతో నిలబడి ఒచ్చిన వాటి పనిబడుతున్నారు.

అక్కడ పదేళ్ళ పార్వతి కూడా కట్టె పట్టుకొని నిలబడడం అందరిని ఆశ్చర్య పరిచింది. ఇవ్వాల ఒక్క పామునైన చంపుతాను….అన్నట్టుగా నడుముకు చేతులు పెట్టుకొని నిలబడి వుందా పిల్ల.

మంటలు భగ భగ పైకి లేచాయి. ఆ మంటలు చూసి పిల్లలు కేరింతలు పెట్టారు. రాజవ్వ ఐతే పసిపిల్లైపోయింది.

బైటికి రాలేని పాములు లోపల ఉడికి చచ్చాయి. బతికి ఒచ్చినవి పిల్లల్ల చేతిల చచ్చాయి.

వాల్లకాటైమ్‌లో MLA, అతని గూండాలు, కేసులు లాంటివి ఏమి గుర్తు రాలేదు. "తమ బస్తిని రక్షించుకోవడానికి

కవిత

# తొలి దారిలో

రవి నన్నపనేని
9182181390

పోక పోక మా ఊరుబోయా

ఏ గూటిదో గోరింక పిట్ట
'ఎవ్వడ్రా నువ్వు' అన్నట్టు ఎగిరి పోయింది
బురద బర్రె చిరాగ్గా
తోక చర్నాకోలు ఇసురుతూ పరిగెత్తింది
ఊరకుక్క
మొరిగింది అనుమానపు చూపుల్తో–



పోక పోక మా ఊరుబోయా

మొకమంతా ముద్దాడి
పెద్దబాయి
చల్లని నీటితో సేదదీరిసింది
నక్కేరు చెట్టు
గాలి చేతులతో ఒళ్ళంతా తమిడి
గొడుగు నీడయ్యింది
పందిరి కింద కుక్కిమంచం
పట్టెమీద కూసో బెట్టుకుంది కాసేపు
ముసలోడి వాసన్తో –

పోక పోక మా ఊరుబోయా
తాటి చెట్టు
బరాబరా పలకరించింది
బొంగురు గొంతుతో
ఎండకి వెచ్చబడి
ఎవ్వరూలేని అరుగుబండ సరసమాడింది
చురుక్కుమంటూ మెడ పైకెత్తి చూసి
అటూ ఇటూ తలదిప్పి
మెదలకుండా
పురుగులేరుకుంటోంది దిబ్బలో కోడి –

పోక పోక మా ఊరుబోయా
బాసలో
యాస పుట్టింది
మనసులో
యాది కదిలాడింది
దేహంలో
మట్టి చిగురుబెట్టింది
పోక పోక మా ఊరు బోయా –
మా ఊరు మనుషులు
మరిచిపోలేదింకా మరియాద !

◆

---

ఆ దేవుడితోనైన కోట్లడతాం." అనే దిక్కారమే వాళ్ళని ముందుకు నడిపించింది. ఎన్నడు లేని కాంతి వాళ్ళ కళ్ళను వొచ్చి చేరింది.

" ఏ కవి రాయని కావ్యం
ఏ కుంచె దించని దృశ్యం "

చూస్తుండగానే టైర్ల షెడ్ భస్మీపటలం అయిపోయింది. ఆ మంటలు తాకి అక్కడున్న చింతచెట్టు సైతం సగం కాలిపోయింది.

ఆ రాత్రి బస్తి వాసులంత గుండెల మీద చేతులేసుకొని హాయిగా నిద్ర పోయారు.

◆◆◆

"హలో పావనక్కా..." పొద్దున్నే సెల్ మొగింది

"హలో..ఎవరు.." పావని జవాబిచ్చింది.

"అక్కా..నేను శీనును... శ్యాం రావు బస్తి... గుర్తుపట్టినవ?"

"ఓ శీను నువ్వా...ఎందుకు గుర్తు పట్టలేదు...పాటలు బాగా పాడుతావు కదా..."

"అవునక్క..ఆరోగ్యం బావుందా.."

"బాగుంది..చెప్పు.."

"ఏం లేదు అక్కా..టైర్ల షెడ్ తగల బెట్టేసినం..పాములు గీములు మాడి మసైపోయాయి."

"ఓ..నిజమా...సర్పయాగం చేసిన్రన్నమాట...."

"నిజం అక్కా..అంత బూడిదయ్యింది."

"వావ్...గ్రేట్"

"అక్కా..ఇది నీ పుస్తకంలో రాయాలి "

"ఓ ఎస్ తప్పకుండా.."

◆

# స్వీకారం




## అక్షర కింకిణులు సాహిత్య వ్యాసాలు

**ఎస్. ఆర్. పృథ్వీ**

వెల : 80/- పేజీలు: 76

ప్రతులకు : 9989223245

ఈ వ్యాస సంపుటిలో 13 వ్యాసాలున్నాయి. ఏ వ్యాసానికి ఆ వ్యాసం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా కవిత్వంలో అమ్మ మీద ఎన్నో పరిశోధనలు జరిగాయి. పృథ్వీ కూడా తెలుగు కవిత్వంలో అమ్మ గురించి, తెలుగు కవిత్వంలో తండ్రిపై పరిశీలన చేసి వ్యాసాలు అందించారు.

**- డాక్టర్ ఎస్. శరత్‌జ్యోత్స్నారాణి**




## మతలబు కవిత్వం


**నిధి**

వెల :70/- పేజీలు: 88

ప్రతులకు: 9701000306

పలికే సప్తస్వరాలలో తంత్రిని నేను/ నర్తించే పాదాల మువ్వలు నేను/ జాలు వారిన అక్షరాల ఘంటం నేను / బ్రతుకును రంగుల్లో చిత్రించే కుంచెను నేను / నేను రైతు నాగలినే కాదు / సాలీల మగ్గాన్ని - కుమ్మరి సారెను / గౌడుల కత్తిని - మాదిగల ఆరెను / మంగలి కత్తెరను - జాలరి పడవను / సమస్త వృత్తుల పనిముట్లును నేను”

**- నిధి**




## వెండిగిన్నెలో పాలబువ్వ

**స్వాతి అనిల్ అవార్డు పొందిన నవల**

**సింహప్రసాద్**

వెల : 70/- పేజీలు: 160

ప్రతులకు: 9849061668

‘వెండిగిన్నెలో పాలబువ్వ’ నవలలో రచయిత కనిపించడు. పాత్రలే సంభాషణల ద్వారా కథను నడిపిస్తాయి. సింహప్రసాద్ రచయితగా సాగించిన ప్రయాణాన్నీ, సాధించిన పరిణతినీ నిరూపించే శిల్పం అది. సింహప్రసాద్ గాలిలో తేలుతూ రచన చేసే రకం కాదు. ఆయన సృష్టించే పాత్రలూ అంతే. నిబ్బరంగా నేల మీద నడిచేవే.

**- వక్కంతం సూర్యనారాయణ రావు**




## నాన్నకు సలామ్ కథలు

**షెహనాజ్ బేగం**

వెల :100/- పేజీలు: 111

ప్రతులకు: 9849229786

మనచుట్టూ కనిపిస్తున్న సంఘటనలకు స్పందిస్తూ రాసిన కథలు. కుటుంబ సంబంధాలు, ఆర్థిక అసమానతలపై చక్కగా రాశారు. ఈ కథలలో క్లుప్తతతో పాటు చెప్పదలచుకున్న విషయాలు సూటిగా పాఠకుల హృదయాలకు చేరతాయి. కథలన్నీ మన చుట్టూ అల్లుకున్న జీవితాలే.

**- డా॥ ఎ. ఎ. నాగేంద్ర**




## అమ్మ మనసు కథల సంపుటి

**షెహనాజ్ బేగం**

వెల :100/- పేజీలు: 56

ప్రతులకు: 9849229786

షహనాజ్ బేగం కథలలో సాంప్రదాయాల్ని పాటిస్తూ కుటుంబ విలువలు పెంపొందించే సృజన కనిపిస్తుంది. కథలన్నీ మన చుట్టూ ఉన్న జీవితాలతో మాట్లాడుతున్నట్లు సహజంగా ఉంటాయి. సంఘర్షణలు, సంఘటనలు, మానవీయ స్పర్శ ఉన్న కథలు ఇవి. పాఠకుడ్ని ఏకబిగిన చదివించే రచనా విధానం ఈ కథలలో కనిపిస్తుంది.

**- డా॥ ఎ. ఎ. నాగేంద్ర**




## తెలుగు విలాపం

**సంకలనం: అడపా రామకృష్ణ**

వెల :50/- పేజీలు: 42

ప్రతులకు: 9505269091

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు మాధ్యమాన్ని తొలగించడం ఎందరినో కలిచివేసింది. అంతర్జాతీయంగా అనేక అధ్యయనాలు, పరిశోధనలూ ప్రాథమిక విద్యను మాతృభాషలో బోధించడమే శాస్త్రీయమని ఘోషించాయి. అమలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో అడపా రామకృష్ణ ‘తెలుగు విలాపం’ పేరుతో ఈ సంకలనం తీసుకొచ్చారు. ప్రముఖ రచయితలు, మేధావులు మాతృభాష మాధ్యమంగా ఉండాల్సిన అవసరాన్ని తమ మాటల్లో చెప్పారు. విలువైన ఈ మాటలు సంకలనం చేసిన అడపా రామకృష్ణ అభినందనీయుడు.

# గుడిపాటి వెంకటచలం


19.05.1894 - 04.05.1979



చలం సాహిత్యానికి కేంద్ర బిందువు స్త్రీ. స్త్రీ, ప్రేమలేఖలు, మ్యూజింగ్స్ లాంటి వ్యాస సంపుటాలు, ఓ పువ్వు పూసింది, కన్నీటి కాలవ లాంటి కథలు, మైదానం, బ్రాహ్మణీకం లాంటి నవలలు, పురూరవ, సావిత్రి లాంటి నాటకాలు అనేకం రాశాడు. ఈయన వస్తువు, శైలి కూడా ఆంధ్ర సాహిత్యాన్ని మలుపు తిప్పింది.

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 1 ▪ SANCHIKA - 8 ▪ KRISHNA ▪ MAY 2020
RNI N0.APTEL/ 2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES: 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication: 13.05.2020


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు



పండుగలు - ప్రజాసంస్కృతి
పేజీలు 48 రూ. 40/-

మనం నిత్యం జరుపుకునే పండుగలు, ఉత్సవాలు, జాతరలు, కొలుపులు మొదలైనవన్నీ మన సంస్కృతిలో భాగం. ఇవన్నీ మతపరమైనవి కావు. కొన్ని పండుగలు పూర్తిగా మానవుని ఉత్పత్తికి సంబంధించి- అంటే వ్యవసాయం, పశుపోషణ వంటి వాటికి సంబంధించి ఉంటాయి. కొన్ని ప్రకృతిపై మానవుడు విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని జరుగుతుంటాయి. కొన్ని పండుగలు పూర్తిగా మతనమ్మకాలు, కథలపై ఆధారపడి ఉంటాయి. అయితే వీటన్నిటినీ ఇలా పూర్తిగా విడదీసి చూడ్డం కూడా కష్టం. వాటిని ఏవిధంగా చూడాలి అన్న ప్రశ్నకు సమాధానం ఈ చిన్న పుస్తకం.

## ప్రతిభామూర్తులు పసిడి పలుకులు



పేజీలు 80
రూ.65/-

వివిధ రంగాల్లో నిష్ణాతులైన కొందరి ప్రతిభా మూర్తుల ఇంటర్వ్యూల సమాహారం ఈ 'ప్రతిభా మూర్తులు - పసిడిపలుకులు' పుస్తకం.. నాట్యం, సినిమా, ఫొటోగ్రఫీ, శిల్పకళ, సాహిత్యం, మిమిక్రీ తదితర రంగాలలో వెలుగొందిన, వెలుగొందుతున్న వారి జీవిత అనుభవాల సారమంతా ఈ చిన్ని పుస్తకంలో లభ్యమవుతుంది.

## వేద సాహిత్యం
### ఒక చారిత్రక పరిశీలన



పేజీలు 32
రూ.25/-

15 వేల ఏళ్ల సుదీర్ఘ కాల వ్యవధిలో రూపొందిన వేద వాఙ్మయపు అభివృద్ధి గతిని గురించి తెలుసుకోవాలంటే ప్రాచీన భారతీయ చరిత్రలోని తొలి ఘట్టాల వరకు వెళ్ళాలి. వీటన్నింటికి సంబంధించిన సమగ్ర సమాచారం ఈ పుస్తకంలో లభిస్తుంది.

## గౌతమ బుద్ధుడు - బౌద్ధతత్వం




పేజీలు 32
రూ.25/-

బుద్ధుడి మూల బోధనలు, సిద్ధాంతాల నుంచి తరువాత కాలంలోని బౌద్ధధర్మం ఎంత దూరంగా మళ్ళిందో నిర్ధారించడానికి ఈ పుస్తకంలో అనేక ఉదాహరణలు పేర్కొనబడ్డాయి.

బౌద్ధతత్వంలోని ప్రయోజనకరమైన అంశాలను అధ్యయనం చేయడం, అదేవిధంగా బౌద్ధధర్మం చరిత్రకు సంబంధించిన మరుగునపడ్డ అసలు వాస్తవాలను వెలికితీసి గౌతమ బుద్ధుని మూల సిద్ధాంతాల సారాంశం వివరించడమే ఈ పుస్తకం ఉద్దేశం.

## భారతీయ భౌతికవాదం
# లోకాయత



పేజీలు 32
రూ.25/-

భారతీయ భౌతికవాదం మొదటినుంచి ఆధునికయుగం వరకు ప్రపంచంలో అన్నిచోట్లలాగే భారతదేశంలోనూ భౌతికవాద భావస్రవంతి కొనసాగుతూనే వచ్చిందని బలమైన ఆధారాలతో ఋజువు అయ్యింది. అటువంటి భౌతికవాద భావస్రవంతిలో ఒకటైన లోకాయత గురించి వివరించేదే ఈ పుస్తకం.

**ప్రజాశక్తి బుక్‌హౌస్**
27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533
**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం

**If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059**